
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఫోన్ ట్యాపింగ్ కేసు
మాజీ మంత్రి హరీష్‌రావుకు
## సిట్ నోటీసులు
నేడు తమ ఎదుట హాజరుకావాలని అధికారుల సూచన

03

సంపుటి 09, సంచిక: 52 | మంగళవారం | 20-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకున్న ఎంజి నరేగాకు బిజెపి సర్కార్ తూట్లు

# ఉపాధి హామీ పథకం పరిరక్షణకు ఉద్యమాలు

- కార్పొరేట్ సంస్థల కోసం పేదల పథకం రద్దు
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపాటు

ప్రజాపక్షం/ ఖమ్మం

వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని కార్పొరేట్‌కు సానుకూలంగా వ్యవహరిస్తూ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం సోమవారం ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డి.రాజా మాట్లాడుతూ అనేక ఏళ్ల పాటు వామపక్ష పార్టీలు పోరాడి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాధించాయని ఇప్పుడు బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలు 40 శాతం వ్యయం భరించాలంటూ పథకానికి తూట్లు పొడుస్తున్నదని తెలిపారు. గ్రామీణ పేదల కోసం తీసుకు వచ్చిన ఈ పథకాన్ని కార్పొరేట్ సంస్థల కోసం రద్దు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాం, కేరళ రాష్ట్రాల్లో వివిధ రాజకీయ పక్షాల పరిస్థితిని ఆయన వివరించారు. మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు కలిసి వచ్చే తరువాయి 2లో

## సిపిఐ ఆధ్వర్యంలో నేడు సెమినార్

హాజరుకానున్న వామపక్ష నేతలు రాజా, ఎంఎ బేబీ, భట్టాచార్య, దేవరాజన్

02

# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

- పోరాడి సాధించిన హక్కులను హరిస్తున్న మోడీ
- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్



ప్రజాపక్షం/ ఖమ్మం

మోడీ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించకుండా పార్లమెంటులో ఎటువంటి ఆమోదం పొందకుండానే నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చిందని వాటిని రద్దు చేయాల్సిందేనని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపారు. 44 కార్మిక చట్టాల స్థానే నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలతో చర్చించకుండా తీసుకు వచ్చిన రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 10 జాతీయ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న చారిత్రక సమ్మెకు తరువాయి 2లో

# అధికార కేంద్రీకరణకు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ యత్నం

- అధికార వికేంద్రీకరణను బలంగా విశ్వసిస్తున్న కాంగ్రెస్
- ఓటు హక్కు పౌరుల గళాన్ని ప్రతిధ్వనింపజేస్తుంది
- కోచిలో జరిగిన కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల సభ్యుల మహాపంచాయత్‌లో రాహుల్‌గాంధీ



**కోచి:** బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు అధికార కేంద్రీకరణకు ప్రయత్నాలు చేస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. అదేసమయంలో కాంగ్రెస్‌పార్టీ అధికార వికేంద్రీకరణను బలంగా విశ్వసిస్తుందన్నారు. కేరళలోని స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్–యుడిఎఫ్ పనితీరును ఆయన ప్రశంసించారు. గ్రామీణ పునాదిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం,అధికారాల వికేంద్రీకరణ విధానాన్ని కాంగ్రెస్‌పార్టీ చాలా బలంగా విశ్వసిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. కాంగ్రెస్–బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య భేదాన్ని ఆయన వివరిస్తూ, కాంగ్రెస్‌పార్టీ అధికార వికేంద్రీకరణకు కట్టుబడి ఉంటే, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు అధికార కేంద్రీకరణకు తాపత్రయపడతాయన్నారు. ఓటు హక్కు పౌరుల గళాన్ని ప్రతిధ్వనింపజేస్తుందని, అదే ప్రజాస్వామ్య మౌలిక సూత్రమని, అందువల్ల పౌరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను, వారి గళాన్ని అనివార్యంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వారు (బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్) దేశం కోసం ప్రజల సమ్మతిని అడుగుతారుగానీ, భారతదేశ ప్రజాగళ సమ్మతి వారికిఅవసరం లేదని విమర్శించారు. కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల సభ్యుల మహాపంచాయత్‌ను ఉద్దేశించి కోచిలో రాహుల్‌గాంధీ సోమవారం మాట్లాడుతూ, రాజ్యాంగానికి కీలకమైన 73,74వ సవరణలు చేయడం ద్వారా కాంగ్రెస్ అధికారాన్ని పునాదిస్థాయిలో వికేంద్రీకరించి మూడు అంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను దేశంలో అమలులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. మహాత్మాగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)పై బిజెపి నాయకత్వాన ఎన్‌డిఎ కూటమిదాడి చేస్తోందని, ఎందుకంటే స్థానిక ప్రభు త్వ వ్యవస్థల ద్వారా ఈ ఉపాధి హామీ పథకా న్ని అమలు చేస్తున్నందువల్లనే దీనిపై తరువాయి 2లో



# మేడారం గద్దెలు భక్తులకు అంకితం

- ఆలయ ప్రాంగణం పునఃప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి
- జాతరను ఇంకా అభివృద్ధి చేస్తామని హామీ

ప్రజాపక్షం/ములుగు

మేడారంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భక్తులకు అంకితం చేశారు. ఆదివాసీ సంస్కృతి ఉట్టి పడేలా అత్యద్భుతంగా పునర్నిర్మాణం చేసిన ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన మేడారం మహా జాతరను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం రాత్రి మేడారంలో బస చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి పనులు, పునర్నిర్మాణం చేసిన ఆలయంలో కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ ప్రాంగణాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కుటుంబ సమేతంగా వన దేవతలను దర్శించుకొని తరువాయి 2లో

## సిఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన

పెట్టుబడుల ఆకర్షణకు స్విట్జర్లాండ్ వెళ్లిన సిఎం బృందం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు వెళ్ళింది. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయష్ రంజన్, సంజయ్ కుమార్, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, అధికారుల బృందం దావోస్ పర్యటనకు వెళ్లారు. ఈ నెల 20 నుంచి నాలుగు రోజులపాటు దావోస్‌లో జరిగే సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కంపెనీల సిఇఒలు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత స్థాయి భేటీలు నిర్వహించనున్నారు. దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వేదికగా గూగుల్, సేలోఫోర్స్, యూనిలీవర్, హనీవెల్, ఎల్‌ఓరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డిపి వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ సంస్థల అధినేతలతో సీఎం విడివిడిగా భేటీ కావడంతో పాటు పలు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, ఐటి, ఎఐ, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరుపుతారు.'తెలంగాణ రైజింగ్ విజన్– 2047'ను, రాష్ట్రంలో వివిధ రంగాల తరువాయి 2లో

# డిజిటల్ అరెస్ట్.. భయోత్పాతం

- నిమిషాల వ్యవధిలోనే కోట్లు కొల్లగొడుతున్న మోసగాళ్లు
- వివిఐపి, విఐపిలతో పాటు విద్యావంతులు, ఐటి ఉద్యోగులూ బాధితులే
- అప్రమత్తమైన టిజిసిఎస్‌బి



'మీపై కేసు ఉంది'.. భయమే మోసానికి మూలం

ప్రజాపక్షం/హైదరాబాద్

డిజిటల్ యుగంలో తెలంగాణ ప్రజలు మరో కొత్త ముప్పును ఎదుర్కొంటున్నారు. సాంకేతికతను ఆయుధంగా మార్చుకున్న సైబర్ మోసగాళ్లు ఇప్పుడు 'డిజిటల్ అరెస్ట్' అనే కొత్త పదాన్ని ప్రవేశపెట్టి సామాన్య ప్రజల జీవితాల్లో భయాందోళన సృష్టిస్తున్నారు. నిమిషాల వ్యవధిలోనే కోట్ల రూపాయల్ని కొల్లగొడుతూ, బాధితులను ఆర్థికంగా, మానసికంగా కుదేలుచేస్తున్నారు. బాధితుల్లో వివిఐపి, విఐపిలతో పాటు విద్యావంతులు,ఐటి ఉద్యోగులు ఇలా ప్రతి రంగానికి చెందిన వారు ఉండడం విశేషం.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ నేరాల్లో డిజిటల్ అరెస్ట్ మోసాలే అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఉద్యోగులు, వ్యాపారులు, వృద్ధులు, మహిళలు ఎవ్వరినీ వదలడం లేదు. ఒక ఫోన్ కాల్‌తో మొదలై, వీడియో కాల్ ద్వారా బెదిరింపులకు దారి తీస్తున్న ఈ మోసాలు ప్రజల నిద్రను హరించేస్తున్నాయి. తెలంగాణలో 2024లో సుమారు 1,14,000 పైగా సైబర్ నేరాలు నమోదు అయ్యాయ. తద్వారా బాధితులు రూ.1,866.9 కోట్లు కోల్పోయారు. ఇక 2025లో 93 వేలకుపైగా సైబర్ ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో డిజిటల్ అరెస్టు పేరుతో రూ.176 కోట్లు నేరగాళ్లు కొల్లగొట్టారు. 2024తో పోల్చితే 2025లో 30 శాతం వరకు తగ్గాయి. 2025లో టిజిసిఎస్‌బి అధికారులు 228 మంది సైబర్ నిందితులను అరెస్టు చేసింది.

సిబిఐ, ఇడి, పోలీస్, నార్కోటిక్స్ బ్యూరో అధికారులమంటూ నకిలీ ఐడిలతో వీడియో కాల్స్ చేస్తున్నారు. మీ ఆధార్, మొబైల్ నంబర్ అక్రమ లావాదేవీలకు ఉపయోగించారు, మనీ లాండరింగ్ కేసులో మీరు నిందితులు అంటూ తీవ్రంగా బెదిరిస్తున్నారు. ఇప్పుడే సహకరించకపోతే అరెస్ట్, బ్యాంక్ ఖాతాలు సీజ్ అని భయపెట్టడంతో బాధితులు ఆలోచించకుండానే బ్యాంక్ తరువాయి 2లో

## బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నిక!



నేడు అధికారికంగా ప్రకటన : అనంతరం బాధ్యతల స్వీకరణ!

**న్యూఢిల్లీ :** బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. అధ్యక్షుడి పదవి కోసం నితిన్ నబీన్ తరఫున 37 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ప్రకటించారు. ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షుడు జెపి నడ్డా నితిన్ తరఫున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజు, పలువురు బిజెపి ఎంపిలు పాల్గొన్నారు. తర్వాత నితిన్ నబీన్‌కు మద్దతుగా బిజెపి ముఖ్యమంత్రులు, సీనియర్ నేతలు, అన్ని రాష్ట్రాల బిజెపి అధ్యక్షులు లేఖలను తరువాయి 2లో

# అమెరికా తనను శిక్షించేవారే లేరనుకుంటోంది

- ప్రమాదంలో పడిన ఐక్యరాజ్యసమితి ప్రాథమిక సూత్రాలు
- చట్టాలకు కట్టుబడి ఉండేలా అదుపు చేయడంలో ఇబ్బందులు
- సంఘర్షణల పరిష్కారానికి ఐరాసలో సంస్కరణలు తేవాలి
- ఆంటోనీ గుటెర్రెస్ వ్యాఖ్య



**లండన్:** అంతర్జాతీయ చట్టాలకు తన అధికారం అతీతమైనదని అమెరికా భావిస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ విమర్శించారు. బిబిసి '4 టుడే' కార్యక్రమంలో పాల్గొన్న గుటెర్రెస్ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల మధ్య సమానత్వం–సమితి వ్యవస్థాపక ప్రాథమిక సూత్రాలు ఈనాడు అత్యంత ప్రమాదంలో పడ్డాయని తాను నమ్ము తున్నానని ఆయన స్పష్టం చేశారు. సంస్థ ప్రాథమిక సూత్రాలు, చట్టాలకు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు కట్టుబడి ఉండేలా అదుపు చేయడంలో తాను చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుటెర్రెస్ అంగీకరించారు. ప్రపంచదేశాల సమస్యలను పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి నిబద్ధతతో కట్టుబడి ఉందని, కానీ దానికి ఎలాంటి పరపతీ లేదన్నారు. పెద్ద శక్తులకు (బలమైన దేశాలు)బలమైన పరపతి ఉందని అన్నారు. ఈ పెద్ద శక్తులకు ఉన్న బలమైన పరపతి ప్రపంచంలో వస్తున్న సంఘర్షణలకు నిజమైన, శాశ్వత తరువాయి 12లో



# విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ప్రతి ఇల్లూ మారాలి

- సోలార్ మోడల్ విలేజ్ దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ బోనకల్

ప్రతి ఇల్లు, వ్యవసాయ పెంపు సెట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సోలార్ మోడల్ విలేజ్ కార్యక్రమం దేశంలోనే కాదు ప్రపంచంలో ఓ విప్లవాత్మక కార్యక్రమం అని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం బోనకల్ మండలం రావినూతల గ్రామంలో డిప్యూటీ సిఎం సోలార్ మోడల్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి చేసిన సోలార్ విద్యుత్‌ను గృహ వినియోగదారులు, వ్యవసాయదారులు వాడుకున్నంత వాడుకుని మిగిలినది రాష్ట్ర విద్యుత్‌శాఖకు అమ్ముకునేలా రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 12లో

# సాంకేతిక నైపుణ్యంతో యువతకు ఉపాధే లక్ష్యం

మంత్రులు గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం / చెన్నూర్ /కాగజ్ నగర్

ప్రజలతో మమేకమై ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండల కేంద్రంలో రూ.47 కోట్ల 11 లక్షలతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ మాట్లాడుతూ యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో రూ.40 కోట్లతో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అర్హులైన తరువాయి 12లో



## అమెరికాపై ఇయు ప్రతీకార సుంకాలు!

### గ్రీన్‌లాండ్‌పై మిత్రభేదం



బ్రసెల్స్ : గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించే విషయంలో అమెరికాను వ్యతిరేకించిన యూరప్ దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు ట్రంప్ విధించడంతో తాజాగాఆ యూరోపియన్ యూనియన్ కూడా ప్రతీకార సుంకాలు అమలు చేసే ఆలోచన చేస్తోంది. అమెరికాపై 93 బిలియన్ పౌండ్ల (108 బిలియన్ డాలర్లు) మేరకు ప్రతీకార సుంకాలు విధించేందుకు యూరోపియన్ కూటమి దేశాలు సిద్ధమవుతున్నాయని చైనా పత్రిక వెల్లడించింది. యూరోపియన్ యూనియన్ కూటమి మార్కెట్‌లోకి అమెరికా కంపెనీలను అడ్డుకోవడంద్వారా కూటమి దేశాలకు కలుగుతున్న బాధ ఏమిటో ట్రంప్‌కు రుచి చూపించేందుకు ఆ దేశాలు సన్నద్ధమవుతున్నాయని చైనా విశ్లేషకులు పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేవిషయంలో నాటో కూటమిలో కూడా విభేదాలు మొదలవుతున్నాయి. యూరప్ దేశాలు ట్రంప్ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించడంతో దాదాపు పది దేశాలపై అదనంగా పదీశాతం సుంకాల భారం వచ్చేనెల ఒకటో తేదీ నుండి ట్రంప్ యంత్రాంగం అమలుచేసేందుకు సిద్ధమవుతోంది. ఈ దశలో అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ గ్రీన్‌లాండ్ సమస్యపై తీవ్రంగా స్పందిస్తూ, ''యూరోపియన్ దేశాలు బలహీనతలను అంచనావేస్తున్నాయి, కానీ అమెరికా మాత్రం బలాన్ని అంచనావేస్తోంది, అందువల్ల శత్రువులను అదుపు చేసేందుకు ముందుజాగ్రత్తగా అడ్డుకునేందుకు గ్రీన్‌లాండ్‌లో కీలక ఆయుధాలను మోహరించేందుకు ఆ దీవి అమెరికా అధీనంలో ఉండాల్సిందే''అన్నారు. యూరప్ యూనియన్ బలహీనులతో కఠినంగా, బలవంతులతో జాగ్రత్తగా ఉన్నప్పటికీ వాస్తవాలు పునఃమూల్యాంకనానికి గురవుతున్నాయని, అవి కాల పరీక్షకు తట్టుకుని నిలబడాల్సి ఉందని చైనా రాజకీయ నిపుణుడు ఒకరు విశ్లేషించారు.

## దక్షిణ చిలీలో కార్చిచ్చు :18 మంది మృతి



పెంకో : దక్షిణ చిలీలో కార్చిచ్చు బీభత్సం సృష్టించింది. ఈ మంటలలో 18 మంది నివాసితులు ప్రాణాలు కోల్పోయారు. వేల ఎకరాలు అటవీ ప్రాంతం దగ్ధం కాగా, వందలాది ఇళ్లు ఈ కార్చిచ్చు కారణంగా నివాసయోగ్యం కాకుండా బూడిదయ్యాయని అధికారులు చెప్పారు. చిలీలో విపరీతమైన వేడి వాతావరణం ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతోందని కూడా చెప్పారు. దక్షిణ శాంటియోగో చుట్టూ 500 కి.మీ. పరిధిలో సెంట్రల్ బయో బయో రీజియన్, నూబుల్ రీజియన్‌లలో విధ్వంసకర పరిస్థితులు తలెత్తినట్లు దేశాధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ అధికారిక ప్రకటన చేశారు. ఇప్పటివరకూ 8,500 హెక్టార్ల (21,000 ఎకరాలు) ప్రాంతాన్ని కార్చిచ్చు మింగేసింది. బాధితులకు, మృతులకు దేశాధ్యక్షుడు తీవ్ర సంతాపం ప్రకటించారు. వారికి తన సంఘీభావం తెలియజేశారు. సైన్యాన్ని రంగంలోకి దించారు.

# స్పెయిన్‌లో పట్టాలు తప్పిన హైస్పీడు రైలు

### ఎదురుగా వస్తున్న రైలుతో ఢీ – 39 మంది మృతి



మాడ్రిడ్: స్పెయిన్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 39 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. వీరిలో 11 మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కు వెళ్లేందుకు మలగా నుండి బయలుదేరిన హైస్పీడు రైలు గంట ప్రయాణం తర్వాత అదామజ్ వద్ద పట్టాలు తప్పి పక్కనే పట్టాలపై రెండు బోగీలు అడ్డంగా పడ్డాయి. అదే సమయంలో ఎదురుగా వస్తున్న అడముజ్ రైలు ఆ బోగీలను ఢీకొట్టింది. అదామజ్ వద్ద ఈ ఘోర ప్రమాదం సంభవించింది. పట్టాలు తప్పి బోల్తా పడిన మాడ్రిడ్ నుండి హుయెల్వాకు వెళుతున్న ఎదురుగా వచ్చే రైలు ముందుబోగీల్లోని ప్రయాణికులే ఈ ప్రమాదంలో ఎక్కువమంది మరణించారు. ప్రమాదస్థలంలో అత్యవసర సహాయ చర్యలు కొనసాగుతూ ఉన్నందువల్ల పూర్తిస్థాయి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు ప్రకటించారు. అత్యవసర వైద్య బృందాలు 112 మందికి చికిత్సలు చేసి పంపేశాయి. ఐదుగురు పిల్లలు సహా మరో 48 మంది ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. 11 మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉండగా వారిని అత్యవసర సేవా విభాగంలో ఉంచి చికిత్స చేస్తున్నారు. రెండు రైళ్లు ఒకే సరళరేఖలో ఉన్న సమయంలో జరిగిన ప్రమాద ఘటన చాలా విచిత్రంగా ఉందని రవాణామంత్రి ఆస్కార్ పుయెంటే అన్నారు. రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలు తెలియలేదని, దర్యాప్తు ప్రారంభించామని, ఈ వివరాలు తెలిసేందుకు కనీసం ఒక నెల సమయం పడుతుందని చెప్పారు. ఈ మరణాల సంఖ్యను పూర్తిగా ధృవీకరించలేదని స్పష్టం చేశారు. ఐర్యో సంస్థ నడుపుతున్న హైస్పీడు రైలులో 300 మంది ప్రయాణికులు ఉండగా, ఎదురుగా వస్తున్న ప్రభుత్వ రైలులో 200 మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. సజీవంగా ఉన్నవారు తక్షణం తమ బంధువులను సంప్రదించాలని, తాము సజీవంగానే ఉన్నట్లు సోషల్ మీడియా ద్వారా పోస్టింగులు పెట్టాలని అందాలుసియాలోని అత్యవసర విభాగ సంస్థ ఒక ప్రకటనలో కోరింది. ''మీ కుటుంబ సభ్యులు, ప్రియతములు, మీ శ్రేయోభిలాషులూ ఆందోళన చెందుతూ ఉంటారు, అందువల్ల సజీవంగా ఉన్నవారు వెంటనే సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్స్ పెట్టండి, ఇలాంటి వారందరికీ లైన్లు అన్నీ ఉచితంగా సేవలు చేస్తాయి'' అని అండలూసియా అత్యవసర సంస్థ సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెట్టింది. ''ఇవి చాలా బాధాకరమైన క్షణాలు, సమాచార లోపం వల్ల బంధువులు, ప్రియమిత్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు'' అని స్పానిష్ రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన మిగ్యుల్ ఏంజెల్ రోడ్రిగ్జ్ ఆర్ఎన్ఇ ద్వారా తెలియజేశారు. ఇపిసిఎం (ఈక్వాలిటీ–ప్రిపేర్డ్‌నెస్–క్రైసిస్ మేనేజ్‌మెంట్) యూరోపియన్ కమిషనర్ మాట్లాడుతూ, స్పానిష్ అధికారులతో తాము సంప్రదింపులు చేస్తున్నామని, అవసరమైతే మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. హైస్పీడు రైలులో ప్రయాణం చేస్తున్న ఆర్‌టివిఇ జర్నలిస్టు సాల్వడార్ జిమెనెజ్ మాట్లాడుతూ, తాను మొదటి బోగీలో ఉన్నానని, ఒక్కసారిగా భూకంపం వచ్చిందని భావించామని, కానీ రైలు పట్టాలు తప్పిందన్నారు.



## పోర్చుగల్ ఎన్నికల్లో సోషలిస్టుల ఆధిక్యం

### వచ్చేనెల 8న తుది విడత పోరు

లిస్బన్: లైబీరియన్ ద్వీపకల్పంలో ఉన్న దక్షిణ యూరప్ దేశం పోర్చుగల్‌లో అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో సోషలిస్టులు ముందంజలో ఉన్నారు. సెంటర్–లెఫ్ట్–సోషలిస్టుపార్టీకి చెందిన అభ్యర్థి ఆంటోనియో సెగురో, మితవాదపార్టీ నాయకుడు ఆంద్రీ వెంచురా ఇద్దరూ రెండో విడత (రన్నాఫ్) పోరుకు సిద్ధమయ్యారు. వీరిద్దరూ అధ్యక్ష పదవికి నువ్వా–నేనా అనే రీతిలో పోటీ పడటంతో తుది విడత సమరం తప్పడంలేదు. ఏ అభ్యర్థికీ మొదటి విడత లెక్కింపులో 50 శాతం ఓట్లు లభించలేదు. దీంతో ఫిబ్రవరి 8వ తేదీన తుది విడత ఎన్నికలు నిర్వహిస్తారు. 1986కు ముందు ఒకసారి అధ్యక్ష పదవికోసం రెండోవిడత సమరం జరిగింది. ఆ తర్వాత మళ్లీ 50 సంవత్సరాలకు ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడింది. ఐతే మొదటిసారి ఒక మితవాద నాయకుడు పోటీలో ముందుకు దూసుకువచ్చారు. దేశంలో ఎట్టిపరిస్థితుల్లోనూ వలస ప్రజలకు స్థానం ఇవ్వబోమని మితవాద నాయకుడు వెంచురా ప్రజలకు వాగ్దానం చేసి ముందుకు రెండో స్థానంలోకి దూసుకువచ్చారు.అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో సెగురోకు 31.1 శాతం ఓట్లు లభించగా, వెంచురాకు 23.5 శాతం ఓట్లు లభించాయి. వ్యాపార వర్గాలకు అనుకూలుడైన లిబరల్ అభ్యర్థి జోవో కోట్రిమ్ డి.ఫిగ్యురెవో 16 శాతం ఓట్లతో మూడవస్థానంలో నిలిచారు. సోషలిస్టుపార్టీ నాయకుడు ఆంటోనియో జోస్ సెగురో,మితవాదపార్టీ నాయకుడు ఆంద్రే వెంచురా, సోషల్ డెమోక్రటిక్‌పార్టీ (పిఎస్‌డి) నాయకుడు మార్క్సెస్ మెండెస్ మధ్య ప్రధాన పోటీ జరిగింది. ఐతే ఈ ఎన్నికల్లో మొత్తం 45 మంది అధ్యక్ష పదవికోసం పోటీపడ్డారు.

# వచ్చేనెల 8న జపాన్ ఎన్నికలు

### ఈ వారంలోనే పార్లమెంటు రద్దు



టోక్యో: జపాన్ పార్లమెంటును ఈ వారంలోనే రద్దు చేస్తారు. ఆ దేశ మొదటి మహిళా ప్రధానమంత్రి సనే తకైచీ ఈ విషయం చెప్పారు. ఫిబ్రవరి 8వ తేదీన జపాన్ పార్లమెంటుకు మెరుపు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కోరుకున్నవిధంగా దేశంలో తన ఆర్థిక, సాంఘిక సంస్కరణల విధానపరమైన ఎజెండాను అమలు చేసేందుకు వీలుగా ప్రజల నుండి బలమైన మెజార్టీ ఆశిస్తున్నందువల్ల ఈ ఎన్నికలు నిర్వహించాలని తకైచీ భావిస్తున్నారు. దేశంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) ఇటీవలికాలంలో ప్రజాదరణ కోల్పోయింది. కానీ పార్టీని ఆమె విజయపథంలో నడిపించాలని కోరుకుంటున్నారు. అందుకే ఎన్నికలకు వెళుతున్నారు. తమ పార్టీగానీ, తానుగానీ బలమైన ప్రజా తీర్పునకు అర్హులమా? కాదా? అనే విషయం తెలుసుకోవడానికే సార్వభౌమాధికార ప్రజాతీర్పు కోరుతున్నామని సోమవారం పత్రికాగోష్టిలో తకైచీ చెప్పారు. సనే తకైచీ ప్రధానమంత్రి పదవికిఅర్హురాలా? కాదా? అనే విషయం ప్రజలను అడిగి తెలుసుకోదలిచామని ఆమె అన్నారు. జనవరి 23వ తేదీన పార్లమెంటును నిర్ణీత ప్రకారం రద్దుచేస్తారు. జనవరి 27వ తేదీ నుండి దేశంలో ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుంది. తకైచీకి చెందిన ఎల్‌డిపి కొన్ని అవాంతరాలు మినహా నిరాఘాటంగా అనేక దశాబ్దాలుగా జపాన్‌ను పాలిస్తోంది. ప్రస్తుతం అధికార కూటమిలో ఎల్‌డిపితోపాటు జపాన్ ఇన్నోవేషన్ పార్టీ (జెఐపి) కూడా భాగస్వామిగా ఉంది. ఈసారి జరిగే ఎన్నికల్లో ఎల్‌డిపి పూర్తిగా తనంతట తానుగా మెజారిటీ సంపాదించుకుంటే ఎవరిమీదా ఆధారపడకుండా తన పార్టీ కోరుకున్నవిధంగా ఆర్థిక ఎజెండాను, ఇతర సంస్కరణలను అమలు చేయాలని ఎల్ డిపి గట్టిగా భావిస్తోంది.

## చైనాలో గత ఏడాది 17 శాతం క్షీణించిన జననాలు



బీజింగ్: చైనాలో జననాలు వరుసగా నాలుగో సంవత్సరంలో కూడా గణనీయస్థాయిలో తగ్గిపోయింది. 2025లో చైనా జనాభా దాదాపు 10 మిలియన్ల మేరకు (కోటి) క్షీణించింది. చైనా చరిత్రలోనే ఇది అత్యంత క్షీణత. అంతకుముందు చైనా జనాభాలో విపరీతమైన పెరుగుదల ఉండేది. తర్వాత ఒకే కుటుంబం ఒకే బిడ్డ అనే విధానాన్ని చైనా అమలు చేసింది. చైనా నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2025లో చైనాలో 7.92 మిలియన్ల మంది జన్మించారు. అంతకుముందు 2024లో 9.24 మిలియన్లు జన్మించారు. అంటే దాదాపు 17 శాతం మేరకు జననాలు క్షీణించాయి. 1949లో గణాంకాలను లెక్కించడం ప్రారంభించిన తర్వాత నమోదైన అతి తక్కువ జననాల శాతం ఇదే. ఐక్యరాజ్యసమితిలోని ఆర్థిక,సామాజిక వ్యవహారాల విభాగం అంచనాల ప్రకారం 200 సంవత్సరం నాటికి చైనా జనాభా 633 మిలియన్లకు క్షీణిస్తుంది. 2025లో చైనా జనాభా 30.30 లక్షల మేరకు తగ్గిపోయిందని ఎన్‌బిఎస్ తాజా గణాంకాలు వెల్లడించాయి. చైనాలో ఇప్పుడు వయోవృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

## పరిరక్షణకు ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలతో కలిసి పనిచేయాలని రాజా కోరారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని దీనిని నిరసిస్తూ ఫిబ్రవరి 12న 10 జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా జాతీయ కౌన్సిల్‌లో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీ లో వా యుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని దీని ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. నిపుణులతో చర్చించి దీనిపై కమ్యూనిస్టు పార్టీ ఒక కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. శతాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించిన ఖమ్మంజిల్లా సమితితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సిపిఐ శాఖలను జాతీయ కార్యవర్గం అభినందించింది. జాతీయ కార్యవర్గంలో ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులు చర్చించారు. కార్యవర్గంలో చర్చించిన నిర్ణయాలను మంగళ, బుధవారాల్లో జరిగే జాతీయ కౌన్సిల్‌లో చర్చించి కార్యాచరణ ప్రకటించనున్నారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో నేడు సెమినార్

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో జాతీయ స్థాయి సెమినార్ ఏర్పాటు చేసినట్లు సిపిఐ శతాబ్ది ఉత్సవాల ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. నేటి భారతదేశం వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సెమినార్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సిపిఎం జాతీయ కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి జాతీయ కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి డి.దేవరాజన్ తో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొంటారని హేమంతరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సెమినార్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు బిజెపి తీరుతో పాటు వామపక్షాలు పురోగమనానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారన్నారు. ఈ సెమినార్‌లో సిపిఐ జాతీయ నాయకత్వంతో పాటు పల్లా వెంకటరెడ్డి, రామకృష్ణ, జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎపి కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొంటారన్నారు.

## భక్తులకు అంకితం

(మొదటి పేజీ తరువాయి)



ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడారం జాతను ఎక్కడా లేని విధంగా రూ.252 కోట్లతో నిధులు మంజూరు చేసి మేడారం జాతరను ఒక అద్భుతంగా రూపుదిద్దడం జరిగిందని, అలాగే సమ్మక్క సారలమ్మ గద్దెలను పూర్వ వైభవం తేవడం జరిగిందని ఆయన అన్నారు. రాబోయే రోజులలో మేడారం జాతరను ఇంకా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా జాతరలో పనులు జరిగాయని మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెలను అద్భుతమైన రీతిలో కట్టడం జరిగిందని ఆయన అన్నారు. 7.35 గంటలకు మేడారంలోని హెలిప్యాడ్1కి, 7.40 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా మేడారం నుండి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మంత్రులందరూ పాల్గొని సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి అనసూయ(సీతక్క), అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25న రవీంద్రభారతిలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను బలంగా చాటిచెప్పడమే లక్ష్యంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 25న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపా రు. ఉదయం 11 గంటలకు గవర్నర్ ఓటరు చైతన్య జ్యోతిని వెలిగించి ఈ వేడుకలను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఈ ఏడాది జాతీయ థీమ్ మై ఓట్ ఐ యామ్ ఇండియా నినాదాన్ని ఎంచుకున్నటు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా తొలి ఓటర్లు, యువతలో అవగాహన పెంపొందించడం ఈ వేడుకల ప్రధాన లక్ష్యమని వివరించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (రిటైర్డ్) ఐ. రాణి కుముదిని, హాజరౌతారని తెలిపారు. పలువురు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.ఈ ఏడాది లక్ష్యం అప్రమత్తమైన, పరిశీలనాత్మకమైన, నిజాయితీ గల ఓటరును తీర్చిదిద్దడం,ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే మా ప్రయత్నం అని సీఈవో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.వేడుకల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ స్వీకరణ, అవార్డుల ప్రధానం, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

## ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చాయని ఆమె తెలిపారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మోడీ సర్కార్ ప్రజలను, కార్మిక సంఘాలను చివరకు పార్లమెంటును కూడా గౌరవించే పరిస్థితిలో లేదన్నారు. మోడీ ప్రభుత్వానికి కేవలం ఇద్దరు మాత్రమే కనిపిస్తున్నారని అందులో ఒకరు అదానీ, మరొకరు అంబానీ అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేయాలని మోడీ సర్కార్ భావిస్తుందన్నారు. భారతదేశంలో రాజ్యాంగం స్థానే కార్పొరేట్ వ్యవస్థను తీసుకు రావాలని మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందని అమర్‌జిత్ ఆరోపించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఈ నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతుందని, సోషల్ సెక్యూరిటీ ఉండదని, పెన్షన్, గ్రాట్యుటీ ఉండవని ఆమె తెలిపారు. ప్రభుత్వం అబద్ధాలు చెబుతుందని గతంలో ఉన్న చట్టాల ద్వారా వచ్చిన హక్కులను ఈ నాలుగు లేబర్ కోడ్స్ హరించివేస్తున్నాయన్నారు. ఇప్పటికే కార్మికులకు యాజమాన్యాలు సరైన భద్రత కల్పించడం లేదని వృత్తిలో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన పరిహారం అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బ్రిటిష్ పాలనలో సైతం కార్మిక సంఘాలు పోరాడి హక్కులు సాధించుకున్నాయని బ్రిటిష్ పాలన కంటే మోడీ పాలన మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. పని గంటల కాలాన్ని పెంచేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఇప్పుడు అదనపు పనికి అదనపు వేతనమని చెబుతున్న అది అమలు జరగడం లేదన్నారు. లేబర్ కోడ్స్ విషయంలో నలుగురు కేంద్ర మంత్రులు మారారని కేంద్ర కార్మిక మంత్రి డా॥ మన్సుఖ్ మండవియా చివరి లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చారన్నారు. కరోనా సమయంలో వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆమె తెలిపారు. లేబర్ కోడ్స్‌ను భారత దేశంలో యావత్ విపక్షం వ్యతిరేకించిందని అయినా మోడీ ప్రభుత్వం అమలుకు పూనుకుందన్నారు. భారత కార్మిక చట్టాలు ఒకప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయని కౌర్ తెలిపారు. 1920లో ఏర్పాటైన ఎఐటియుసి స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిందని లాలాలజపతి రాయ్, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, వివి గిరి లాంటి వారు ఎఐటియుసికి అధ్యక్షులుగా పనిచేశారని భారతదేశంలో ఏర్పాటైన తొలి కార్మిక సంఘం ఎఐటియుసి మాత్రమేనన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి సాధించిన హక్కులను హరించివేస్తున్నారని ఆమె తెలిపారు. కార్మికుల హక్కుల గురించి ప్రశ్నిస్తే విధి రాతను బట్టి జీవితం నిర్ణయించబడుతుందని మనస్మృతిని గుర్తు చేస్తున్నారని ఆమె తెలిపారు. భవిష్యత్తులో ఐక్యంగా పోరాడాలని ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా అన్ని సంఘాలు ఐక్యంగా బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. రైతు సంఘాలు, ఎల్ఐసి, బ్యాంకింగ్, రైల్వేతో పాటు అసంఘటిత రంగ కార్మికులు సైతం సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిలుస్తున్నారని ఆమె తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్‌పై సభలు, సమావేశాలు, ఆందోళనల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి యూసుఫ్, ఎఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, గాదె లక్ష్మి నారాయణ, రామాంజనేయులు, శివరామకృష్ణ, సిహెచ్ సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

## భయోత్పాతం

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు, ఓటీపీలు, స్క్రీన్ షేరింగ్‌కు అంగీకరిస్తున్నారు. అదే వారి పతనానికి కారణమవుతోంది.

**క్షణాల్లో ఖాతాలు ఖాళీ..**

ఒక్కసారి మోసగాళ్ల చేతికి డిజిటల్ యాక్సెస్ వెళ్ళగానే, ఖాతాలు ఖాళీ కావడం కేవలం సమయ ప్రశ్నగా మారుతోంది. కొన్ని ఘటనల్లో రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు నష్టం జరిగినట్లు పోలీసు వర్గాలు అంగీకరిస్తున్నాయి. జీవితాంతం కూడబెట్టిన పొదుపు, వ్యాపార మూలధనం, రిటైర్మెంట్ నిధులు కళ్లముందే మాయమవుతున్నాయి.

**అంతర్రాష్ట్ర–అంతర్జాతీయ ముఠాల హస్తం..**

ఈ మోసాల వెనుక అంతర్రాష్ట్రమే కాదు, అంతర్జాతీయ సైబర్ ముఠాలు పనిచేస్తున్నట్లు దర్యా ప్తు సం స్థలు చెబుతున్నాయి. వర్చువల్ నంబ ర్లు, నకిలీ అధికారిక లోగోలు, నకిలీ ఐడీలు ఉపయోగిస్తూ ప్రజలను నమ్మిస్తున్నారు. చట్టపరమైన పరిజ్ఞానం లేని వారు సులభంగా వలలో పడుతున్నారు.

**'పోలీసుల పేరుతోనే మోసం' – నమ్మకం దెబ్బతింటోంది..**

పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థల పేర్లు వినగానే సాధారణ పౌరుడు భయపడటం సహజం. అదే భయాన్ని మోసగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఫలితంగా ప్రజల్లో వ్యవస్థలపై నమ్మకం దెబ్బతింటోంది. పోలీసుల పేరుతోనే మోసం జరుగుతుంటే ఎవరిని నమ్మాలి? అన్న ప్రశ్న బాధితుల నోటి నుంచి వినిపిస్తోంది.

**హెచ్చరికలు ఉన్నా అవగాహన లోపమే కారణమా?..**

ప్రభుత్వం, సైబర్ పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ, ఈ మోసాలు ఆగడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వృద్ధులు, కొత్తగా డిజిటల్ బ్యాంకింగ్ వాడుతున్నవారు ఎక్కువగా లక్ష్యంగా మారుతున్నారు.సాంకేతిక పరిజ్ఞానం లోపం, భయం, ఆతురత— ఈ మూడు కలిసి మోసగాళ్లకు అవకాశంగా మారుతున్నాయి.ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. మీడియా, పౌర సమాజం కూడా బాధ్యతగా ప్రజలను చైతన్యపరచాలి. లేనిపక్షంలో, 'డిజిటల్ అరెస్ట్' అనే ఈ కొత్త ఉచ్చు మరిన్ని కుటుంబాల జీవితాలను అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నది చేదు నిజం.

**టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ సూచనలు**

ఏ ప్రభుత్వ సంస్థ వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయదు. ఫోన్‌లో కేసుల విచారణ జరగదు.ఒటిపిలు, బ్యాంక్ వివరాలు, స్క్రీన్ షేరింగ్ ఎప్పటికీ చేయరాదు. అనుమానాస్పద కాల్ వచ్చిన వెంటనే 1930కు ఫోన్ చేయాలి. లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి.అప్రమత్తతే అసలైన రక్షణ. డిజిటల్ యుగంలో సౌకర్యాలతో పాటు ప్రమాదాలూ పెరిగాయి. చట్టాలు, టెక్నాలజీ ఎంత బలంగా ఉన్నా, ప్రజల అప్రమత్తత లేకపోతే మోసాలు ఆగవు అని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ పేర్కొన్నారు.

## బిజెపి–ఆర్ఎస్ఎస్ యత్నం

(మొదటి పేజీ తరువాయి)

దాడి జరుగుతోందని విమర్శించారు. గ్రామీణస్థాయిలో వికేంద్రీకరించిన అధికారాలను కాపాడటంకోసమే రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. ప్రముఖ మలయాళ రచయిత ఎం.లీలావతితో ఒక అవార్డు కార్యక్రమంలో పంచుకున్న అభిప్రాయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, 98 ఏళ్ళు వయసుగల ఆ రచయిత్రి ''నిశ్శబ్ద సంస్కృతి''ని కోరుకుంటున్నారని, కానీ బిజెపి–ఆర్ఎస్ఎస్ రెండూ దేశంలో ప్రజల నోరు మూయించేందుకు సైద్ధాంతిక దాడి చేస్తున్నాయని విమర్శించారు. ''భారతదేశం నోరు తెరవకూడదని వారు కోరుకుంటున్నారు, భారతదేశం తనను తాను వ్యక్తీకరించుకోవాలని వారు కోరుకోవడంలేదు, కొన్ని వాణిజ్య, వ్యాపార సస్థలకోసం ఈ దేశం సంపదను సృష్టించాలని వారు కోరుకుంటున్నారు'' అన్నారు. ఐతే జాతి ఆస్తులను దేశంలో ఎంపిక చేసిన కొద్దిమంది చేతుల్లో పెట్టడంకోసమే ప్రజల నోరు మూయించాలని చూస్తున్నారని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. బిజెపి కేరళ రాష్ట్ర ప్రజల నోరు మూయించలేదని, వారు ఎన్నికల తీర్పు ద్వారా మాట్లాడతారని అన్నారు. అదేవిధంగా కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, యుడిఎఫ్ కూటమి బలమైన పనితీరు ప్రదర్శించిందని, ప్రత్యేకించి పంచాయతీస్థాయి ఎన్నికల్లో మంచి పనితీరు చూపించిందన్నారు. స్థానిక సంస్థలోని అన్ని స్థాయిలలోనూ యుడిఎఫ్, కాంగ్రెస్ కూటమి బ్రహ్మాండమైన పనితీరు చూపించిందని, పంచాయతీ ఎన్నికల ఫలితాలపై తానెంతో సంతోషంగా ఉన్నానన్నారు. ఢిల్లీలో చర్చల సందర్భంగా సీనియర్ నాయకులమధ్య భిన్నాభిప్రాయాలు కనిపించినప్పటికీ స్థానిక ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని తాను ఎంతో విశ్వాసంతో ఉన్నానన్నారు. విజయం తర్వాత ఏం చెయ్యాలన్నదే కాంగ్రెస్–యుడిఎఫ్ ఎదుట ఉన్న అతిపెద్ద ప్రశ్న అన్నారు. కేరళలో భారీ ఎత్తున నిరుద్యోగం తాండవిస్తోందని, దీనికి యుడిఎఫ్ కూటమి సమాధానం చెప్పాలన్నారు. ఏ ప్రభుత్వం విజయవంతం కావాలన్నాగానీ ప్రజలతో మమేకం కావాల్సి ఉంటుందన్నారు.

## దావోస్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి ఉన్న అనుకూలతలను దావోస్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణను ప్రపంచ పెట్టుబడి గమ్యస్థానంగా మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని సిఎం కార్యాలయం తెలియజేసింది. సిఎం రేవంత్ రెడ్డి 2025లో జరిగిన ప్రపంచ ఆర్థికవేదిక (డబ్లూఈఎఫ్) సదస్సులో పాల్గొని రూ.1.84 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించారు. ఈ పెట్టుబడుల ఒప్పందాలతో దాదాపు 46 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని గతంలో సిఎం కార్యాలయం ప్రకటించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ రూ.60 వేల కోట్ల పెట్టుబడితో ఎఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్ల ఏర్పా టు, సన్ పెట్రో కెమికల్స్ 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు, రూ.45,500 కోట్ల పెట్టుబడి, 7,000 ఉద్యోగాలు, వెల్నెస్ రిసార్ట్ రూ.15,000 కోట్ల పెట్టుబడి, 5,250 మందికి ఉపాధి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ ఏర్పాటు, స్కైరూట్ ఏరో స్పేస్ రూ.500 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు, మేఘా ఇంజనీరింగ్ కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటు, హెచ్‌సిఎల్ టెక్ సెంటర్ హైటెక్ సిటీలో కొత్త క్యాంపస్, 5,000 మందికి ఉపాధి, విప్రో హైదరాబాద్‌లో విస్తరణ, 5,000 మందికి ఉద్యోగాలు, ఇన్ఫోసిస్ పోచారంలో ఐటి క్యాంపస్ విస్తరణ, రూ.750 కోట్ల పెట్టుబడి, 17,000 ఉద్యోగాలు, యూనిలివర్ కంపెనీ రాష్ట్రంలో కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు తదితర పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి.

## నితిన్ నబిన్ ఎన్నిక!

(మొదటి పేజీ తరువాయి)

రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బిజెపి పార్లమెంటరీ బోర్డు తరపున కూడా నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్ అందించారు. మొత్తం 37 నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు రిటర్నింగ్ అధికారి లక్ష్మ ణ్ ప్రకటించారు. ఉపసంహరణకు గడువు ఉన్నందున నితిన్ ఎన్నికను మంగళవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అనంతరం నితిన్ నబీన్ బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణం చేయనున్నారు.

# కమ్యూనిస్టులకు పురోగమన సంకేతమిచ్చిన ఖమ్మం సభ

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న ఆదివారం నిర్వహించిన ప్రదర్శన, బహిరంగ సభ కమ్యూనిస్టులకు పురోగమన సంకేతాలు ఇచ్చింది. కమ్యూనిస్టు క్యాడర్ ఉత్తేజాన్ని, భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసింది. మారిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కదిలి వచ్చి కమ్యూనిస్టు పార్టీ యేడల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రదర్శన, బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంకు వచ్చే దారులన్నీ సభకు వచ్చే వాహనాలతో కిటకిటలాడాయి. ఖమ్మం నగరంలో ఎటు చూసినా ఎర్ర దళాలే నడుస్తూ కనిపించాయి. జనసేవాదళ్ కవాతు, ప్రజా సంఘాల కళారూపాల ప్రదర్శన నాభూతో నాభవిష్యత్తు అన్న రీతిలో సాగింది. వేల మంది జనసేవాదళ్ శిక్షణ పొందిన యువ కామ్రేడ్స్ కవాతు చేస్తుంటే కమ్యూనిస్టు వ్యతిరేకుల గుండెల్లో లబ్‌డబ్ మనడం ఆగి లెఫ్ట్ రైట్ ప్రతిధ్వనించింది. జన సమీకరణ, ప్రదర్శన జరిగిన తీరు బహిరంగ సభ విషయాలకు మించి కమ్యూనిస్టుల పురోగమనంపై విస్తృత చర్చ సాగుతుంది. ఏదో ఒక రకంగా తాయిలాలు ఇస్తే రాజకీయ సభలకు ప్రజలు హాజరుకాని పరిస్థితుల్లో తామే వాహనాలను ఏర్పాటు చేసుకుని బహిరంగ సభకు హాజరుకావడం కమ్యూనిస్టుల పని అయిపోయిందనుకునే వారికి ఖమ్మం సభ ఓ సమాధానం ఇచ్చింది. దశాబ్దాల పాటు పార్టీలో పని చేసిన వారు వయో భారాన్ని లెక్క చేయక సభకు హాజరై పార్టీ పట్ల తమకున్న అంచలంచెల విశ్వాసాన్ని చాటారు. పార్టీ కార్యకర్తలు చెట్ల కింద చేరి వంటలు చేసుకున్న తీరు దశాబ్దాల కిందటి ఘటనలను స్ఫూరణకు తెచ్చింది. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావమే ఓట్లు, సీట్లు కాదని ప్రజల హక్కులు, సంక్షేమానికేనని వందేళ్ల ప్రస్థానం రుజువు చేసింది. కమ్యూనిస్టుల శకం ముగిసిందంటూనే కమ్యూనిస్టులను చూసి భయపడుతున్న



మతశక్తులు సిపిఐ వందేళ్ల ప్రస్థానం తర్వాత గ్రహించాల్సిన అనేక విషయాలు ఉన్నాయి. సిపిఐ ఆవిర్భావం నాడు పరాయి పాలనలో ప్రజలు స్వేచ్ఛ కోసం తపిస్తున్న రోజులు. కనీస హక్కులు, శ్రమకు తగిన వేతనం దక్కకపోవడం అన్నింటికి నిర్బంధం అధికంగా ఉంది. ప్రజల స్వేచ్ఛ కోసమే 1925లోనే సిపిఐ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమిక పోషించిన సిపిఐ భారతదేశం నడిబొడ్డున స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్న నిజాంను గద్దె దించి ఈ విముక్తి చేసేందుకు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. చర్విత చరణ కాదు కాని కమ్యూనిస్టుల సాయుధ పోరాటం లేకుంటే నిజాం రాజ్యం మరో కశ్మీర్‌లా దేశం నడిబొడ్డున రగులుతూనే ఉండేది. స్వాతంత్ర్య అనంతరం కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు పురుడుపోసుకున్నాయి. అందుకే అధికారం లేకున్నా తమ పక్షాన నిలిచి పని చేస్తున్న సిపిఐని ప్రజలను ఆదరిస్తున్నారు. నోట్లు, ఓట్లు, సీట్లు రాజకీయాలలో వెనకడవచ్చు కానీ ప్రజల పక్షాన మరో వెయ్యేళ్లయినా పోరాడేందుకు కమ్యూనిస్టులకు ఖమ్మం సభ ఊతమిచ్చింది. సిపిఐ ఆవిర్భావం నాటి పరిస్థితుల కంటే దారుణమైన పరిస్థితులు నేడు దేశంలో నెలకొన్నాయి. లౌకికవాద దేశంలో మతం పాలనలో భాగమైంది. రాజకీయ లబ్ధి, అధికార కాంక్ష, మత రాజకీయాలను ప్రోత్సహిస్తుంది. సువిశాల దేశంలో దేశ సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుంది. 99 శాతం మంది దగ్గర ఉన్న సంపాద కంటే ఒక్క శాతం ప్రజల వద్ద ఉన్న సంపాద అనేక రేట్లు ఎక్కువగా ఉంది. ఇది భవిష్యత్తులో ఆందోళనకు దారి తీయవచ్చు. సంపన్న వర్గాలు ప్రజలను తమ గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నంలో తిరుగుబాటుకు దారి తీస్తుంది. అన్నింటికి మించి స్వాతం త్ర్యం పూర్వం నాటి పరిస్థితులు దేశంలో పెరిగిపోతున్నాయి. ప్రజల స్వేచ్ఛ హరించబడుతుంది. తెల్ల దొరల మాదిరిగానే తమను ప్రశ్నించే వారికి ఏదో ఒక ముద్ర వేసి నిర్బంధాలకు గురి చేస్తున్నారు. 150 కోట్లకు చేరుకున్న జనాభాలో సగ భాగం కలిగిన యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిర్వీర్యమవుతుంది. భారతదేశం నిరుద్యోగ భారత్ గా మారిపోతుంది. ఇదే సమయంలో యువశక్తి దారి తప్పి సమాజానికి ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తుంది. వీటన్నింటిపై పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమే. అధికారం లేనప్పుడు ఏమి చెప్పినా అధికారంలోకి వచ్చిన తర్వాత గత పాలకుల అడుగులలోనే అడుగులు వేస్తున్న నేపథ్యంలో మిగిలిన రాజకీయ పక్షాలకు భిన్నంగా ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుంది. మునుపెన్నడు లేని రీతిలో కార్పొరేట్ శక్తులు ప్రభుత్వాన్ని నడిపిస్తున్న తరుణంలో కమ్యూనిస్టు వ్యతిరేకులకు కమ్యూనిస్టులుంటే బాగుండు వారు ఉండాలి, బలపడాలి అన్న భావన పెరుగుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు కమ్యూనిస్టులు ఖమ్మం సభ ద్వారా ఒక సంకేతం ఇచ్చారు. ప్రజల పక్షాన మేమున్నాం అని నేతలు భరోసా ఇస్తే మీ వెనక మేము ఉన్నామంటూ సభకు తరలి వచ్చిన ప్రజలు చాటి చెప్పారు. పురోగమనం తథ్యమన్న సంకేతం శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ.

— ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### నిమ్స్‌లో అత్యాధునిక స్టెమ్ సెల్ ల్యాబ్ ప్రారంభం : మంత్రి దామోదర్ రాజనర్సింహ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నిమ్స్‌లో ఏర్పాటు చేసిన స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఆదివారం మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంలో భాగంగా ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థ, అమెరికాకు చెందిన తులసి థెరప్యుటిక్స్ సహకారంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్ ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు ఈ ల్యాబ్‌ను సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే... ఒక పెద్ద వృక్షానికి విత్తనం ఎంత ముఖ్యమో, మన శరీరానికి ఈ స్టెమ్ సెల్స్ అంతే ముఖ్యమని, విత్తనం నుంచి మహా వృక్షం తయారు అయినట్టే, స్టెమ్ సెల్స్ నుంచి కొత్త కణాలను, అవయవాలను తయారు చేసుకోవచ్చాని వివరించారు. మన శరీరంలో ఏదైనా భాగం దెబ్బతిన్నప్పుడు లేదా జబ్బు చేసినప్పుడు, ఆ భాగాన్ని రిపేర్ చేసే అద్భుతమైన శక్తి ఈ కణాలకు ఉంటుందని, మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా నయం చేయగలిగే శక్తి ఈ స్టెమ్ సెల్స్‌కు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి జబ్బులతో బాధపడేవారికి ఈ చికిత్స సంజీవని లాంటిదని మంత్రి వెల్లడించారు. ఆయా వ్యాధుల వల్ల శరీరంలో దెబ్బతిన్న కణజాలాన్ని మళ్ళీ కొత్తగా సృష్టించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం స్టెమ్ సెల్ చికిత్స కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనే అందుబాటులో ఉందని, అది కూడా లక్షల రూపాయల ఖర్చుతో కూడుకుని ఉంటుందన్నారు. సామాన్య ప్రజలకు కూడా అత్యాదునిక వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో ప్రధానంగా స్టెమ్ సెల్స్‌పై లోతైన పరిశోధనలు జరుగుతాయని, వీటిని తులసి థెరప్యుటిక్స్, నిమ్స్ డాక్టర్లు పరిశోధనలు చేయనున్నారని తెలిపారు. ఈ పరిశోధనల ఫలితంగా, భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేద పేషెంట్లకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగల్గనున్నామని త్వరలోనే ఈ ల్యాబ్ రీసెర్చ్ ఫలాలు ప్రజలకు అందుతాయని ఆశిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ్ అన్నారు.

# శతాబ్ది ఉత్సవాలు ఘనవిజయం




### లక్షలాది మంది కష్టజీవులు పాల్గొనడం పట్ల ఎఐకెఎస్ హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మం నగరంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలు చారిత్రాత్మక విజయవంతం కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర నాయకత్వం హర్షాన్ని వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని నలుమూలల నుంచి కష్టజీవులు, రైతులు, కార్మికులు, డాక్టర్లు, లాయర్లు, విద్యార్థులు, యువత, మహిళలు లక్షలాదిగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా ఏఐకెఎస్ రాష్ట్ర నాయకత్వంలోని భాగం హేమంత్ రావు, పశ్య పద్మ, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, వెంకటరెడ్డి, మందాడపు రాణి సోమవారం రైతు సంఘం నాయకులు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. రైతులు పంచలు కట్టుకుని, పచ్చ కండువాలు తలకు చుట్టుకుని, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) కండువాలను మెడలో వేసుకుని, నాగలిని భుజంపై పెట్టుకుని ప్రదర్శనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. కొప్పోజు సూర్యనారాయణ, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, కంబాల శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, ప్రభు లింగం, కంజర భూమయ్య, కొల్లూరి రాజయ్య, దేవ భక్తుని సంధ్య, నెల్లూరు నాగేశ్వరరావు, సి.హెచ్. దశరథ, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరుల నాయకత్వంలో రైతుల ప్రదర్శన సాగిందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసిన రైతులు, కష్టజీవులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలందరికీ ఏఐకెఎస్ రాష్ట్ర నాయకత్వం కృతజ్ఞతలు తెలిపింది. కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ల ప్రస్థానం భవిష్యత్ పోరాటాలకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడుతామని ఈ సందర్భంగా నాయకులు చెప్పారు.

# మాజీ ఎంపి సంతోశ్ రావుపై ఇడికి రమ్యరావు ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోశ్ రావు భూ అక్రమాలపై విచారణ జరపాలని కెసిఆర్ అన్న కూతురు, కాంగ్రెస్ నేత రమ్యరావు సోమవారం డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని ఇడి అధికారులను స్వయంగా కలిసిన రమ్యారావు.. సంతోశ్రావుతో పాటు ఆయన టీమ్ సభ్యులపై ఫిర్యాదు చేశారు. ఓ డాక్యుమెంట్ ఫైల్స్‌తో ఇడి కార్యాలయంలోకి వెళ్లిన ఆమె సంతోశ్ రావు భూకుంభకోణాలకు సంబంధించిన కీలక ఆధారాలను ఇడికి సమర్పించినట్లు అధికారులతో భేటీ అనంతరం మీడియాతో చెప్పారు. సంతోశ్ రావు ఆయన టీమ్ సభ్యులు మహిళలతో పాటు అనేక మందిని బెదిరించి భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆస్తులపై లోతైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయినా తాము ఇంకా అధికారంలో ఉన్నట్లుగానే భావిస్తూ తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, తశీల్దార్ స్థాయి అధికారులను మేనేజ్ చేసుకుంటూ నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆస్తులు ట్రాన్స్ ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమంగా భూదందాలు చేస్తూ వాటిలో వచ్చిన డబ్బును లిక్కర్ స్కామ్లో పెట్టారని ఆరోపించారు. మరో రెండు మూడు రోజుల్లో మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వీళ్ల అవినీతి బాగోతం మొత్తం వివరిస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంతగానో గౌరవించి అభిమానించే సుమిత్ర ఆంటీ కోడలు సుచరిత రెడ్డిని సైతం సంతోశ్ రావు అండ్ టీమ్ అన్యాయం చేశారని ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే సిబిఐ, ఎసిబికి ఫిర్యాదు చేశామని ఇప్పుడు ఇడికి ఫిర్యాదు చేశామన్నారు. సంతోశ్ రావు ఆయన టీమ్ భూదందాల నుంచి వచ్చిన డబ్బులే లిక్కర్ దందాకు బదిలీ చేశారని ఆమె ఆరోపించారు.



సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పక్షాన రాష్ట్ర శాఖ యూనిట్‌కు రూ.లక్ష విరాళం ఇచ్చారు.

# మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటు

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** త్వరలో జరగబోయే మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ల ఎన్నికలలో కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం టిపిసిసి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటు చేసినట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతి పార్లమెంట్‌కు ఇంచార్జ్ మంత్రి చైర్మన్‌గా, పార్లమెంట్ పరిధిలోని డిసిసి అధ్యక్షులు కన్వీనర్‌లుగా, పార్లమెంట్ నియోజక వర్గంలోని ఎంపి, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులు కమిటీ మెంబర్లుగా ఉంటారని చెప్పారు.

టికెట్ల ఎంపికలో కమిటీదే కీలకపాత్ర ఉంటుందని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



ఖమ్మంలో సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలుసుకున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రజాపక్షం జర్నలిస్టులు

# మాజీ మంత్రి హరీష్‌రావుకు సిట్ నోటీసులు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్‌రావుకు సోమవారం సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు నోటీసులో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కలవరం మొదలైంది. ఈ కేసులో ఇప్పటి వరకు పోలీసు అధికారులను సిట్ అధికారులు విచారించారు.ఈ కేసులో ఇప్పటి వరకు సిట్ అధికారులు ఎస్ఐబి డిఎస్‌పి డి.ప్రణీత్‌రావు,అదనపు ఎస్‌పిలు ఎన్.భుజంగరావు, తిరుపతన్న,టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావులను అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరంతా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇటీవలే ఈ కేసులో ఎ1 ముద్దాయిగా ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును సుప్రీంకోర్టు అనుమతులతో పాలుమార్లు విచారించారు. ప్రభాకర్‌రావు అరెస్టుపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుంది. ఇదిలావుండగా మాజీ మంత్రి హరీష్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చానీయాంశంగా మారింది.ముందు జాగ్రత్త చర్యగా జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీనియర్ ఫొటో జర్నలిస్టు విద్యాసాగర్ హఠాన్మరణం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎం.విద్యాసాగర్ (63) హఠాన్మరణం చెందారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే విద్యాసాగర్ మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. విద్యా సాగర్ కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. విద్యాసాగర్ నమస్తే తెలంగాణ పత్రికలో సీనియర్ ఫొటోజర్నలిస్టుగా పనిచేసి రిటైర్ అయ్యారు. గతంలో ఉషోదయం, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఎపి టైమ్స్, హిందీ మిలాప్, వార్త పత్రికల్లో పని చేశారు. విద్యాసాగర్ మరణవార్త తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం అధ్యక్షులు ఎ.గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యాసాగర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విద్యాసాగర్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం నాయకులు కె.అనిల్ కుమార్, నక్కా శ్రీనివాసులు, రజినీ కాంత్, శ్రీనివాస్, బిహెచ్ఎంకె.గాంధీ, సలీం, జాన్, సుధీర్ తదితరులు సంతాపాన్ని, ఆయన కుటుం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సత్ఫలితాలిస్తోన్న సీ -మిత్ర

### పది రోజుల్లోనే 1000 మంది బాధితులకు ఫోన్ కాల్స్

### 200 ఫిర్యాదు డ్రాఫ్ట్‌లను సిద్ధం చేసిన వర్చువల్ పోలీసులు

### ఇప్పటివరకు 100 ఎఫ్ఐఆర్‌ల నమోదు

### సీ-మిత్ర పనితీరుపై బాధితుల హర్షం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేర బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు హైదరాబాద్ పోలీసులు చేపట్టిన వినూత్న కార్యక్రమం 'సీ మిత్ర' సత్ఫలితాలను ఇస్తోంది. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ విధానం అమల్లోకి వచ్చిన కేవలం పది రోజుల్లోనే వందల మందికి భరోసానిచ్చింది. ఈ స్వల్ప వ్యవధిలో సీ మిత్ర బృందం 1000 మంది బాధితులకు స్వయంగా ఫోన్ చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. రోజుకు సగటున 100 ఫోన్ కాల్స్ చేస్తున్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 200 మందికి పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్ట్‌లను సిద్ధం చేసి పంపింది. వారి నుంచి సంతకం చేసిన ప్రతులు అందగానే, ఎక్కడా జాప్యం లేకుండా 100కి పైగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. గంటల తరబడి స్టేషన్లలో పనిలేకుండా, నిమిషాల్లోనే వర్చువల్ పోలీసులు స్పందిస్తుండటం, ఎఫ్ఐఆర్ కాపీలు నేరుగా మొబైల్‌కే వస్తుండటంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఇంటి నుంచే ఫిర్యాదు.. ఫోన్‌కు ఎఫ్ఐఆర్ కాపీ

సైబర్ నేర బాధితులు 1930 నంబరుకు, జాతీయ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే 'సీ మిత్ర' బృందం రంగంలోకి దిగుతుంది. బాధితులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీసి, ఏఐ సాంకేతికతతో లీగల్ అంశాలతో కూడిన పక్కా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి వాట్సాప్, మెయిల్‌కు పంపిస్తారు. బాధితులు ఆ ఫిర్యాదును ప్రింట్ తీసుకొని, సంతకం చేసి బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు కొరియర్, పోస్ట్ ద్వారా పంపాలి. ఆ కాపీ అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ వివరాలను బాధితుల మొబైల్‌కే మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. సీ మిత్ర సేవలను వేగంగా బాధితులకు అందించేందుకు ప్రత్యేక బృందాన్ని సైబర్ క్రైం విభాగం ఏర్పాటు చేసింది. రెండు షిఫ్ట్‌ల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ 'వర్చువల్ హెల్ప్‌డెస్క్' బాధితులకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ నేర బాధితులకు ఇబ్బందులు కలగకుండా సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమం సీ మిత్రను జనవరి 9వ తేదిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రారంభించారు.

### పోలీసులా కాదు.. ఒక సోదరిలా: దీక్షిత, కానిస్టేబుల్




సాధారణంగా మోసపోయామన్న బాధలో ఉన్నవారు పోలీస్ స్టేషన్‌కు రావాలంటేనే భయపడతారు. కానీ, మేమే స్వయంగా ఫోన్ చేసి.. 'భయపడకండి, మీకు న్యాయం చేయడానికి మేమున్నాం' అని చెప్పగానే వారి గొంతులో కనిపించే ధైర్యం వెలకట్టలేనిది. ఒకప్పుడు స్టేషన్‌కు రావాలంటే ఆలోచించే సామాన్యుడికి, పోలీసులకు మధ్య 'సీ మిత్ర' ఒక బలమైన వారధిలా నిలిచింది. నేను ప్రతి రోజు 20 మంది బాధితులకు ఫోన్ చేస్తా. ఒక సోదరిలా వారి సమస్యను విని, ఇంటి నుంచే ఫిర్యాదు తీసుకుంటున్నప్పుడు బాధితులు చూపిస్తున్న కృతజ్ఞత మా బాధ్యతను మరింత పెంచుతోంది.

### భవిష్యత్తులో 'సీ-మిత్ర' బంద్ అవ్వాలన్నదే మా లక్ష్యం: పృథ్వీక, కానిస్టేబుల్



టెక్నాలజీని, మానవతా దృక్పథాన్ని జోడించి హైదరాబాద్ పోలీస్ సృష్టిస్తున్న ఈ 'డిజిటల్ విప్లవం'లో ప్రజలకు ఇంత వేగంగా సేవలందిస్తున్నందుకు నాకు చాలా గర్వంగా ఉంది. గతంలో సైబర్ మోసం జరిగితే, ఫిర్యాదు ఎలా రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అని తెలియక బాధితులు సతమతమయ్యేవారు. కానీ 'సీ మిత్ర'తో ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవు. బాధితుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఫోన్ చేసి వివరాలు అడగ్గానే సానుకూలంగా స్పందించి, అన్ని వివరాలు తెలియజేస్తున్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్‌లో ఒక్క సైబర్ బాధితుడు కూడా లేకుండా చేసి, సీ మిత్ర బంద్ అయ్యే విధంగా మేమంతా పనిచేస్తున్నాం.


**శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము**
ధర్మపురి పట్టణం - జగిత్యాల జిల్లా.

ఆర్.సి నెం.బి/229/2025 — టెండర్ ప్రకటన — తేది: 19-01-2026

తేది: 01.04.2026 నుండి తేది: 31.03.2027 వరకు దేవస్థానమునకు అవసరమగు 01. ప్రోవిజన్ ఐటమ్స్, 02. పూలదండలు, 03. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను, 04. అన్‌స్కిల్ లేబర్, 05. కూరగాయలు, 06.పాలు & పెరుగు, 07. ఎలక్ట్రికల్ ఐటమ్, 08. టికెట్ బుక్కులు,09. ఫ్లెక్సి బ్యానర్స్, సప్లయి చేయుట గూర్చి ఆన్ లైన్ ఇ.ప్రొక్యూర్‌మెంట్ ద్వారా తేది: 21.01.2026 ఉ. 11.30 గంటల నుండి తేది: 04.02.2026 సా. 4.30 గంటల వరకు ఆన్‌లైన్ టెండర్ దాఖలు చేయవచ్చును అదేవిధంగా 10.స్టేషనరీ ఐటమ్, 11. శనిగపప్పు గిర్నీ పట్టుట, 12. భక్తులు మొక్కుబడిగా సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం, 13. మిక్స్‌డ్ బెల్లం, 14. ఖాళీ నూనె డబ్బాలు సేకరించుకొనుట కొరకు తేది: 21.01.2026 ఉ. 11.30 గంటల నుండి తేది: 06.02.2026 మ. 01.00 గంటల వరకు, సీల్డు కోటేషన్ కొరకు దరఖాస్తు చేసి తేది: 06.02.2026 రోజున మ.02.00 గంటలలోగా సీల్డు టెండర్ బాక్స్‌లో టెండర్ దాఖలు చేయవలెను. ఆన్‌లైన్ టెక్నికల్ బిడ్ తేది: 04.02.2026 సా.5.00 గంటలకు ఓపెన్ చేసి తదుపరి ప్రైజ్ బిడ్ తేది: 06.02.2026 రోజున మ.02.30 గంటలకు ఓపెన్ చేయబడను. పూర్తి వివరములకు కార్యాలయ పనివేళలో 9849259289 నంబర్ సంప్రదించవచ్చును.

అధ్యక్షులు & ధర్మకర్తల మండలి — సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 13925-PP/CL/ADVT/1/2025-26, Date: 19-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిజన్-8

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 57/EE-23/RJNRZ/GHMC/2025-26 | పనుల సంఖ్య (1) | రూ. 2.70 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 19.01.2026న సా.4.00గం.ల నుండి. బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 22.01.2026న సా.4.15గం.ల వరకు. | శ్రీ బి.నరేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

గమనిక: 1) టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% EMD పొందాలి మరియు విజయవంతమైన టెండరుదారులు దానిని 3 రోజులలోపు వెంటనే ఈ కార్యాలయానికి సమర్పించాలి. అలా చేయడంలో విఫలమైనా లేదా ఏదైనా వ్యత్యాసం గమనించినా, జి.ఓ. ఎం.ఎస్. నెం. 174, ఐ&సిఏడి (P0..00.000.W- Reforms) డిపార్ట్‌మెంట్, తేది: 01.09.08 ప్రకారం, మిమ్మల్ని ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో టెండర్లలో పాల్గొనకుండా 3 సంవత్సరాల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుంది.
2) వడ్డెర కార్మిక సంఘాలకు కేవలం రిజర్వ్ చేయబడిన పనులకు మాత్రమే ఈఎండి చెల్లింపు నుండి మినహాయింపు ఉంది మరియు ఇతర పనులకు వారు 1% EMD చెల్లించవలసి ఉంటుంది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చాంద్రాయణగుట్ట, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 13939-PP/CL/ADVT/1/2025-26, Date: 19-01-2026



## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/చందంపేట:** ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలను రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్‌ను సోమవారం మండల కేంద్రంలో పిసిసి సభ్యులు జాలె నర్సింహారెడ్డి, రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో ప్రజాపక్షం దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుక వినిపిస్తోందని అన్నారు. ప్రజాపక్షం దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో చందంపేట మండల ప్రజాపక్షం విలేకరి బందెల ఆంజనేయులు, బచ్చనబోయిన జగదీష్, తిరుపతయ్య, శ్రీను, మహేష్, వెంకటేష్, రాములు, అంజయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు ప్రజలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజ



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ నివాస గృహంలో రామన్నపేట మండల సిపిఐ నాయకుల సమక్షంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు ప్రభుత్వాలకు, ఇటు ప్రజలకు మధ్య వారధిగాఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, ప్రజాపక్షం దినపత్రిక మండల రిపోర్ట్ సంగిశెట్టి పాండు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కళ్లెం రామచంద్రు, నాయకులు ఎర్ర రమేష్, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటియుసి మండల అధ్యక్షుడు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షులు ఊట్కూరి కృష్ణ, ఏనూతుల రమేష్ పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నాంపల్లి :** ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రజాస్వామ్య విలువలను కాపాడేది ప్రజాపక్షం దినపత్రిక అని నాంపల్లి డిప్యూటీ తాహసిల్దార్ దోటి వెంకన్న అన్నారు.మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా ప్రత్యేక వార్త కథనాలను ప్రచురిస్తున్న ప్రజా గొంతుక ప్రజాపక్షం దినపత్రిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ ఊరుపాక వెంకటయ్య,నక్క మురళి, యాదయ్య, రమేష్,రాములు,లక్ష్మణ్,యాదగిరి ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి పత్రికలు కృషి



**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజల సమస్యలు పరిష్కారించేందుకు పత్రికలు కృషి చేయాలని ధైర్యపురి తండా గ్రామ సర్పంచ్ వాంకుడోత్ అనిత దాస్ అన్నారు. సోమవారం సర్పంచ్ చేతుల మీదుగా ప్రజాపక్షం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పనిచేయాలన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక ముందుండాలని ఆమె ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టు బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలోని శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం నకిరేకల్ పట్టణంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చెరువుగట్టు బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, పన్నాల రాఘవ రెడ్డి,చెరువుగట్టు సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్, ఆలయ ఈఓ మోహన్ బాబు పాల్గొన్నారు.

## దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల(రెవెన్యూ) అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కర్ రావు వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 29 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 20, పంచాయతీ శాఖ 3, గ్రామీణాభివృద్ధి శాఖ 2, ఎస్సీ వెల్ఫేర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మున్సిపాలిటీ, లేబర్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** మహిళలు స్వయం శక్తితో పైకి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు11.38 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు చెక్కులను అందజేశారు. అంతేకాక ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ వచ్చే సంవత్సరంలోపు ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇన్ళలు ఇస్తామని, ఎవరైనా ఆర్థిక స్తోమత లేక పెద్ద పెద్ద చదువులు చదివించలేకపోతే తనను సంప్రదిస్తే సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు తోపాటు ,వారి అభ్యున్నతికి కుటుంబాల తోడ్పాటుకు అనేక కార్యక్రమాల అమలు చేస్తున్నదని తెలిపారు. ఆర్థికంగా వారు నిలదొక్కునేందుకు వడ్డీ లేని రుణాలను ఇస్తున్నదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,మెప్మా పీడీ శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్,గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**రైతు పక్షపాత ప్రభుత్వం**

తమది రైతు పక్షపాత ప్రభుత్వమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు .సోమవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో 8 కోట్ల రూపాయల విలువచేసే వ్యవసాయ యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. 2 లక్షల లోపు రుణాలున్న రైతులకు సంబంధించి 20 వేల కోట్ల రుణాలను రుణమాఫీ చేయడం జరిగిందని,అంతేకాక తాము అధికారంలోకి రాకముందు ఉన్న రైతుబంధును సైతం చెల్లించామని తెలిపారు .నల్లగొండ జిల్లాలో 8 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను సన్న, చిన్న కారు, మహిళా రైతులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీపై ఇవ్వడం జరుగుతున్నదని, తక్కిన వారికి 40 శాతం సబ్సిడీపై వీటిని అందజేస్తున్నామని ఆయన తెలిపారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. సోమవారం పోచంపల్లి మండలం జలల్ పూర్‌లోని స్వామి రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్‌లో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకి గ్రామ పంచాయతీ పాలన, విధులు, అభివృద్ధికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ కిషోర్ రెడ్డి, డైరెక్టర్ విహారి, జడ్పీ సిఈఓ శోభా రాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, యమ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ గ్రామాలలో అన్ని రకాలుగా అభివృద్ధి జరగాలి అంటే సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సర్పంచ్‌లు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో సర్పంచ్‌లకు పొందు పరిచిన అధికారాలు, విధులు తదితర అంశాలను శిక్షణలో భాగంగా క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్‌లు చురుకుగా పని చేయాలిసిన అవసరం ఉంటుందన్నారు. ప్రతీ గ్రామం శుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు, ఆదర్శ గ్రామపంచాయతీల నిర్మాణం తదితర అంశాలపై సర్పంచ్ల బాధ్యతలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, పంచాయతీ రాజ్ చట్టంలోని ప్రతీ అంశాన్ని సర్పంచ్‌లు అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, మోరల్ స్కిల్స్, తదితర అంశాలపైన కూడా సర్పంచ్‌లకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, యంపిఓలు, నూతన సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం చేసుకోవాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రానున్న మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ఆర్ఓలు,ఏ ఆర్ఓలు సహకరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమించబడిన ఆర్ఓలు ఏఆర్ఓ లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలకు నియమించబడిన ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నియమ,నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ ఆధారంతో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదువుకొని తప్పులు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని చెప్పారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ నుండి పోలింగ్,కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అన్ని అంశాల పట్ల ముందే సంసిద్ధం కావాలన్నారు. బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా పరిశీలించాలని,ఎలాంటి పొరపాట్లు జరగకుండా బ్యాలెట్ పేపర్ ముద్రణ, గుర్తుల కేటాయింపు వంటి వాటిని పాటించాలని తెలిపారు. నామినేషన్ల సమయంలో నామినేషన్ ఫామ్ లతో పాటు, ఓటర్ జాబితా, అభ్యర్థికి సంబంధించిన క్రిమినల్ కేసులు,చెక్ లిస్ట్, డిపాజిట్,వంటి వాటాన్నిటిని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థుల డిపాజిట్, ఖర్చుల పరిమితి తదితర వివరాలన్నింటినీ ఆయన ప్రశ్న, జవాబుల ద్వారా ఆర్ఓలు ఏఆర్ఓ ల ద్వారా రాబట్టారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారి జె.శ్రీనివాస్,గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు అధికారులు పరిష్కరించాలి


### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై పర్యవేక్షణ ఉంటుందని అలాగే కొన్ని శాఖలలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి శాఖ తమ యొక్క డిడిఓ బ్యాంక్ అకౌంట్ వివరాలు జిల్లా అకౌంట్ వెరిఫికేషన్ కమిటికి సంబంధిత ప్రొఫార్మాలో పూర్తిచేసి కమిటి ముందు హాజరుకావాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 43 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని చెప్పారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటి సిఈఓ శిరీష, డిపిఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఎంఅండ్‌హెచ్ఓ పి వెంకటరమణ, డిఎస్ఓ మోహన్ బాబు పాల్గొన్నారు.



# నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణ

### సర్వే నివేదికనే ప్రమాణికం అంటున్న కాంగ్రెస్
### అభ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ ఆచితూచి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొత్తం ఐదు పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 141 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు ఇప్పటికే ఓటర్ జాబితాలను సరిచేయడం, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కూడా ఖరారు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమీషనర్ అండ్ డైరెక్టరేట్, హైదరాబాద్ (సిడిఎంఏ) వారు పురపాలక సంఘాలకు చైర్మన్ల రిజర్వేషన్లను కూడా ప్రకటించారు. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సమ్మక్క సారక్క సన్నిధిలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పుర పోరు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు కూడా లేఖ రాయడం జరిగింది. ఎన్నికల కమీషన్ కూడా రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల బరిలో నిలువాలనుకునే ఆశావహులు టిక్కెట్ల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. సూర్యాపేట పురపాలక సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ నుండి టిక్కెట్ ఆశిస్తున్న వారు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌లను ప్రసన్నం చేసుకొని తమకు కేటాయించాలని వేడుకుంటున్న పరిస్థితి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అలాగే కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల పురపాలక సంఘాల పరిధిలో అధికార పార్టీ నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతిల చుట్టూ తిరుగుతూ తమకు టిక్కెట్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. బిఆర్ఎస్ నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డిలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరి పురపాలక సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ నుండి పోటీ చేయాలనుకునే వారు ఎమ్మెల్యే మందుల సామేల్, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యలను కలుస్తూ తమకు టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికల బరిలో నిలువాలనుకునే వారు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్‌ను కలిసి విన్నవించుకుంటున్నారు.

**పురపోరుకు అధికారులు రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేయడంతో ఆయా పార్టీల నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఒక్కొక్క వార్డు నుండి ము గ్గురు నుండి ఐదుగురు టిక్కెట్ కోసం పోటీపడుతున్నారు. దీంతో అధికార కాంగ్రెస్ సర్వే నివేదికల ప్రమాణికంగా టిక్కెట్లు కేటాయిస్తామని చెబుతుం డగా, ఈ ఎన్నిక ల్లోనైనా తమ సత్తా చాటా లని బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికలో ఆచి తూచి వ్యవహరిస్తుంది.**

సర్వే నివేదికనే ప్రమాణికం అంటున్న కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ ఆచి తూచి

సర్వేల నివేధిక ప్రమాణికంగానే అభ్యర్థులకు టిక్కెట్లు ఖరారు చేస్తామని అధికార కాంగ్రెస్ నేతలు చెబుతుండగా, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికలో అధికార కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక సరళిని బట్టి తమ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆచి తూచి అడుగు వేస్తుంది. ఆయా పార్టీల నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు తమకు టిక్కెట్ దక్కుతుందా లేదా అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. తాము పోటీ చేయాలనుకున్న వార్డుల్లో తమ పార్టీ బలమెంత, ప్రజల్లో తమకున్న బలమెంత అనే దానిని అంచనా వేసుకునే పనిలో పడ్డారు.



## మహిళలు స్వయం శక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చండూరు :** మహిళలు స్వయం శక్తితో పైకి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం అయన చండూరు మున్సిపాలిటీ కార్యాలయావరణలో ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.43.88లక్షల వడ్డీ లేని రుణాలు చెక్కులతోపాటు ఇందిరమ్మ చీరలను ఆర్‌డిఓ శ్రీదేవితో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతన్న తరుణంలో వారికి ప్రభుత్వం మహిళ సంఘాలు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందిచడం ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కునేందుకు మంచి అవకాశం కల్పిస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ మల్లేశం,తహసిల్దార్ రమాకాంత్ శర్మ,ఎంపిడిఓ యాదగిరి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీష్ కుమార్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్ర శేఖర్ గౌడ్,కోడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే మహిళల ప్రభుత్వం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ అంటేనే మహిళల ప్రభుత్వమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ రవీంద్ర భారతిలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ఇందిరా మహిళా శక్తి పథకం కింద శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌లు మహిళా స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ.7కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇందిరమ్మ మహిళా శక్తి పేరుతో మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో రెండెకరాల ప్రభుత్వ భూమిలో ఒక భవనాన్ని నిర్మిస్తామన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ బస్టాండ్‌ని అతిత్వరలో డిజిటల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా సన్నాహాలు చేస్తున్నామని, సంబంధిత అధికారులకు కూడా వారు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగానే ప్రభుత్వ స్థలంలో ఒక మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీపీవో శ్రీనివసాశర్మ, మెప్మా టీఎంసీ బక్కయ్య, మహిళా సమాఖ్యల ప్రతినిధులు అనిత, అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎంపి చామల



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రపంచ ఆర్థిక దిగ్గజాలు కొలువైన దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి పురోగతిని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అంతర్జాతీయ వేదికపై ఆయన సమర్థవంతంగా చాటి చెప్పారు. ప్రముఖ సంస్థ 'స్వనితి ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ది మెరిడియన్ కలెక్టివ్ సబ్నేషనల్ కమిట్మెంట్ చార్టర్ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజారంజక పాలన, పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ హితమైన అభివృద్ధి విధానాలను వివరించారు. రాష్ట్రాల స్థాయిలో తీసుకునే నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతాయో ఆయన విశ్లేషించారు. 'తెలంగాణ అభివృద్ధిని ప్రపంచ స్థాయి నాయకులకు వివరించడం ఒక గొప్ప అనుభూతి. మన రాష్ట్రానికి ఉన్న అద్భుతమైన వనరులు, మానవ వనరుల నైపుణ్యం చూసి ప్రపంచ ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణకు భారీగా పెట్టుబడులు రావడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక ముద్ర పడుతుంది' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# డిజిటల్ అరెస్టుతో బెదిరింపు : అరెస్టు

రూ. 10.5 లక్షలు వసూలు చేసిన నిందితుడు




**కన్నూర్:** దేశ వ్యాప్తంగా డిజిటల్ అరెస్టు మోసాలు పెచ్చుమీరుతున్నాయి. తాజాగా ఉత్తర కేరళ జిల్లాలోని తలస్సేరికి చెందిన మహిళా డాక్టర్ నుండి రూ. 10.5 లక్షలు వసూలు చేసిన కేసులో కన్నూర్ సిటీ సైబర్ పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని లూధియానాకు చెందిన నిందితుడు జీవన్ రామ్ (28) డబ్బు చెల్లించమని ఓ వైద్యుడిని 'డిజిటల్ అరెస్ట్' చేస్తామని బెదిరించాడని ఆరోపించారు. ఈ ఘటన నవంబర్ 30న జరిగింది. ముంబయిలోని సిబిఐ అధికారులుగా నటిస్తూ మోసగాళ్ళు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా వైద్యుడిని సంప్రదించారు. ఆమె పేరుతో మనీలాండరింగ్ కేసు నమోదు చేయబడిందని, ఈ విషయాన్ని పరిష్కరించడానికి డబ్బు బదిలీ చేయమని ఆమెపై ఒత్తిడి తెచ్చారని వారు పేర్కొన్నారు. డాక్టర్ వివిధ ఖాతాల ద్వారా రూ. 10,50,000 పంపారని, తరువాత నిందితులు చెక్ ద్వారా దానిని తీసుకున్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది ఒక రకమైన సైబర్ నేరం, దీనిలో మోసగాళ్ళు చట్ట అమలు అధికారులు, కోర్టు అధికారులు లేదా ప్రభుత్వ సంస్థల సిబ్బందిగా నటిస్తూ ఆడియో, వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరిస్తారు. వారు బాధితులను బందీలుగా ఉంచి డబ్బు బదిలీ చేయమని వారిపై ఒత్తిడి తెస్తారు. కాగా, పోలీస్ కమిషనర్ నిధిన్‌రాజ్ పి సూచనలను అనుసరించి కన్నూర్ నగర పోలీసులు నిందితుడిని లూధియానాలోని ఒక గ్రామంలో ట్రాక్ చేశారు. నిందితులు నిరంతరం స్థానాలు మారుస్తున్నప్పటికీ, కేరళ పోలీసు బృందం పంజాబ్‌లో కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ఐదు రోజుల నిఘా తర్వాత నిందితుడిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# గ్రామీణ పేదలకు తాయిలంలా పని

ప్రభుత్వం నిర్ణయించినప్పుడు మాత్రమే అప్పగింత

కొత్త 'విబి-జి రామ్ జి' చట్టంపై రాహుల్, ఖర్గే విమర్శ



**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో వచ్చిన కొత్త 'విబి–జి రామ్ జి' చట్టాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దేశంలోని గ్రామీణ జనాభా కోసం ఇప్పుడు పని తాయిలంలా మారుతుందని, ప్రభుత్వం నిర్ణయించినప్పుడు మాత్రమే వారికి అప్పగించబడుతుందని, ఇకపై అది హక్కు కాదని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వారు లేఖ రాశారు. కొత్త చట్టం ద్వారా రాష్ట్రాలపై ఆర్థికంగా భారం పడుతున్నప్పటికీ, వారి పని హక్కు 'దొంగిలించబడుతోంది' అని ఆ లేఖలో వారు ఆరోపించారు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్'లో భాగంగా గత చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఖర్గే, రాహుల్‌గాంధీ లేఖ రాశారు. జనవరి 10న ప్రారంభమైన ఆ కార్యక్రమం ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుంది. ఈ లేఖను అన్ని స్థానిక భాషలలోకి అనువదించిన తర్వాత గ్రామీణ ప్రజలలో వ్యాప్తి చేయాలని కాంగ్రెస్ తన రాష్ట్ర యూనిట్ ముఖ్యులను కోరింది. 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరాగే) ను అమలు చేయడం ద్వారా రాజ్యాంగబద్ధమైన పని హక్కుకు ప్రాణం పోసిందని లేఖలో పేర్కొన్నారు. అప్పటి నుండి ఎంజి. నరేగా 180 కోట్లకు పైగా పనిని సృష్టించింది. గ్రామ ట్యాంకులు, రోడ్లు వంటి దాదాపు 10 కోట్ల ఆస్తులను సృష్టించింది. గ్రామ స్థాయి ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకునే అధికారం గ్రామ పంచాయతీలకు ఇవ్వడం ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసిందని అది పేర్కొంది. కొవిడ్ 19 మహమ్మారి వంటి సంక్షోభాల సమయంలో, ఇది గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడి. మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎంజి నరేగా ఆత్మను నాలుగు కీలకమైన మార్గాల్లో నాశనం చేయాలని యోచిస్తోంది. 'మీ పని హక్కు దొంగిలించబడుతోంది. ముందు: భారతదేశం అంతటా ప్రతి గ్రామీణ కుటుంబానికి పని చట్టబద్ధమైన హామీ. ఏదైనా గ్రామ పంచాయతీలో పని కోరుకునే ఏ కుటుంబానికి అయినా 15 రోజుల్లోపు పని అందించాలి. తరువాత: పని ఇకపై హక్కుగా ఉండదు, కానీ మోదీ ప్రభుత్వం నిర్ణయించినట్లుగా అందజేయవలసిన 'రెవ్డి'గా ఉంటుంది. ఈ పథకం కింద ఏ గ్రామ పంచాయతీలకు పని ఇవ్వాలో మోదీ ప్రభుత్వం ఎంచుకుంటుంది' అని లేఖలో పేర్కొన్నారు. వేతన హక్కును కూడా దొంగిలిస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు ఉన్న పథకంలో సంవత్సరానికి పెరిగే, సంవత్సరంలో 365 రోజులు అందుబాటులో ఉండే నోటిఫైడ్ కనీస వేతనాలకు పని అందించబడింది. కనీస వేతన హామీతో కుటుంబాలు అవసరమైనప్పుడల్లా పని కోరుకోవచ్చు. కొత్త పథకంలో వార్షిక సవరణలకు హామీ లేకుండా వేతనాలు ఏకపక్షంగా నిర్ణయించబడతాయి. పంట కాలంలో ఈ పథకం అమలు చేయబడదు, కాబట్టి కార్మికులు కనీస వేతనం లేకుండా వారు పొందే ఇతర పనులను అంగీకరించవలసి వస్తుంది అని కాంగ్రెస్ నాయకులు లేఖలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల అధికారాలను కాంట్రాక్టర్లకు అప్పగిస్తామని పేర్కొంటూ, గ్రామ పంచాయతీలు ముందుగా వారి అవసరాలకు అనుగుణంగా వారి స్వంత అభివృద్ధి ప్రాజెక్టులను ప్లాన్ చేసి చేపట్టాయని, కాంట్రాక్టర్లను నిషేధించారని, కార్మికులకు స్థానిక ఎంజి నరేగా సహచరులు, రోజ్‌గర్ సహాయక్‌లు మద్దతు ఇస్తున్నారని వారు చెప్పారు. ఇప్పుడు, ఢిల్లీ నుండి రిమోట్ కంట్రోల్ ద్వారా ప్రాజెక్టులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆదేశాల అమలు సంస్థగా మాత్రమే మారుతుంది, కాంట్రాక్టర్లను తీసుకువస్తారు, కార్మికులు వారి చేతుల్లో కేవలం కార్మికులుగా మారతారని వారు చెప్పారు. నరేగా సహచరులు లేదా రోజ్‌గర్ సహాయకులు కూడా ఉండరని ఖర్గే, రాహుల్‌గాంధీ అన్నారు. రాష్ట్రాలు ఆర్థికంగా భారం పడుతున్నాయని పేర్కొంటూ, గతంలో కేంద్రం ఎంజి నరేగా వేతనాలలో 100 శాతం చెల్లిస్తుందని, రాష్ట్రాలు పని కల్పించినందుకు ప్రోత్సాహకాలు అందించబడతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు.

### ఉన్నావ్ అత్యాచార కేసు...

# సెంగార్ పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 2017లో జరిగిన సంచలనాత్మక అత్యాచార కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. తనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో సెంగార్ పిటిషన్ వేశాడు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ఢిల్లీ న్యాయస్థానం.. ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 'రిలీఫ్ మంజూరు చేయడానికి నిందితుని తరఫు న్యాయవాదులు ఎలాంటి కారణాలూ చూపలేదు. శిక్షను నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన వాజ్యాన్ని తిరస్కరిస్తున్నాం' అని జస్టిస్ రవీందర్ దుడేజా స్పష్టం చేశారు. ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసులో ట్రయల్ కోర్టు 2020 మార్చి 13న సెంగార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని హతమార్చినందుకు దోషి విషయంలో ఎలాంటి సానుభూతీ చూపలేమని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో కుల్దీప్ సెంగార్ సోదరుడు అతుల్ సింగ్ సెంగార్‌తో పాటు మరో ఐదుగురికీ పదేళ్ల జైలు శిక్ష విధించింది న్యాయస్థానం. సెంగార్ అండతో పోలీసులు.. బాధితురాలి తండ్రిని హింసించారు. చివరకు ఆయన.. 2018 ఏప్రిల్ 9న మరణించాడు. ఈ అత్యాచార కేసులో నిందితునికి జీవితాంతం జైలుశిక్ష విధించిన డిసెంబర్ 2019 నాటి తీర్పునకు వ్యతిరేకంగా.. అలాగే బాధితురాలి తండ్రి కేసులోనూ సెంగార్ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అత్యాచార కేసులో తనపై విధించిన శిక్ష, తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉండటంతో 2025 డిసెంబర్ 23న హైకోర్టు సెంగార్ శిక్షను నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సిబిఐ స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సిబిఐ పేర్కొంది. ఈ పిటిషన్‌ను 2025 డిసెంబర్ 29న విచారించిన సుప్రీం న్యాయస్థానం.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.

### హైవేకు 500మీటర్ల పరిధిలో మద్యం షాపుల తొలగింపు కేసులో

# రాజస్థాన్ హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ :** జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో మద్యం షాపుల తొలగింపుపై సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులపైన ఉన్న వైన్ షాపులను తొలగించడం లేదా తరలించాలంటూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని చెప్పిన సుప్రీం, కానీ తీర్పుపై సమగ్ర అధ్యయనం అవసరమని అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాద మరణాలపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు, నిజానికి చాలా మరణాలు జరిగాయని పేర్కొంది. మద్యం మత్తులో వాహనం నడపడం పెను ప్రమాదానికి దారి తీస్తుందని చెప్పింది. భవిష్యత్తులో మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. 2025 నవంబర్ 24న రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రామ్ స్వరూప్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సమస్య చాలా సున్నితమైనదని, పరిష్కారం కోసం కొన్ని విధానపర నిర్ణయాలను అమలు చేయాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు పేర్కొంది. మద్యం వినియోగం, హైవేలపై ప్రమాదాలతో ముడిపడి ఉన్న మరణాలు ఒక ప్రధాన ప్రజా భద్రతా సమస్యగా మిగిలిపోయాయని ధర్మాసనం అభిప్రాయపడింది. దీని పరిష్కారానికి సమగ్ర విధానపర నిర్ణయం అవసరమని చెప్పింది.

**రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై స్టే**

మరోవైపు హైకోర్టు ఉత్తర్వును అమలు చేయడానికి అనుమతిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదించారు. ఏ పక్షానికి ఎటువంటి అవకాశం ఇవ్వకుండానే ఈ ఉత్తర్వును జారీ చేశారని పిటిషనర్ తరఫున న్యాయవాది కోర్టుకు చెప్పారు. ఈ క్రమంలోనే రాజస్థాన్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అనేక నగరాలు, పట్టణాలు జాతీయ లేదా రాష్ట్ర రహదారులపై మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. 500 మీటర్ల నియమాన్ని పూర్తిగా అమలు చేయడం వల్ల పెద్ద పట్టణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు తొలగిపోతాయని కోర్టుకు తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలు ఉండకూడదని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించిందని గుర్తు చేశారు. అయితే ఈ రహదారులు నగరాలు, పట్టణాల గుండా వెళ్లే చోట ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. ఈ క్రమంలోనే మున్సిపల్ పరిధిలో మద్యం దుకాణాలపై అలాంటి నిషేధం ఉండదని ఆ ఉత్తర్వులపై తర్వాత స్పష్టత ఇచ్చారని వివరించారు. ఈ



ఉత్తర్వు అమలులో ఆచరణాత్మక ఇబ్బందులను లేవనెత్తిన ఆయన, దానిని నిలిపివేయాలని పిటిషన్‌కు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు పక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.

**రెండు నెలల్లో తొలగించాలని రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలు**

అంతకుముందు హైవేలను లిక్కర్ ఫ్రెండ్లీ కారిడార్‌లుగా మార్చారంటూ రాజస్థాన్ ప్రభుత్వాన్ని హైకోర్టు విమర్శించింది. రోడ్డు ప్రమాద మరణాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో ఉన్న 1,102 మద్యం దుకాణాలను తొలగించడం లేదా మరో చోటుకు తరలించాలని ఆదేశించింది. మున్సిపల్, స్థానిక సంస్థలు లేదా చట్టబద్ధమైన అభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చినా రాకపోయినా, రెండు నెలల్లోగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పింది. ఇంకా ప్రయాణికులకు కనిపించే విధంగా రహదారులపై మద్యం అమ్మకాలను ప్రోత్సహించే ఎలాంటి సైన్ బోర్డులు, హోర్డింగ్‌లు లేదా ప్రకటనలు ఉండకూడదని స్పష్టం చేసింది.

# ఓట్లు తొలగించేందుకు బిజెపి కుట్ర

ఫారమ్‌లపై ఫోరెన్సిక్ దర్యాప్తు జరపాలి : రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ దోత్రసా

**న్యూఢిల్లీ :** రాజస్థాన్‌లో బిజెపి ప్రతిపక్ష పార్టీకి మద్దతు ఇచ్చే ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుండి మోసపూరితంగా తొలగించడానికి కుట్ర చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని ఎంత మాత్రమే అంగీకరించబోమని మండిపడింది. రాజస్థాన్‌లో ఓటర్ల తొలగింపుకు ఉపయోగించే ఫారమ్‌లపై ఫోరెన్సిక్ దర్యాప్తు జరపాలని కూడా ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. రాజస్థాన్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు టికారామ్ జుల్లీతో కలిసి రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోత్రసా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తన రాష్ట్రంలో 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా ప్రక్రియ తర్వాత, విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 45 లక్షల మంది గైర్హాజరు, బదిలీ లేదా మరణించినట్లు తేలిందని, జనవరి 15 వరకు అభ్యంతరాలకు అవకాశం ఇచ్చారన్నారు. 'జనవరి 3 వరకు ఎటువంటి గందరగోళం లేదు. మొత్తం వ్యవస్థ సజావుగా నడుస్తోంది. అయితే, జనవరి 3న, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ) బి ఎల్ సంతోష్ రాజస్థాన్‌ను సందర్శించి, అక్కడ సమావేశం నిర్వహించారు. ఆపై మోసపూరితంగా ఓట్లను చేర్చడం, తొలగించడం ప్రారంభమైంది' అని ఆయన ఆరోపించారు. ఎన్నికల కమి



షన్ వెబ్‌సైట్ నుండి తాను పొందిన డేటాను మీడియాతో పంచుకున్నారు. డిసెంబర్ 17 నుండి జనవరి 14 వరకు, బిజెపి 937 బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్‌ఎ) ద్వారా 211 పేర్లను చేర్చడానికి, 5,694 ఓట్లను తొలగించడానికి దరఖాస్తులను సమర్పించిందని వెబ్‌సైట్ ద్వారా వెల్లడైందన్నారు. కాంగ్రెస్ పార్టీ 110 బిఎల్‌ఎల ద్వారా 185 పేర్లను చేర్చడానికి, రెండు పేర్లను తొలగించడానికి దరఖాస్తులను సమర్పించిందని, అని దోత్రసా చెప్పారు. ఎన్నికల కమిషన్ గత గురువారం గోవా, లక్షద్వీప్, రాజస్థాన్, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల డ్రాఫ్ట్ రోల్స్‌పై వాదనలు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి చివరి తేదీని జనవరి 19 వరకు పొడిగించింది. ఇసి పాత షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 16, 2025న ప్రచురించబడిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలపై వాదనలు, అభ్యంతరాలను ఓటర్లు జనవరి 15 వరకు దాఖలు చేయాల్సి ఉంది. పేర్లు తొలగించబడిన వారు ఇప్పుడు జనవరి 19వరకు వాదనలు దాఖలు చేయవచ్చని ఇసి తన సూచనలలో తెలిపింది.కాంగ్రెస్ భావజాలంతో అనుసంధానించబడిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి గడువును పొడిగించడానికి బిజెపి, ఎన్నికల కమిషన్ కుట్ర పన్నుతాయని తాము ఇప్పటికే అనుమానించామని, సరిగ్గా అదే జరిగిందన్నారు. ఝుంఝునులో పేర్ల తొలగింపు కోసం ఒకే రోజులో 13,882 ఫారం 7 దరఖాస్తులు వచ్చాయని, మాండవాలో, 16,276, ఉదయపూర్వతిలో 1,241, ఖేత్రిలో, 1,478 వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇయితే 140,000 ఫారాలు ఇప్పటికే నమోదు అయ్యాని దోత్రసా చెప్పారు. రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ తన పార్టీ రాష్ట్రంలో ఈ ప్రజాస్వామ్య ఖూనిని అనుమతించదన్నారు. పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్మికులు, బూత్‌స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు, తద్వారా చట్టబద్ధమైన ఓటు తొలగించబడదు. హోంమంత్రి అమిత్ షా జనవరి 13న రాష్ట్రాన్ని సందర్శించి ముఖ్యమంత్రి నివాసంలో బస చేశారని, జనవరి 3–13 మధ్య 'రహస్య ఆపరేషన్' జరిగిందని దోత్రసా పేర్కొన్నారు.

### భారత్ చేరుకున్న

# యుఎఇ అధ్యక్షుడు

స్వయంగా స్వాగతం పలికిన మోదీ

**న్యూఢిల్లీ :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ చేరుకున్నారు. ప్రధాని మోదీ స్వయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. యుఎఇ అధ్యక్షుడిని ఆలింగనం చేసుకోవడంతో పాటు ఎయిర్‌పోర్ట్ నుంచి వారిద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. ఆ తర్వాత మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఆయన కుటుంబ సభ్యులను కొత్త అధికార నివాసానికి మోదీ తీసుకెళ్లారు. భారత సంప్రదాయ బహుమతులను వారికి అందజేశారు. సుమారు రెండు గంటల అధికార పర్యటనకు వచ్చిన యుఎఇ అధ్యక్షుడితో పలు అంశాలపై ప్రధాని మోదీ చర్చించారు. ఆయనను ఆత్మీయ మిత్రుడిగా ఎక్స్ పోస్ట్‌లో మోదీ అభివర్ణించారు.కాగా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్ భారత్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకున్నది. ప్రధాని



మోదీ ప్రత్యేక ఆహ్వానం మేరకు రెండు గంటల పర్యటనకు ఆయన విచ్చేశారు. యుఎఇ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇది మూడోసారి. గత పదేళ్లలో ఐదో పర్యటన కావడం విశేషం.

# డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం కింద చర్యలు తీసుకోండి

ఐదు కేంద్రపాలిత ప్రాంతాల ఎల్జీలకు అధికారం ఇచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ :** క్యాన్సర్, దయాబెటిస్ వంటి కొన్ని వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఔషధాల విషయంలో తప్పుదారి పట్టించే ప్రకటనలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఔషధాలకు సంబంధించి తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో ఏదైనా ప్రాంగణంలో సోదాలు జరపడానికి, అక్కడి ఏదైనా రికార్డును స్వాధీనం చేసుకోవడానికి ఐదు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులు అధికారాలను ఇచ్చింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం (అభ్యంతరకర ప్రకటనలు) కింద ఈ చర్యలు తీసుకునే అధికారం ఐదు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులకు కేంద్రం ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వు జారీ చేసింది. జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలి, డామన్ అండ్ దయ్యూ, పుదుచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులకు అధికారాలను అప్పగించింది. 'లక్షద్వీప్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలి, డామన్ అండ్




దయ్యూ, పుదుచ్చేరి, జమ్ముకశ్మీర్ వంటి కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకుడు (లెఫ్టినెంట్ గవర్నర్ లేదా అడ్మినిస్ట్రేటర్) రాష్ట్రపతి నియంత్రణకు లోబడి ఉండాలి. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వారి సంబంధిత కేంద్రపాలిత ప్రాంతాల్లో డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం (అభ్యంతరకర ప్రకటనలు) 1954 (1954లో 21) కింద అధికారాన్ని వినియోగించుకోవాలి. అలాగే విధులను నిర్వర్తించాలని రాష్ట్రపతి ఆదేశించారు' అని కేంద్ర హోం శాఖ ఉత్తర్వులో పేర్కొంది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం 1954 అనేది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో కనిపించే ఆయుశ్ మందులు, ఇతర మెడిసిన్, ఔషధాలకు సంబంధించిన తప్పుదారి పట్టించే ప్రకటనలు, అతిశయోక్తి వాదనల నిషేధానికి సంబంధినది. ఈ చట్టం గెజిటెడ్ అధికారులు ఏదైనా ప్రాంగణంలోకి ప్రవేశించి అక్కడ సోదాలు జరపడానికి, తప్పుదారి పట్టించే, అనుచిత ప్రకటనలకు సంబంధించిన ఏదైనా రికార్డును పరిశీలించడానికి లేదా స్వాధీనం చేసుకోవడానికి, డిఫాల్ట్ కేసులపై చర్య తీసుకోవడానికి ఇది కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్‌కు అనుమతిస్తుంది. మధుమేహం, ఊబకాయం, క్యాన్సర్ సహా 54 రకాల వ్యాధులు, రుగ్మతల చికిత్స కోసం కొన్ని ఔషధాల ప్రకటనలను ఈ చట్టం నిషేధిస్తుంది. ఈ వ్యాధులు చట్టం నిషేధించిన షెడ్యూల్ కిందకు వస్తాయి. రోగాల నివారణకు ఔషధాలను ప్రోత్సహించడం లేదా మార్కెటింగ్ చేయకుండా చట్టం ఔషధ కంపెనీలను నిషేధిస్తుంది. చట్టంలో పేర్కొన్న ఏదైనా వ్యాధి, రుగ్మతను నయం చేయడం, తగ్గించడం, చికిత్స చేయడం, నివారణ కోసం ఆ ఔషధాన్ని ఉపయోగించడాన్ని సూచించే ఏదైనా ప్రకటన ప్రచురణలో ఏ వ్యక్తి కూడా పాల్గొనకూడదని పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ అండ మ్యాజిక్ రెమెడీస్ చట్టం (అభ్యంతరకర ప్రకటనలు) కింద ఈ చర్యలు తీసుకునే అధికారం ఐదు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులకు కేంద్రం ఇచ్చింది.

# లద్దాఖ్‌లో భూకంపం..

### లేహ్‌లో 5.7 తీవ్రతతో ప్రకంపనలు



**లేహ్:** కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో సోమవారం భూకంపం సంభవించింది. 5.7 తీవ్రతతో కూడిన భూ ప్రకంపనలు లేహ్‌ను కుదిపేశాయి. ఉదయం 11:51 గంటలకు ఈ భూకంపం సంభవించినట్లు జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (ఎన్‌సీఎస్) తెలిపింది. కార్గిల్‌కు వాయువ్య దిశలో 290 కిలోమీటర్ల దూరంలో, 171 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. కాగా, లద్దాఖ్‌లోని లేహ్‌తో పాటు జమ్ముకశ్మీర్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె), భారత్‌కు ఉత్తరాన ఉన్న పొరుగు దేశాల సమీప ప్రాంతాల్లో కూడా భూమి కంపించినట్లు ఎన్‌సిఎస్ వివరించింది. మధ్య ఆసియాలోని తజికిస్థాన్ వరకు భూ ప్రకంపనలు వ్యాపించినట్లు వెల్లడించింది. మరో వైపు ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు ఎలాంటి సమాచారం అందలేదని ప్రభుత్వ అధికారులు తెలిపారు. లద్దాఖ్‌లోని లేహ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

# సమస్యాత్మక ఓటర్ల పేర్ల జాబితా పంచాయతీ భవన్ల వద్ద నోటీసుబోర్డ్‌లో పెట్టండి

బెంగాల్‌లో 'సర్'పై ఇసికి సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ:** ఓటర్ల పేర్లు, ఇతర వివరాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అలాంటి ఓటర్లందరినీ కలిపి ఒక జాబితాగా తయారు చేసి పశ్చిమ బెంగాల్ పంచాయతీ భవనాల వద్ద నోటీసు బోర్డుల్లోఅంటించాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కార్యాలయాలు లేదా బ్లాక్ కార్యాలయాలవద్ద వారి నుండి తగిన అధికారిక పత్రాలను, వివరాలను సేకరించాలని, వారి అభ్యంతరాలు తెలియజేసే అవకాశం ఇవ్వాలని కోరింది. అదేవిధంగా సమస్యాత్మక ఓటర్లు వారికి సంబంధించిన సవరణలను, సంబంధిత ఆధారిత పత్రాలను సమర్పించే ప్రక్రియ సజావుగా, సక్రమంగా పూర్తయ్యేవిధంగా చూడాలని, ఈ విషయంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా భరోసా ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు కూడా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఈ ప్రక్రియ సజావుగా సక్రమంగా కొనసాగేందుకు తగినంతమంది సిబ్బందిని సమకూర్చాలని, పంచాయతీ భవనాలవద్ద సంబంధిత విభాగాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదేశాలు ఇచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో 1.25 కోట్ల మంది ఓటర్ల పేర్లు సమస్యాత్మకంగా




ఉన్నాయి. ఈ ఓటర్లకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సాక్ష్యాధారాలను పంచాయతీ కార్యాలయాలవద్ద సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. సర్ ప్రక్రియలో సమస్యలు ఎదుర్కొనే ఓటర్లు తమ అభ్యంతరాలను, సాక్ష్యాధారాలను సమర్పించేందుకు అనివార్యంగా తగిన అవకాశం ఇవ్వాలని, వారి సమస్యలను జాగ్రత్తగా ఆలకించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సమస్యాత్మక ఓటర్లతో సహా పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో విధానపరమైన అవతవకలు,నిరంకుశత్వం కొనసాగుతోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా,జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పై విధంగా మార్గదర్శకాలు జారీ చేసింది. అదేవిధంగా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ వల్ల నష్టపోయేందుకు అవకాశం ఉన్న ఓటర్లు సంబంధిత తమ ఆధారాలను, ఇతర పత్రాలను సమర్పించేందుకు, అభ్యంతరాలు తెలియజేసేందుకు పూర్తి అవకాశం ఇవ్వాలని కూడా ఆదేశించింది. 2002 ఓటర్ల జాబితాతో ముడిపడిన సంతానానికి ఈ సర్ ప్రక్రియలో తార్కిక వ్యత్యాసాలు, సమస్యలు అంటే తల్లిదండ్రుల పేర్లలో తేడాలు ఉండటం, తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య నిర్దేశించిన విధంగా 15 ఏళ్ళు అంతకంటే ఎక్కువగా 50 సంవత్సరాలు వయసు తేడాలు ఉండాలన్న విషయాలపై ఎక్కువగా సమస్యలు తలెత్తుతున్నాయి.

# లౌకికవాదానికి బలమైన కోట 'కేరళ'

ముఖ్యమంత్రి పినరయి విజయన్

**కొల్లం :** కేరళను లౌకికవాదానికి బలమైన కోటగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో కులం, మతం పేరుతో జరిగే దారుణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రానికి ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని, బలమైన లౌకిక ఆధారాలు కేరళను ఇతర రాష్ట్రాల కంటే ఒక నమూనాగా నిలుస్తున్నాయని తాను గమనించానన్నారు. శ్రీ నారాయణ గురు సాంస్కృతిక సముదాయంలో సాధువు, సామాజిక సంస్కర్త, పునరుజ్జీవనోద్యమ నాయకుడు శ్రీ నారాయణ గురు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడారు. మహిళలు, పిల్లలపై దాడులు, మత అల్లర్లు, హత్యల నివేదికలు ఇతర చోట్ల పెరుగుతున్నప్పటికీ, కేరళ తన లౌకికత్వానికి కట్టుబడి ఉందని వామపక్ష అనుభవజ్ఞుడు చెప్పారు. 'ఈ మధ్య,



కేరళ లౌకికవాదానికి బలమైన కోటగా నిలుస్తోంది. శ్రీ నారాయణ గురు జోక్యం రాష్ట్ర లౌకిక ప్రమాణాలకు బలమైన పునాది వేసిందని సందేహం లేకుండా చెప్పగలం' అని ఆయన అన్నారు. సాంస్కృతిక సముదాయాలు కేవలం భౌతిక నిర్మాణాలుగా మాత్రమే కాకుండా, సంభాషణ, కళాత్మక వ్యక్తీకరణ, గురువు బోధనల నుండి ప్రేరణ పొందిన ప్రగతిశీల సామాజిక ఆలోచనల ప్రచారానికి స్థలాలుగా పనిచేయాలని విజయన్ నొక్కి చెప్పారు.

# మున్సిపల్ పోల్స్‌కు పచ్చజెండా

రాష్ట్రంలోని పురపాలక సంఘాలకు ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని ఆదివారం మేడారంలో జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించటంతో, గడువు ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు రాష్ట్ర ఎన్నికల సంఘం నేడో రేపో ఎన్నికల షెడ్యూలు విడుదల చేయనుంది. 2025 డిసెంబర్‌లో పార్టీరహిత ప్రాతిపదికగా గ్రామ పంచాయతీ ఎన్నికలు కోలాహలంగా ముగిసాయి. డిసెంబర్ 22వ తేదీన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు పదవీ ప్రమాణం స్వీకరించటంతో పల్లెల్లో కొత్త ప్రజాస్వామిక పాలన పునరారంభమైంది.

ఔటర్ రింగ్ రోడ్డు లోపల, జిహెచ్‌ఎంసి పరిధికి వెలుపల ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 20 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే అధికారిక లాంఛనాలు పూర్తి కావటంతో తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీల సంఖ్య 121కి, మున్సిపల్ కార్పొరేషన్‌ల సంఖ్య 10కి తగ్గింది. వాటిలో పాలకమండళ్ల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహిత ప్రాతపదికన జరిగినందున ప్రధాన రాజకీయ పార్టీల్లో ప్రతి ఒక్కటి తాము గెలిచిన పంచాయతీల సంఖ్యను తమ ఇష్టానుసారం ప్రచారం కోసం ప్రకటించుకున్నాయి. ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు జరగాల్సి ఉంది. గ్రామపంచాయతీ ఎన్నికలు డిసెంబర్‌లో జరపడం వల్లనే అభివృద్ధి నిధుల కోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్న పంచాయతీలకు కేంద్రం నుండి చట్ట ప్రకారం అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల రాక మొదలైంది.

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు చట్టరీత్యా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం డేటా సేకరణపరంగా, శాసనపరంగా, కేంద్రం ఆమోదం కోసం ఒత్తిడి చేసేందుకు ఆందోళన నిర్వహణ పరంగా చేసిన సర్వ ప్రయత్నాలూ మోదీ ప్రభుత్వం ముందు చెవిటివాని ముందు శంఖం ఊదిన చందమే అయింది. అన్ని రకాల రిజర్వేషన్లు కలిసి సుప్రీంకోర్టు విధించిన 51 శాతం పరిమితి పెంపుదలకుగాని లేదా తెలంగాణ శాసనాన్ని రాజ్యాంగం 6వ షెడ్యూల్ చేర్చి పెంచిన రిజర్వేషన్లకు రక్షణ కల్పించేందుకుగానీ కేంద్రం ప్రయత్నం చేయలేదు. దాంతో గతంలో చట్టం ప్రకారం ఉన్న 27శాతం బిసి రిజర్వేషన్‌తోనే ఎన్నికలకు వెళ్లాల్సి వచ్చింది, వస్తున్నది. అయితే బిసి సంఘాల వారు 42శాతం అమలును డిమాండ్ చేయడంలో తప్పులేదు. కానీ 42 శాతం అమలులోకి తెచ్చే వీలు కల్పించని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో కొట్లాడే బదులు, 42 శాతం సాధించేవరకు ఎన్నికలు జరిపితే భూకంపం సృష్టిస్తాయని బిసి నాయకులు పోటాపోటీగా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేయడం గాడి తప్పిన ఆలోచనగా ఉంది. బిసి హక్కుల సాధనకై జీవితాన్ని వెచ్చించిన కృష్ణయ్య ఇప్పుడు బిజెపి రాజ్యసభ సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయన తమ న్యాయమైన కోర్కె సాధనకై కనీసం రెండు తెలుగు రాష్ట్రాల (ఇంతకుముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపిగా కూడా ఉన్నారు) ఎంపిలను కూడగట్టి ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్తే ఏమైనా ప్రయోజనం ఉంటుందేమో ప్రయత్నించాలి. మండల్ కమిషన్ సిఫారసులు అమలులోకి రావడానికి ఎన్ని సంవత్సరాలు పట్టిందీ గుర్తుకు తెచ్చుకోవాలి. ఒక సామాజిక, రాజకీయ సంస్కరణ సంబంధీకులు తొందరపడినంతగా అమలులోకి రాదు. తమ కోర్కెను బలపరిచేందుకు, కేంద్రం అనుమతి లభిస్తే అమలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్న ఒక రాష్ట్ర ప్రభుత్వం దొరికినందుకు సంతోషించాల్సింది పోయి దానినే బదనాం చేయటం సమంజసమని ప్రజలు భావించరు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిసిలు శక్తి మేరకు గెలిచారు. రేపు మున్సిపల్ ఎన్నికల్లో సైతం రిజర్వేషన్ల వెలుపల కూడా గెలుస్తారు. 42శాతం అమలు జరిగే వరకు ఎన్నికలు జరపకూడదన్న వాదన అప్రజాస్వామికం, స్థానిక అభివృద్ధికి వ్యతిరేకమవుతుంది.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సర్వసన్నద్ధంగా ఉంది. మంత్రివర్గ నిర్ణయం దరిమిలా, ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నుంచి ఇసి రాణి కుమిదినికి అధికారిక లేఖ అందింది. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మందికి ఓటు హక్కు ఉంది. వారిలో పురుషులు 25,62,369 మంది, కాగా స్త్రీలు 26,86,014, ట్రాన్స్‌జెండర్లు 640. మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి శనివారం నాడు ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా ప్రకటించారు. డెడికేటెడ్ కమిషన్ నిర్ణయం ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్ల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇసి ప్రకటించారు.

నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా 1,34,774 మంది కొత్తగూడెంలో ఉన్నారు. మున్సిపాలిటీల్లో అధికంగా 1,43,655 మంది ఓటర్లు ఆదిలాబాద్‌లో, అత్యల్పంగా 9,147 మంది అమరచింతలో ఉన్నారు. అన్ని కేటగిరిల్లో మహిళలకు చట్ట ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారు. 10 కార్పొరేషన్స్ మేయర్ పదవులను ఎస్‌సి, ఎస్‌టిలకు చెరొకటి, బిసిలకు 3 (ఒకటి మహిళ), జనరల్ 5. మున్సిపల్ చైర్మన్ పదవులు 121లో ఎస్టి 5 (మహిళ 2), ఎస్సీ 17 (మహిళ 8), బిసి 38 (మహిళ 19), జనరల్ 61 (మహిళ 31).

పట్టణ, నగర స్థాయిల్లో ఇది ప్రజాస్వామ్యం పండుగ. గ్రామపంచాయతీల్లో 60శాతం పైగా తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిచినట్లు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్సిపల్ ఎన్నికల్లో అంతకుమించి అనుకూల ఫలితాలు ఆశిస్తున్నారు. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికల్లో ఏ పార్టీకైనా క్లైయింలకు అవకాశముండదు.



## శాశ్వత పరిష్కారం చూపాలి

దేశంలో వీధి కుక్కల సమస్యకు కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలి. సాధారణంగా సమాజంలో కుక్క మనిషిని కరవడం తప్పే. ఆ ఒక్క మూగజీవి కోసం మిగతా కుక్కలను ఎందుకు బలి చేయాలి? వంద కుక్కలు ఉంటే అందులో 5 కుక్కలు మాత్రమే మనుషులను కరిస్తే మిగతా 95 కుక్కలను కూడా చంపేస్తున్నారు. ఆ విధానం సరికాదు. మనిషిని కుక్క కరిస్తే స్పందించే వ్యవస్థలు, రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలు, డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల బారినపడి సంభవించే మరణాలు, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవడం, చిన్నారుల జరుగుతున్న అత్యాచారాలపై ఎందుకు స్పందించడం లేదు? మనుషులతో పాటు అన్ని ప్రాణులకు జీవించే హక్కు ఉంది.

ప్రముఖ సినీ నటి రేణూ దేశాయ్



## భూగర్భజలాల సంక్షోభం – ముప్పులో రేపటి జీవితం

నీరు లేకుండా జీవితం ఊహించలేం. అయినప్పటికీ, మనం నీటి విలువను సరిగ్గా గుర్తించకపోవడంవల్ల, ముఖ్యంగా భూగర్భజలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, భవిష్యత్తులో తాగు నీటి కోసం కూడా తీవ్ర సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, మొత్తం సమాజం ఎదుర్కొంటున్న పెద్ద సమస్యగా మారబోతోంది. భూమిపై నీటి వాస్తవ స్థితి భూమి ఉపరితలంపై సుమారు 71 శాతం నీరు ఉంది. అయితే ఇందులో ఎక్కువ భాగం సముద్రాల్లో ఉన్న ఉప్పు నీరు. దాదాపు 97 శాతం ఉప్పు నీరు కాగా, కేవలం 3 శాతం మాత్రమే తీపి నీరు. ఈ తీపి నీటిలో కూడా పెద్ద భాగం మంచు రూపంలో లేదా మనకు చేరని ప్రాంతాల్లో ఉంది. నిజంగా తాగడానికి, వ్యవసాయానికి ఉపయోగపడే నీరు మొత్తం నీటిలో ఒక శాతం కంటే కూడా తక్కువ. అంటే మనం వినియోగిస్తున్న నీరు అత్యంత పరిమితమైన వనరు. భూగర్భజలాలు 30 శాతం కంటే ఎక్కువ తగ్గుదలకు దారి తీస్తే తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుంది అని నిపుణులు చెపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతాల్లో, భూగర్భజలాల వినియోగం గత కొన్ని సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. ఎక్కువగా బోర్లు వేయడం, నీటి అవసరం అధికంగా ఉండే వరి, మొక్కజొన్న వంటి పంటలను అధికంగా సాగు చేయడం, వర్షపు నీటిని నిల్వ చేయకపోవడం, చెరువులు, కుంటలు పూడికతో నిండిపోవడం, చెట్ల నరుకుడు వంటి కారణాలు భూగర్భజలాల తగ్గుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా, వర్షపాతం తగ్గినా, పడిన వర్షం నేలలోకి చేరకుండా వృథాగా పోతుండడం కూడా మరో పెద్ద సమస్య. భూగర్భజలాలు తగ్గితే వచ్చే పరిణామాలు భూగర్భజలాలు తగ్గితే ముందుగా బోర్లు ఎండిపోతాయి. దాంతో తాగునీటి కొరత ఏర్పడుతుంది. వ్యవసాయం దెబ్బతింటుంది, పంట దిగుబడులు తగ్గుతాయి, రైతులు అప్పుల పాలవుతారు. గ్రామాల్లో జీవనాధారం కష్టమవడంతో ప్రజలు పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది. దీర్ఘకాలంలో ఆహార కొరత, ఆరోగ్య సమస్యలు, సమాజంలో ఘర్షణలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నీటి కోసం గొడవలు జరుగుతున్న పరిస్థితిని మనం చూస్తున్నాం.

ఈ పరిస్థితిని మార్చాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. రైతులు తక్కువ నీరు అవసరమైన పంటల వైపు దృష్టి పెట్టాలి. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించాలి. అవసరం లేకుండా వరుసగా బోర్లు వేయకుండా నియంత్రణ అవసరం. గ్రామ స్థాయిలో చెరువులు, కుంటలను పునరుద్ధరించడం, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) అమలు చేయడం, చెట్లు విస్తృతంగా నాటడం వంటి చర్యలు అత్యంత అవసరం. ప్రతి ఇంట్లో నీటి వృథాను తగ్గించే అలవాటు పెంపొందించాలి. నీరు కాపాడితేనే రేపటి జీవనం. నీరు కేవలం ఒక వనరు కాదు అది జీవనాధారం. నేడు మనం నిర్లక్ష్యం చేస్తే, రేపు మన పిల్లలకు తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి రావచ్చు. అందుకే నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే.

– మలిపెద్ది పవన్‌కళ్యాణ్ (గుండాల)
7093052815

# మేడారంలో ఆదివాసీ సాంస్కృతిక పునరుజ్జీవనం



తోట సుధాకర్
9440582716

మేడారం జాతరలో చేపడుతున్న గ్రానైట్ నిర్మాణాలు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం, రాతి కట్టడాలపై శిల్పులు చెక్కిన బొమ్మలు ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి ప్రతీకగా అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా కోయల చారిత్రక పూర్వపరాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించే చిత్రాలను చెక్కుతున్నారు. ఆధ్యాత్మిక జీవన విధానానికి సంబంధించి చిహ్నాలతోపాటు కోయల జీవన విధానం, సమ్మక్క,సారలమ్మ, జంపన్న, పగిడిద్ద రాజు, గోవిందరాజుల చరిత్ర, కోయల గోత్రాలు వారి చరిత్రకు సంబంధించి ఆనవాళ్ళు, మూలాలు ప్రతిబింబించే చిహ్నాలను చెక్కుతున్నారు.


మేడారంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన మాస్టర్ ప్లాన్‌లో శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతోపాటు ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి వేదికగా తీర్చిదిద్దుతోంది. ప్రతీ రెండేళ్ళకోసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర సందర్భంగా వచ్చే లక్షలాది భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణాలు, వసతులు చేపట్టడం గత కొన్నేళ్ళుగా సాగుతోంది. ఈసారి మాత్రం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి భిన్నంగా మేడారంలో మాస్టర్ ప్లాన్ అమలుకు నిర్ణయం తీసుకున్నది. ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దాదాపు రూ.250 కోట్ల వ్యయంతో శాశ్వత ప్రతిపదికన నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమైంది. దీనిలో భాగంగా సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ పనులను పూర్తిస్థాయిలో రాతి కట్టడాలు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు.

### నాలుగు వేల టన్నుల గ్రానైట్ వినియోగం

మేడారం గద్దెల ప్రాంగణంలో చేపడుతున్న రాతి కట్టడాల కోసం నాలుగువేల టన్నుల గ్రానైట్ వినియోగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఆళ్ళగడ్డ ప్రాంతంలోని ఈ ప్రత్యేక గ్రానైట్‌ను గద్దెల చుట్టూ రాతికట్టడం, ప్రాకారం, ప్రవేశ ద్వారాల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. 500 సంవత్సరాలలో ఇలాంటి రాతి కట్టడం మరెక్కడా లేదంటున్నారు. చరిత్రలో ఒక మైలు రాయిగా నిలవనుంది. గద్దెల ప్రాంగణంలో చేపట్టిన నాలుగు వేల టన్నుల గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ తల్లుల చరిత్రను తెలియజేసే 7వేల బొమ్మలతో ప్రాంగణంలో నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. టార్గెట్ వంద రోజుల లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఈ నెల 12వ తేదీలోపు పనులను పూర్తిచేసి 19న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. రాయచోటి నుంచి తెప్పించిన భారీ గ్రానైట్‌రాళ్లను 600 కిలోమీటర్ల దూరంలోని మేదారానికి తరలించారు. వీటిని చెక్కేందుకు ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నెలల తరబడి రేయింబవళ్లు శ్రమించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

### రాతి కట్టడాలపై కోయల చరిత్ర చిహ్నాలు

శిల్పాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు శిల్పాలు ప్రతీకలు గ్రానైట్ కట్టడాలపై సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజు. కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి. పశుపక్ష్యాదులతో పాటు వారి జీవనశైలి,



గ్రానైట్‌పై చెక్కిన కోయల చరిత్ర చిహ్నాలు

### ఆదివాసీ సాంస్కృతిక పునరుజ్జీవనం

మేడారం జాతరలో చేపడుతున్న గ్రానైట్ నిర్మాణాలు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం, రాతి కట్టడాలపై శిల్పులు చెక్కిన బొమ్మలు ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి ప్రతీకగా అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా కోయల చారిత్రక పూర్వపరాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించే చిత్రాలను చెక్కుతున్నారు. ఆధ్యాత్మిక జీవన విధానానికి సంబంధించి చిహ్నాలతోపాటు కోయల జీవన విధానం, సమ్మక్క,సారలమ్మ, జంపన్న, పగిడిద్దరాజు, గోవిందరాజుల చరిత్ర, కోయల గోత్రాలు వారి చరిత్రకు సంబంధించి ఆనవాళ్ళు, మూలాలు ప్రతిబింబించే చిహ్నాలను చెక్కుతున్నారు. దీంతో ఇప్పటి వరకు కేవలం కొద్ది మందికే పరిమితమైన ఆదివాసీల ఆధ్యాత్మిక విధానం, జీవన విధానానికి సంబంధించిన చరిత్ర చిహ్నాలు శాశ్వతంగా భద్రపరిచేందుకు అవకాశం లభించింది. భవిష్యత్ తరాలకు ఈ చరిత్ర చాటిచెప్పే విధంగా నిర్మాణాలు సాగుతున్నాయి. గ్రానైట్ నిర్మాణాలు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం, ద్వారాలు, భారీ తోరణాలు, ఆచార సంప్రదాయాలకు, గొట్టు, గోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ నిలువు గీతలు స్తంభాల పై చెక్కారు. సమ్మక్క సారక్క వంశస్తులతోపాటు, 250 వంశాలకు చెందిన ఇంటి పేర్లు, మూలాలను శిలలపై చెక్కారు. తెల్లని గ్రానైట్ స్తంభాల ప్రధాన ద్వారం, ఆయా శిలలపై సమ్మక్క సారక్క పూర్వీకులతో పాటు కోయల జీవనశైలిని తెలిపేలా శిల్పాలు చెక్కారు. 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలు చెక్కారు.శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్ల జీవన చిత్రాలను గీశారు. స్వాగత తోరణం పై 58 బొమ్మల్లో సమ్మక్క వంశీయుల మూలాలు, పక్షులు, జంతువుల బొమ్మలున్నాయి. సమ్మక్కకు చెందిన రాయి బందానీ వంశంలోని 5వ గొట్టు ఒంటికొమ్ము దుప్పి, అడవి దున్న కొమ్ములు, ఆరు నెమలి ఈకలు చిత్రించారు.మరో ప్రధాన ద్వారంపై మూడో గొట్టు సారక్క వంశవృక్షంతో పాటు వడ్డే గోత్రం సిద్ద బోయిన, కొక్కెర వంశం వృక్షాన్ని తెలియజేస్తోంది. మూడు నిలువు, అడ్డం గీతలు, మూడో గొట్టు గోత్రం గురించి తెలిపే గుర్తులున్నాయి. త్రిభుజాలు పగిడిద్దరాజు సమ్మక్క నాగులమ్మల బిడ్డ సారలమ్మ రాజ్యం మూడో గొట్టుకు ప్రతీకగా నిలుస్తోంది.

### ఒక్కో చిత్రం.. ఒక్కో చరిత్ర

చతురస్రం సగం ముక్కలు, ఎడమవైపు రెండో పిల్లర్ మీద ఇప్ప చెట్టు, మూడోగొట్టు పవిత్ర వృక్షంగా చెబుతున్నారు. మనిషి చేతిలో బాణం,ఉడుము, మూడో గొట్టు వారు పూజించే జంతువు ఎనిమిది లతలు, ఎనిమిదో గొట్టు రాజ్యం గుర్తు, ఎక్స్ ఆకారం, ఎనిమిదోగొట్టు వడ్డె గోత్రంగుర్తుగా చెబుతున్నారు. సమ్మక్క తల్లిది 5వ గొట్టు, సారలమ్మది 3వ గొట్టు, ఆదమరాజు వంశ వృక్షం, వడ్డే గోత్రం సిద్ధరబోయిన, కొక్కెర వంశ వృక్షం, శివ గొట్టు నాగులమ్మ రాయి బందనీ వంశం, పగిడిద్దరాజు, గోవిందరాజుల మూలాలకు ప్రతీకగా ఐదు నిలువు గీతలు ఐదవ గొట్టును తెలియజేస్తుంది.ప్రాచీన అఖండ భారత భూభాగంలోని 18 దిక్కులను తెలియజేస్తుంది. ఉత్తరభారతాన మూడో గొట్టు 36 రాజ్యాలను, దక్షిణాన ఆరో గొట్టు 18 రాజ్యాలు పాలించినట్లు కోయల చరిత్ర చెబుతున్నది. వీటితో పాటు నెలవంక, ఏనుగు, ఆరో గొట్టు బేరం వంశం వారి నుదుటి బొట్టును తెలియజేస్తోందన్నారు. మూడు అడ్డగీతలు మధ్యలో చుక్క, ఆది శక్తి మళ్లీ సమ్మక్క రూపంలో అవతరించిందని కోయలు సమ్ముతారు. సమ్మక్క తల్లి పులి రూపంలో ఉంటుందన్నది కోయల విశ్వాసం. కోయత్వర్ ధర్మ చిహ్నం: కోయల ఇంటి పేర్లు, సంప్రదాయాలతో పాటు పశుపతి బేరంబోయిన రాజు ధర్మం దిశానిర్దేశంగా భావిస్తారు. తూతకొమ్ము కోయలు వేల్పు పండగ, చక్రం రంభ, నాగుపాము, ఐదు పలకల గుర్తు ఐదో గొట్టు రాజ్యం గుర్తుకు ప్రతీక, నాలుగు నిలువు గీతలు నాలుగో గొట్టును, కంకవనం ఐదో గొట్టు గోత్రం వృక్షం వెదురు చెట్లు, పక్షి పావురం, తెల్లగుర్రం, స్వస్తిక్: కోయ రాజ్యాలు పూర్వం వ్యాపారాలకు ప్రతీకగా నెమలిని సమ్మక్క తల్లి ప్రతిరూపంలో భావిస్తారు.

### ఒక్కో బొమ్మకు ఒక్కో అర్థం

మారేడు చెట్టును బందానీ వంశం పూజిత వృక్షంగా, 7వ గొట్టు గట్టు పొరేడు వంశస్తులది. ఇది వారి నుదుటి బొట్టును తెలియజేస్తోంది. శివ లింగాలు, వెంకన్న నామాలు కూడా. గోవిందరాజుల ప్రధాన గద్దలపై తిరుపతి వెంకన్న నామాలు, శంకు, స్వస్తిక్ వంటి చిత్రాలు ఉన్నాయి. ఎండి ముక్కు కొకాడి, పైడిముక్కు కోకాడి, ఎద్దు వన్దే గోత్రం మూగ గొట్టు నుదుటి బొట్లు, మూడు అడ్డ గీతలు మధ్యలో చుక్క, ఖడ్గమృగం నిలువు గీత నాల్గవ గొట్టు సనపగాని మతం నుదుటి బొట్టును తెలియజేస్తుంది. వీళ్ల గోత్ర జంతువు ఖడ్గమృగం, త్రిశూలం, ఒంటికొమ్ము దుప్పి, త్రిశూలం ఐదో గొట్టు రాయి బందానీ వంశం నుదుటి బొట్టును తెలియజేస్తుంది. వీళ్ల గోత్ర పూచిత జంతువు ఒంటికొమ్ముదుప్పిగా చెబుతున్నారు. మరుబోతు: సంవంకలో చుక్క ఏడో గొట్టు పాలేడుగట్టు వంశం నుదుటి బొట్టును తెలుపుతుంది. మనుబోతు, సింహం, సూర్య చంద్రులు, కల కోడి, కలక తామరపువ్వు బొమ్మలను చిత్రీకరించారు. ఒక్కో బొమ్మకు ఒక్కో అర్థం, ఆచారం, సంప్రదాయం ఉందని కోయల చరిత్రపై పరిశోధన చేసిన అర్కిటెక్టులు చెబుతున్నారు.

# బడుగుల ఆరాధ్యదైవం ఠక్కర్ బాపా

**నేడు అమృత్ లాల్ విఠల్ దాస్ ఠక్కర్ వర్ధంతి**



దేశంలోని గిరిజన ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన వారిలో అమృత్ లాల్ విఠల్ దాస్ ఠక్కర్ ముఖ్యమైన వారు. సామాజిక కార్యకర్తగా పేరొందిన ఆయన ఠక్కర్ బాపాగా ప్రసిద్ధి చెందారు. ఠక్కర్ బప్పా 1869 నవంబర్ 29న గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతంలోని భావ్‌నగర్‌లో మధ్యతరగతి లోహ నా గుజరాతీ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. అనారోగ్యంతో ఠక్కర్ బాపా 1951 జనవరి 20న మరణించారు. 1886లో ఆయన భావ్‌నగర్ హైస్కూల్ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేసి సర్ జస్వంత్ సింగ్ జీ స్కాలర్‌షిప్ పొందారు. ఆయన తండ్రి విఠల్ దాస్ ఠక్కర్ ఆ బిడ్డకు అమృత్ లాల్ అని పేరు పెట్టారు. ఆయన 1890లో పూనా ఇంజనీరింగ్ కళాశాల నుండి సివిల్ ఇంజనీరింగ్ లైసెన్స్ పొందారు. ఆయన పోర్బందర్‌లో ఇంజనీర్‌గా పనిచేశారు, సాంగ్లి రాష్ట్రంలో చీఫ్ ఇంజనీర్‌గా కూడా పనిచేశారు, తరువాత బొంబాయి మునిసిపాలిటీలో ఇంజనీర్‌గా ఉద్యోగం పొందారు. బొంబాయి పట్టణం మొత్తం చెత్తను పారవేయాల్సిన చెత్తాచెదారాలతో దయనీయ పరిస్థితులను ఆయన మొదటిసారిగా ఇక్కడే చూశారు. స్వీపర్లు నివసిస్తున్న మురికి కాలనీలను చూసి అతను షాక్ అయ్యాడు, ముంబాయి ప్రజల కష్టాలను తీర్చడానికి తన జీవితాంతం అంకితం చేయాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు. తమిళనాడులో ఠక్కర్‌ను 'ఠక్కర్ బాపా' యొక్క తమిళ వెర్షన్ అయిన 'అప్పా ఠక్కర్' అని పిలుస్తారు. బాపా చాలా పరిజ్ఞానం కలిగిన మేధావి. తరచుగా అతనిపై విసిరిన ప్రశ్నలకు తక్షణమే సమాధానమివ్వడం వల్ల, మద్రాస్ బాషా పదంలో 'అప్ప టక్కర్' అని పిలవడంలో 'అన్నీ తెలిసిన వాడు' అని అర్థం. ఆ తరువాత ఠక్కర్ తూర్పు ఆఫ్రికాలోని ఉగాండా (దేశం) రైల్వేలలో పనిచేశారు. 1914లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అతను 1905లో గోపాల్ కృష్ణ గోఖలే స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలో 1914లో సభ్యత్వం తీసుకున్నారు. అంట రానితనం, గిరిజనుల హక్కుల కోసం వాదించారు. 1922లో భిల్ సేవా మండల్‌ను స్థాపించారు. 1930–32లలో అటవీ నివాసులైన గిరిజన ప్రజలను సూచించడానికి 'ఆదివాసీ' అనే పదాన్ని ఠక్కర్ తొలిసారి ప్రాచుర్యంలోకి తెచ్చారు. 1932 హరిజన సేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఠక్కర్ చొరవతోనే భారతీయ అదిమజాతి సేవక్ సంఘ్ స్థాపించబడింది. ఒక సందర్భంలో మహాత్మాగాంధీ బాపాను హరిజనుల తండ్రి అని పిలిచారు. మహారాష్ట్ర ప్రభుత్వం 2007లో ఠక్కర్ బప్పా ఆదివాసీ వస్తీ సుధారణ పేరుతో ఆదివాసీ గ్రామాలు, కాలనీలను మెరుగు పరచడానికి పథకాన్ని రూపొందించింది.

– సుధాకర్.ఏ.వి
9000674747

# నరేగా పునరుద్ధరణకు ఐక్యపోరాటాలు

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో తెచ్చిన విబి జి రామ్ జిని రద్దు చేసి నరేగాను పునరుద్ధరించి పకడ్బందీగా అమలు జరపాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహించడానికి వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘాల ఉమ్మడి వేదిక, నరేగా సంఘర్ష మోర్చా పిలుపునిచ్చాయి. ఢిల్లీలో ఈ అంశంపై హెచ్‌కెఎస్ సూర్జిత్‌భవన్‌లో మొదటి జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఇటీవల జరిగింది. ఇందులో వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు, నరేగా సంఘర్ష్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాలు సంస్థలతో కూడిన విస్తృత జాతీయ స్థాయి ఉమ్మడి వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశానికి అధ్యక్ష వర్గంగా వి.ఎస్.నిర్మల్ (బికెఎంయు) బి.వెంకట్ (ఏఐఏడబ్ల్యూ) ముఖేష్ నిర్వాసిత్ (నరేగా సంఘర్ష్ మోర్చా) అనురాధ తల్వార్, ముఖేష్ నిర్వాసిత్ వ్యవహరించారు. ప్రముఖ ఆర్థికవేత్త జయతి ఘోష్ సమావేశాన్ని ప్రారంభించారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గోరియా, నరేగా సంఘర్ష మోర్చా నుండి నిఖిల్ డే, వివిస్ గిరి ఎఐటియుసి, సుదీప్ దత్త సీఐటీయు, షహనాజ్ రఫిక్ ఐఎఫ్టీయూసీ, కిసాన్ మోర్చా ప్రతినిధులు రంజాన్ క్షీర సాగర్, ప్రేమ్ సింగ్ గెహ్లోట్, ఆర్.ఎస్.డాగర్ ఎఐఎస్‌కెఎస్, అర్చన ప్రసాద్, డాక్టర్ ఆర్తి, హిమాంగ్ రాజ్, హరీష్ బాల, సుభాష్ జాకర్, విక్రమ్ సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న నరేగాను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం వ్యవసాయ కార్మికులకు పేద రైతులకు గ్రామీణ కార్మికులకు తీరని శాపంగా మారుతుందని సమావేశంలో మాట్లాడిన వక్తలు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలను నిరోధించి కోట్లాదిమంది గ్రామీణ పేదలకు కొంతమేరకు ఉపాధి కలిగించడంలో ఉపాధి హామీ పథకం దోహదం చేసిందని, దానిని రద్దు చేయడం అంటే గ్రామీణ పేదల హక్కులపై ప్రత్యక్ష దాడే,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడమేనన్నారు. కేంద్రం కొత్తగా తెచ్చిన చట్టం విబి జి రామ్ జి ('వికసిత్ భారత్ రోజ్గార్ యోజన అజీవిక హామీ మిషన్' (గ్రామీణ)) ఉపాధి పనులను కేంద్రం నిర్ణయించిన మేరకే, కేంద్రం నోటిఫై చేసిన గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే అమలు చేస్తుందని, వేతనాల చెల్లింపు బాధ్యతను నీరుగారుస్తుందని, కేంద్రం నిధులను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించడం, రాష్ట్రం నిధులను 10 శాతం నుండి 40 శాతానికి పెంచడం వలన రాష్ట్రాలపై గణనీయమైన ఆర్థికభారం పడుతుందని, ఇది ప్రజాస్వామ్యం చట్రంలో సమాఖ్య వాదంపై దాడిగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి కొత్త చట్టాన్ని రద్దు చేసి నరేగాను పునరుద్ధరించేంతవరకు ఐక్యంగా పోరాడాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

**కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది డిమాండ్స్ ఆమోదించాలి.**

* గ్రామీణ కార్మికుల ఉపాధి హామీ, పని హక్కు, దానితో పాటు వారి గౌరవాన్ని హరించే విబి జి రామ్ జీని వెంటనే రద్దుచేసి ఎంజీ నరేగాను పునరుద్ధరించాలి.
* ప్రతి గ్రామీణ కార్మికుడికి సంవత్సరంలో 200 రోజులు పని కలిగించాలి, కనీస వేతనం రూ.700 ఇవ్వాలి.
* నరేగా పనులను ప్లాన్ చేయడానికి, అమలుకు గ్రామ సభల అనుమతి తప్పనిసరి చేయాలి.

**ఆందోళన పోరాట కార్యక్రమాలు**

* విబి జి రామ్ జి రద్దు, నరేగా పునరుద్ధరణ, పట్టిష్టంగా అమలు కోసం మొదటిదశగా నెలరోజుల పోరాట కార్యక్రమాన్ని సమావేశం నిర్ణయించింది.
* జనవరి 25వరకు విబి జి రామ్ జి కొత్త చట్టం, దాని యొక్క లోపాలను, కేంద్ర ప్రభుత్వం దుష్ప్రచారాలు గురించి గ్రామీణ ప్రజలకు, కార్మికులకు అవగాహన కలిగించేందుకు అట్టడుగు స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలి.
* జనవరి 26న సభలు, సమావేశాలు నిర్వహించి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి.
* ఫిబ్రవరి 2న రెండు దశాబ్దాల క్రితం నరేగా ప్రారంభించబడిన రోజును పురస్కరించుకొని ఆ రోజున రాష్ట్ర, జిల్లా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి.
* ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి.

నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగాను, వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఎంజీ నరేగాను పునరుద్ధరించి పకడ్బందీగా అమలు జరపాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలి. పై ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘాల జాతీయ ఉమ్మడి వేదిక, నరేగా సంఘర్ష్ మోర్చా దేశంలోని వ్యవసాయ కార్మిక, పేద, సన్నకారు, చిన్నకారు రైతులకు, గ్రామీణ పేదలకు విజ్ఞప్తి చేస్తున్నది.

**– తాటిపాముల వెంకట్రాములు,**
**భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్,**
**జాతీయ కార్యవర్గ సభ్యుడు**

# మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

**ఆదర్శ మున్సిపాలిటీగా భూపాలపల్లి**
**రూ.3 కోట్లతో కృష్ణ కాలనీలో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన**
**మంత్రి పొన్నం ప్రభాకర్**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో రూ.3 కోట్ల వ్యయంతో ప్రొటెక్షన్ వాల్ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఎస్పీ సంకీర్త్ లతో కలిసి మంత్రి కుస్థాపన చేశారు. ఎమ్మెల్యే జీఎస్సార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ పట్టణంలోని 26వ వార్డు, టీ2 క్వార్టర్స్, 5, 6, 7, కృష్ణ కాలనీలో అడవి జంతువుల బెడద ఉందని ప్రజల భద్రత దృష్ట్యా ప్రొటెక్షన్ వాల్ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మహిళల పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 48 గంటల్లోనే ఉచిత బస్సు సదుపా యం కల్పించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరలు అందజేశామని, పట్టణాల్లో మహిళలకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు సంక్రాంతి సారె అందజేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుడు చేయడం లక్ష్యంగా రేవంత్ రెడ్డి నాయక త్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళలకు వడ్డీ రుణాలు అందజేస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలోని కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూంలను ఊరించి ఎవరికీ ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు అందజేయడం జరుగు తుందని తెలిపారు. గత పదేళ్లుగా రేషన్ కార్డు లేక నిరుపేదలు ఇబ్బందులు పడ్డారని తాము అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించామని, ఇంకా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దేశంలో ఈ ప్రభుత్వం ఇవ్వని విధంగా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతీ ఇంటికి 200 ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం మున్సిపాలిటీలు, దేవాలయాలు అభివృద్ధి చేస్తుందని తెలిపారు. గత రెండేళ్లుగా ఆర్టీసీ బస్సు కొనలేదని మహిళా సంఘాలే 3200 బస్సులు ఆర్టీసీలో నడిపిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరిక మేరకు భూపాలపల్లి అభివృద్ధికి తనవంతు నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగాల పరంపర కొనసాగుతుందని, గ్రూప్ వన్, గ్రూప్ టూ ఉద్యోగాలు పొందిన అధికారులు ఈ వేదికపై ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,మెప్మా పిడి రాజేశ్వరి, డీఆర్డీవో పీడీ బాలకృష్ణ, ఆర్డీవో హరికృష్ణ, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో తరుణ్ ప్రసాద్, డీసీసీ అధ్యక్షులు బట్టు కర్ణాకర్, ఆర్టీఐ మెంబర్ రామచంద్రయ్య, నాయకులు దేవన్, బుర్ర కొమురయ్య, మధు, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, దాట్ల శ్రీనివాస్, సాంబమూర్తి, అనిల్, రవీందర్, తోట రంజిత్, వెంకీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కామ్రేడ్ బత్తిని యాకయ్యకు ఎర్రజెండాతో ఘన నివాళులు



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ బత్తిని యాకయ్య సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటుగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన భౌతిక దేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఏఐటియూసి వరంగల్ జిల్లా అధ్యక్షులు, సిపిఐ నెక్కొండ మండల కార్యదర్శి కామ్రేడ్ కందిక చెన్న కేశవులు విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి పదవుల ఆశ లేకుండా కమ్యూనిస్టు భావజాలాన్ని పునికి పుచ్చుకుని పేదలు, కూలీలు, రైతుల కోసం నిస్వార్థంగా సేవలందించిన గొప్ప విప్లవ యోధుడు బత్తిని యాకయ్య అని కొనియాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకంగా పాల్గొంటూ రైతు కూలీ సంఘాలను సంఘటితం చేసి నెక్కొండ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి పునాది వేసిన నేతగా ఆయన చిరస్మరణీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో బందారి కొమురయ్య, బండి ఐలయ్య, రాపాక కట్టయ్య, శ్రీనివాస్, కందిక సతీష్, ఈదునూరి రాజు, శివాజీ తదితరులు పాల్గొని ఆయన భౌతిక దేహంపై పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. బత్తిని యాకయ్యకు టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ హరిశెట్టి, సర్పంచ్ పెండ్యాల హరి ప్రసాద్‌లు కూడా నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జనగామ :** మహిళా సాధికారితకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది, రుణాలు చెల్లించడంలోనూ జనగామ జిల్లా ముందంజంలో ఉందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. సోమవారం ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మెప్మా ఆద్వర్యంలో వడ్డీ లేని రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఓం సాయి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రుణాలు తీసుకోవడం, ఆ రుణాలు చెల్లించడంలో జనగామ జిల్లా ముందంజలో ఉందన్నారు. కలెక్టర్ కృషితో జనగామ జిల్లాలో బతుకమ్మ కుంట అభివృద్ధి చెందిందని, ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. మహిళలు ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్యానరు. జనగామ మున్సిపాల్టీ పరిధిలో 354 సంఘాలకు కోటీ, 3లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరి కుటుంబం సంక్షేకోసం ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ గోపిరాం, మున్సిపల్ కమీషణర్ మహేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి: డిఎస్‌పి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డిఎస్‌పి తిరుపతిరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ, పోలీసులు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి తిరుపతి రావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటిస్తూ జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించాలని, వాహనాలను ఓవర్టేక్ చేయద్దని, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలంలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై డిఎస్‌పి అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మహేందర్‌రెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ ఎం.సాయి చరణ్, కళాశాల ప్రిన్సిపల్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత: ఎసిపి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని హన్మకొండ ఏసీపీ నర్సింహారావు అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారంలోని ఎస్‌వీఎస్ ఇన్స్టిట్యూట్ వద్ద కాకతీయ యూనివర్సిటీ పోలీసుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎరైవ్ ఎలైవ్ ప్రోగ్రాం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించారు. అందులో భాగంగా భీమారం ఎస్‌వీఎస్ ఇన్స్టిట్యూట్ వద్ద ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఏసీపీ నర్సింహారావు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు నివారించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. అనంతరం కేయూ సీఐ సుంకరి రవికుమార్ మాట్లాడుతూ.. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి మృతిచెందడం అంటే అతను మన మధ్య నుంచి వెళ్లిపోవడం కాదు ఒక కుటుంబం రోడ్డు మీద పడటం అని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు వారు వాహనాలు తనిఖీ చేసి ఫైన్ విధించినా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్న చాలా మంది వాహనదారులు మమ్మల్ని తిట్టుకుంటారు కాని వారు జాగ్రత్తగా గమ్యం చేరడం కోసం వారికి ఒక హెచ్చరిక లాగా ఉండాలని మేము చెకింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీ మెంబర్ అల్లకొండ సతీష్, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, డీటీఓ వేణు గోపాల్, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ: కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మహిళా సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పురపాలక సంఘాల్లో మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరెలు పంపిణీ అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామ కృష్ణారావు, సెర్ప్ సీఈఓ దివ్య, సిడిఎంఏ టికే శ్రీదేవి పాల్గొన్నారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇందిరమ్మ చీరెలు పంపిణీపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, డీఆర్‌డీఓ, మెప్మా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. 1 నుంచి 10వ వార్డుల వరకు పర్యవేక్షణకు ఏపీఎంలను నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మెప్మా పీడీ రాజేశ్వరి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి: బల్దియా కమిషనర్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 34, ఇంజనీరింగ్ 18, రెవెన్యూ 10, హెల్త్, శానిటేషన్ 6 నీటి సరఫరా మొత్తం 71 ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ప్రసన్నరాణి, సమ్మయ్య, టిఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మండే మెలిగే పండగ నుండి నిండు పండగ వరకూ...

**సిఎం పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు**
**మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/ములుగు:** మేడారంలోని హరిత హోటల్‌లో మంతి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. గద్దెల ప్రాంగణ ప్రారంభంతో ఒక గట్టం ముగిసింది. ఈ బుధవారం మండే మెలిగే పండగ ఉందని, మండే మెలిగే పండగ నుండి నిండు పండగ వరకు ఇదే రకంగా విజయవంతం చేయాలన్నారు. తల్లుల కీర్తిని ప్రపంచానికి చాటేలా కవరేజ్ చేసిన మీడియా సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. మేడారంలో క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన అధికారులందరికి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే క్యాబినెట్ సమావేశాన్ని అడవిలోకి తీసుకొచ్చి ఏర్పాట్లు చేశామని, కేవలం క్యాబినెట్ సమావేశమే కాదు రాత్రి సిఎం కుటుంబం, మంత్రుల కుటుంబాలు ఇక్కడ బస చేశాయన్నారు. రెండు రోజుల పాటు ఇక్కడ యావత్ క్యాబినెట్ ఉండడం, క్యాబినెట్ సమావేశాన్ని ఇక్కడే ఏర్పాటు చేసి పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రకటించడం ములుగుకు గర్వకారణమన్నారు. క్యాబినెట్ సమావేశాన్ని సక్సెస్ చేసిన అధికార యంత్రంగానికి అభినందనలు తెలిపారు. అటెండర్ నుండి చీఫ్ సెక్రటరీ వరకు హోంగార్డుల నుండి డిజెపి వరకు కష్టపడి పనిచేసి క్యాబినెట్ సమావేశాన్ని సిఎం పర్యటనను విజయవంతం చేసిన అందరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్క, సారలమ్మ కీర్తి స్ఫూర్తిని నింపుకొని మహిళలు ఎన్నో విజయాలు సాధించేందుకు సిఎంతో పాటుగా పెద్దయెత్తున మహిళలకు దర్శనాలు చేయించారు.

## మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**మహిళా సాధికారతకు**
**కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం**
**వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేసిన**
**ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారదా దేవి**



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు స్పష్టం చేస్తూ నేడు వర్ధన్నపేట పట్టణంలోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ) ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేయడంతో పాటు మహిళా సంఘాలకు 122 సంఘాలకు 28 లక్షల 84వేల 141 రూపాయల విలువ గల వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళ సంఘాలకు పంపిణీ చేశారు. తొలుత మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారద దేవికి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకునేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడం ద్వారా వారు చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా బలపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధీర్,మెప్మా ఏడీఎంసీ వహీదా, టౌన్ స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాలు అర్రెల్లి లక్ష్మి , సర్పంచ్లు చిటూరి రాజు, పఠాన్ రజాక్, ఎస్బీఐ బ్యాంక్ ప్రతినిధులు మరియు టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, సత్యనారాయణ, పట్టణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం

**ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్**



**ప్రజాపక్షం/వరంగల్ :** శ్రమ దోపిడీ కి వ్యతిరేకంగా ఉద్యమించాలని, కార్మికుల హక్కులను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వమని ఏఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ విమర్శించారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల వాల్ పోస్టర్‌ను ఈఎస్ఐ హాస్పిటల్ ల్లో సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ హాస్పిటల్ లో పనిచేస్తున్న యాక్టివిటీ కార్మికులకు ఎనిమిది నెలల వేతనము రాక కార్మికులు సతమాతమవుతున్నారు. ఎన్నిమార్లు అధికారుల దృష్టికి, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎక్కడి గొంగడి అక్కడే వేసిన చందంగా మారిందన్నారు. వరంగల్ జిల్లాలో అతి ప్రాముఖ్యమైన మేడారం జాతర జాతరకు వెళ్లాలంటే కార్మికులకు వేతనాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్టర్ కార్మికుల ఖాతాల్లో వేతనం వేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు ఆలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని, పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ హాస్పిటల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి సతీష్, దల చారి, రజిత, ప్రవీణ్, రాజేష్, మౌనిక, భవిత, రజిత , రేణుక, సుమలత, మహేష్, ఆనంద్, ఐలయ్య, స్వప్న, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**ప్రజాపక్షం/వరంగల్:** నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలను శ్రీరాముని వలె ఆదర్శంగా పరిపాలిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, మంచి పేరు సంపాదించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో జిల్లాలోని 11 మండలాలకు చెందిన నూతన సర్పంచుల కోసం నాలుగు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన మొదటి విడతలో భాగంగా గీసుకొండ, సంగెం, చెన్నారావుపేట మండలాలకు చెందిన 84 మంది సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశం అన్ని ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కల్పించి, గ్రామ పరిపాలనను ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో నేర్పించడమేనన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన, బాధ్యతాయుత పరిపాలన నిర్వహించాలన్నారు. గ్రామాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకొని నిరంతరం కృషి చేయాలని కోరారు. సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, విపత్తుల సమయంలో సర్పంచుల పాత్ర, డిజిటల్ సైన్ వినియోగం, ఆదర్శ గ్రామపంచాయతీల నిర్మాణం వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కుల వివక్ష, మూఢనమ్మకాల నిర్మూలనలో సర్పంచులదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, టీవోటీలు పాక శ్రీనివాస్, కూచన ప్రకాష్, చంద్రకాంత్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, సర్పంచ్ కూసం స్వరూప రమేష్, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

## దంతాలపల్లి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** దంతాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ మహబూబాబాద్ ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో రేపోని గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మిడతపల్లి మంగమ్మ ఫిర్యాదు చేయగా, వీరారం గ్రామానికి చెందిన గుండె అజిత్ నిందితుడిగా నమోదయ్యాడు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను కోర్టు పరిశీలించిన అనంతరం నిందితుడు నేరం చేసినట్లు రుజువవడంతో, సీఆర్‌పీసీ సెక్షన్ 235(2) ప్రకారం జీవిత ఖైదుతో పాటు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.30,000 జరిమానా విధించింది.ఈ కేసును ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.డి. అబ్దుల్ రఫీ విచారించారు. ప్రాసిక్యూషన్‌ను ఇన్‌చార్జ్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి వెంకటయ్య నడిపించారు. దంతాలపల్లి పోలీసుల సమిష్టి కృషితో నిందితుడికి శిక్ష ఖరారైందని జిల్లా ఎస్పీ డా. శబరీష్ పోలీస్ సిబ్బందిని .అభినందించారు

## అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో సోమారం మూడవ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల విద్య, ఆరోగ్య అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అంగన్ వాడీ కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులు, పోషకాహారం, విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, సీడీపీఓ కమలాదేవి, ఏసీడీపీఓలు విజయలక్ష్మి , సంకీర్తన, సూపర్‌వైజర్లు మల్లీశ్వరి, శ్రీదేవి, శోభ, ఉషరాణి, గౌసియా, నాగమణి, సునీత, విజయ, సరిత, ప్రమీల, ఆయా తదితరులు పాల్గొన్నారు.



## నిజాం నవాబు కట్టించిన వైరా రిజర్వాయర్ రైతులకు కల్పతరువు

మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/వైరా :** వైరా నియోజకవర్గ కేంద్రంలోని వైరా రిజర్వాయర్‌ను రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ ప్రాంతంలోని మిషన్ భగీరథ బోట్ పూడి సుజలస్రవంతి మంచినీటి పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నవాబులు కట్టించిన వైరా రిజర్వాయర్ రైతులకు కల్పతరువులాంటిదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్‌కు కృష్ణ, గోదావరి జలాలను అనుసంధానం చేయడంవలన సాగు నీరు, తాగునీరు అందించడంలో గ్రామీణప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు గోదావరి జలాలు సాగునీటి వినియోగంలో వాటాల వద్ద ఘర్షణలు లేకుండా వృథాగా పోతున్న నీటిని లిఫ్ట్ ఇరిగేషన్‌ల ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టి రైతులకు ఉపయోగపడేవిధంగా కృషిచేయాలని పేర్కొన్నారు. నిరుపేదలకు సంస్థ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు గోదావరి జలాలను నినియోగించుకునేందుకు కృషిచేయాలని అన్నారు. ఆయన వెంట టియుడబ్ల్యూజె ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర నాయకులు మాటేటి వేణుగోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మద్యంపై మారని ప్రభుత్వ తీరు

సిపిఐ నాయకుడు కె.నారాయణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా చూస్తూ ప్రజలను దోచుకుంటున్నారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా॥ కె.నారాయణ తెలిపారు. సోమవారం ఖమ్మంలో వైన్ షాపులను ఆయన సందర్శించారు. ప్రభుత్వాలు మారిన లిక్కర్ పాలసీలో మాత్రం మార్పులు రావడం లేదన్నారు. గత ప్రభుత్వాల కంటే లిక్కర్ ద్వారా ప్రస్తుత ప్రభుత్వాలు మరింత ఆదాయాన్ని సంపాదించాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన బెల్టుషాపులను ఎత్తివేస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీని మరిచిపోయారని నారాయణ తెలిపారు. రూ.లక్ష డిపాజిట్ సొమ్మును ఈ ప్రభుత్వం పెంచిందని బెల్ట్ షాపులను కూడా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బార్ షాపుల వద్ద మద్యం వ్యాపారాలను పెంచుకునేందుకు ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని మద్యం దుకాణాల పక్కనే బార్లను తలపించే రీతిలో సిట్టింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకునే పద్ధతిని ప్రభుత్వాలు విడనాడాలని నారాయణ డిమాండ్ చేశారు. మద్యాన్ని కూడా అధిక ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియులను దోచుకుంటున్నారన్నారు. మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యాన్ని బెల్ట్ షాపుల్లో ఉంచి ఎంఆర్‌పి కంటే అధిక ధరలు విక్రయిస్తున్నారని ఒక్కో బాటిల్‌పై రూ.25ల నుంచి రూ.50ల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నారాయణ వెంట సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, రావి శివరామకృష్ణ, సిపిఐ నాయకులు మడుపల్లి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పదో తరగతి విద్యార్థులకు వంకాయలపాటి రంగయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీని చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని కోయచలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వంకాయలపాటి రంగయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు వంకాయలపాటి కిరణ్ రమాదేవి ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీని ప్రారంభించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేయనున్నారు. విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసినందుకు హెచ్ఎం శిరీష వంకాయలపాటి కిరణ్ రమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శిరీష, ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, రేగులచలక కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు యండపల్లి వెంకటేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1 నుండి ఓపెన్ ఆక్షన్ క్రికెట్ టోర్నీ



టోర్నీ బ్రోచర్, ట్రోఫీని ఆవిష్కరించిన డిఎస్పీ

**ప్రజాపక్షం/మణుగూరు:** లక్ష్మీ మెమోరియల్ సీజన్ 2, ఓపెన్ ఆక్షన్ క్రికెట్ టోర్నీ వచ్చే నెల ఒకటో తేదీ నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో టోర్నీ బ్రోచర్, ట్రోఫీని సోమవారం మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని తద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఎటువంటి వివాదాలకు తావు ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో టోర్నీలు నిర్వహించుకోవాలని కోరారు. మణుగూరు నేతాజీ క్రీడా మైదానంలో రెండోసారి వరుసగా జరిగే లక్ష్మీ ప్రీమియర్ లీగ్ టోర్నీ క్రీడా కారుల ఆక్షన్ ఈ నెల 26న ఉంటాయని టోర్నీలో ఆడే క్రీడాకారులు రూ.150లు చెల్లించి వారు వేలంలో పాల్గొంటారన్నారు నిర్వాహకులు ఉమామహేశ్వరరావు, శశి కుమార్, నాగరాజులు తెలిపారు. ప్రస్తుతం నుండి పదహారు మాత్రమే ఫ్రాంచేసీలు ఉంటాయన్నారు. విన్నర్స్‌కి ట్రోఫీతో పాటు రూ.30వేలు, రన్నర్స్‌కి ట్రోఫీతో పాటు రూ.20 వేల నగదు అందించనున్నామన్నారు. పూర్తి వివరాలకు 9949100250, 8866997333, 9505333271నెంబర్లను సంప్రదించాలని ఉమ కోరారు. బ్రోచర్, ట్రోఫీ ఆవిష్కరణలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పెండెం వెంకట్, కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వస్సం కృష్ణ మోహన్, సీనియర్ జర్నలిస్ట్ పోసాని కృష్ణలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం

1.98 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు ప్రణాళికలు
వ్యవసాయ రంగానికి రూ.74.163 కోట్ల ఖర్చు
అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/చింతకాని:** ప్రజాపాలనలో రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వందనం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.35.75 కోట్లతో కోదుమూరు, వందనం ఎత్తిపోతల పథకం రెండవ విడత పనులకు, ఎస్సి కాలనీలో రూ.1.85 కోట్లతో అంతర్గత సిసి రోడ్డు పనులకు, ఆర్అండ్‌బి రోడ్డు నుంచి వందనం, పుట్టకోట జెడ్పి రోడ్డు వరకు రూ.3.50 కోట్లతో చేపట్టనున్న బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కోదుమూరు వందనం లిఫ్ట్‌కు సంబంధించి 2013లో మొదటి విడత పనులు పూర్తి చేసి 2,500 ఎకరాలకు సాగునీటిని అందించామన్నారు. చింతకాని మండలం చుట్టూ నాగార్జున సాగర్ నీళ్లు ఉన్నప్పటికీ కోదుమూరు వందనం రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడ్డారని 2009లో ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడత లిఫ్ట్ పూర్తి చేశామన్నారు. ఆ లిఫ్ట్ కారణంగా ఎండాకాలంలో కూడా నీరు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో 2500 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు రెండవ విడతకు శ్రీకారం చుట్టామన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్రలో ప్రతి గ్రామంలో ప్రజలు ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారని గమనించి అధికారంలోకి రాగానే 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను రూ.22,500 కోట్లతో మంజూరు చేశామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న లబ్దిదారులకు ప్రతి వారం బిల్లులు చెల్లిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాలో 2.79 లక్షల ఎకరాల ఆయకట్టు ఉమ్మడి రాష్ట్రంలో కల్పించామన్నారు. ప్రజా ప్రభుత్వం నేడు మరో 1.98 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు సాధించేందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, సన్న రకానికి రూ. 500 బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు బీమా కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు రూ.74,163 కోట్లు వ్యవసాయ రంగానికి ఖర్చు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు, పించన్లు, వడ్డీ లేని రుణాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహ జ్యోతి, సన్నబియ్యం వంటి వివిధ సంక్షేమ పథకాలకు రూ.47,710 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులు చదువుకోవాలని 100 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశామన్నారు. మధిర అసెంబ్లీ ఐదు మండలాల పరిధిలో కట్టలేరు, మున్నేరు, వైరా నది జలాలు వృథాగా పోకుండా ఆనకట్టలు కట్టిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఇరిగేషన్ ఇఎన్‌సి రమేష్, ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఏఎంసి ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, లిఫ్ట్ ఛైర్మన్ కొల్లి గోవిందరావు, కాంగ్రెస్ నాయకులు కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, సర్పంచులు కిలారు మనోహర్‌బాబు, దూసరి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



## వంద పడకల ఆసుపత్రి ప్రారంభం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి : డిప్యూటీ సిఎం

**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలో రూ.34కోట్లతో నిర్మించిన మధిర ఏరియా ఆసుపత్రిని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన మధిరలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇక్కడి ప్రజల సౌకర్యార్థం 100పడకల ఆసుపత్రిని నిర్మించటం జరిగిందని, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదేవిధంగా వంద పడకల ఆసుపత్రిలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిని కూడా భట్టి ప్రారంభించారు. అనంతరం స్థానిక రెడ్డి గార్డెన్‌లో శ్రీశక్తి, డ్వాక్రా గ్రూపు మహిళతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసచారి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లు బాధ్యతగా పనిచేయాలి

సర్పంచ్‌ల శిక్షణా తరగతుల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పదవిని ఒక హోదాగా కాకుండా బాధ్యతగా తీసుకుని ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం నగరంలోని టిటిడిసి సమావేశ మందిరంలో జిల్లాలో నూతనంగా గెలుపొందిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు సోమవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీజతోకలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని గ్రామ పాలనలో సర్పంచ్‌ల పాత్ర, బాధ్యతలు అందించాల్సిన సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల మన్ననలు పొంది సర్పంచ్‌లుగా ఎన్నికైన సందర్భంగా ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత పోటా పోటీగా జరిగిన ఎన్నికల్లో ఎదుర్కొని గెలవడం గొప్ప బాధ్యతను తెచ్చిపెడుతుందన్నారు. గ్రామ పంచాయతీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సర్పంచ్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, శిక్షణా తరగతుల పర్యవేక్షకురాలు విద్యాలత, సంబంధిత శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆవరణలో ఏడిఏ తాతారావు అధ్యక్షతన ప్రభుత్వం రైతుల సంక్షేమం అభివృద్ధి కొరకు వివిధ రకాల యంత్రాల పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణలో మంజూరైన 94 వివిధ రకాల యంత్ర పరికరాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేసి, రైతులకు వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేశారని గుర్తు చేశారు. మరల 12 సంవత్సరాల తరువాత తిరిగి ఈ పథకాన్ని పునఃప్రారంభించామని, అందులో భాగంగా బూర్గంపాడు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వరి స్ట్రాబెలర్ట్, రోటవేటర్, కల్టివేటర్, 2ఎంపి ప్రోవ్స్, పవర్ టిల్లర్స్, పవర్ స్ప్రేయర్, బ్రష్ కట్టర్, వివిధ రకాల పరికరాలను అందించడం జరిగిందన్నారు. ఈ యంత్రాల వలన శ్రమ తగ్గి, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పంటలు పండించి ఎక్కువ ఆదాయం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జములారెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధికారి ఆర్ శంకర్, సొసైటీ మాజీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు మహిమద్ ఖాన్, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, కాంగ్రెస్ నాయకులు భజన ప్రసాద్ కుమార్, శనగ కిషోర్, కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ఇంగు రమేష్,ఏఈవోలు శృతి, నాగవైష్ణవి, పవన్ కుమార్, రైతులు గాదె నర్సిరెడ్డి, కైపు సుబ్బిరామిరెడ్డి, భజన నాగం, బత్తిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత: సిఐ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకున్నప్పుడే ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలంలో అరైవ్ అలైవ్ అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణ నష్టాన్ని తగ్గించి ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యం చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే ఎక్కువ ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం, హెల్మెట్, సీటు బెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు శిక్షలతో పాటు అవగాహన అత్యంత అవసరమని భావించి అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. పది రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణాలు, గ్రామాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలిసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు భద్రతపై యువతలో చైతన్యం వస్తే సమాజం మారుతుందన్నారు.

# పశువుల అక్రమ రవాణాదారులు అరెస్ట్



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గల అన్నపురెడ్డిపల్లి గ్రామం వెంకటాపురం క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో 6లేగ ఆవు దూడలను అక్రమంగా రవాణా చేస్తూ కబేళాలకు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అన్నపురెడ్డిపల్లి పోలీసులు అరెస్టు చేవారు. వారి వద్ద నుండి ఒక అశోక్ లైల్యాండ్ మినీ ట్రక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ విజయసింహారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఇద్దరు వ్యక్తులు అన్నపురెడ్డిపల్లి మండలంలోని పరిసర గ్రామాలలో రైతుల వద్ద నుండి లేగ ఆవు దూడలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరువూరు సంత ద్వారా హైదరాబాద్‌లోని కబేళాలకు సంబంధించిన వ్యాపారులకు అధిక ధరలకు విక్రయించేందుకు ఆశోక్ లైల్యాండ్ మినీ ట్రక్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందని ఈ నేపథ్యంలో వెంకటాపురం క్రాస్ రోడ్ వల్ల వాహనాన్ని అడ్డగింఇచ, ఇద్దరు వ్యక్తులను, వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎవరైనా పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## మృతుని కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గత ఎనిమిదేళ్లుగా సమాజ సేవ చేస్తూ గ్రామాల్లో ఎవరైనా నిరుపేదలు మరణిస్తే వారి కుటుంబానికి చేయూతనందిస్తున్నారు చిమ్మపుడి గ్రామానికి చెందిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు. చిమ్మపుడి గ్రామంలో ఇటీవల మృతిచెందిన దంతాల బాబు కుటుంబాన్ని సోమవారం గుత్తా వెంకటేశ్వర్లు పరామర్శించి సానుభూతి తెలిపారు. 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. గుత్తా వెంకటేశ్వర్లు అందిస్తున్న సేవల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, దేశగాని నర్సయ్య, దంతాల వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు కాళంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, రాచర్ల రామ్మూర్తి, దొంతు సత్యనారాయణ, యర్రా వెంకటరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువులు పంపిణీ




**ప్రజాపక్షం/తల్లాడ :** సన్‌రైజ్ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నారాయణపురం 3 అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన వస్తు సామగ్రిని పంపిణీ చేశారు. సోమవారం సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు సామినేని మురారి మనవరాలు కుంచేటి తనుశ్రీప్రియ పుట్టిన రోజు సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన రూ. 20వేల విలువ గల బేబీ చైర్స్, గర్భిణీలకు, బాలింతలకు కుర్చీలు, వాటర్ క్యాన్స్, కుక్కర్, వంటి మొదలగు సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో ఏనుగు సురేష్‌బాబు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ వస్తువులు చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంఈవో దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని సంస్థ బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్, ఏనుగు కిరణ్‌బాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జనవరి 26 నాడు కలెక్టర్ సందేశం తయారీ నిమిత్తం ప్రతిశాఖ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా అందించాలన్నారు. ఏన్కూరు మండలానికి చెందిన మంగీలాల్ ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ నియమాలకు వ్యతిరేకంగా నడుస్తుందని దానిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు సమర్పించారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వడోదరలో డబ్ల్యుపిఎల్..

# గుజరాత్ జట్టులో అనుష్క శర్మ!

వడోదరలో మహిళల ప్రీమియర్ లీగ్ సందడి మొదలైంది. ఆరంభ పోరు నుంచి నవీ ముంబైలో అభిమానులను అలరించిన డబ్ల్యుపిఎల్‌కు కొటాంబిలోని బిసిఎ స్టేడియంలో ఉత్కంఠ పోరాటాలకు వేదిక కానుంది. ఈ మైదానంలో తొలి పోరులో వరుసగా నాలుగు విజయాలతో దూసుకెళ్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్ తలపడుతున్నాయి. తగ్గపోరు ఖాయమనిపిస్తున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అష్లీ గార్డ్నర్ బౌలింగ్ తీసుకుంది. ప్రస్తుతం ఆర్‌సిబి 8 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. గుజరాత్ జట్టు మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇరుజట్లలోనే మ్యాచ్ విన్నర్లు ఉండడంతో ఈసారి పైచేయి ఎవరిదో? అని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గత మ్యాచ్‌లో శ్రేయాంక పాటిల్(523) విజృంభణతో చతికిలపడిన గుజరాత్ ఈసారి ప్రతీకారానికి సిద్ధమవుతోంది. ఇక్కడ గెలిస్తే గార్డ్నర్ బృందం ఆరు పాయింట్లతో రెండో స్థానం దక్కించుకుంటుంది. గాయం కారణంగా రెండు మ్యాచ్‌లకు దూరమైన అనుష్క శర్మ గుజరాత్ తుది జట్టులోకి వచ్చింది. గెలుపు జోరుమీదున్న ఆర్‌సిబి ఏ మార్పులు లేకుండా బరిలోకి దిగుతోంది.

**గుజరాత్ తుది జట్టు :** బేత్ మూనీ(వికెట్ కీపర్), సోఫీ డెవినె, అనుష్కా శర్మ, అష్లే గార్డ్నర్(కెప్టెన్), జార్జియా వరేహం, కనికా ఆహుజా, భారతి ఫుల్మాలి, కష్వీ గౌతమ్, తనూజ కన్వర్, హ్యాపీ కుమారి, రేణుకా సింగ్.

**ఆర్‌సిబి తుది జట్టు :** గ్రేస్ హ్యారిస్, స్మృతి మంధాన(కెప్టెన్), జార్జియా వోల్, గౌతమీ నాయక్, రీచా ఘోష్(వికెట్ కీపర్), రాధా యాదవ్, నడినే డీక్లెర్క్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, లిన్సే స్మిత్, లారెన్ బెల్.



## వన్డే సిరీస్ ఓటమితో

# గిల్ కీలక నిర్ణయం..

## మళ్లీ దేశవాళీ క్రికెట్‌కు సై!



టెస్టు, వన్డే సారథిగా పట్టాభిషేకం తర్వాత శుభమన్‌గిల్‌కు గడ్డుకాలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో సెంచరీలు మినహాయిస్తే వన్డే, టీ20ల్లో పేలవ ప్రదర్శనతో జట్టు ఓటమికి బాధ్యుడవుతున్నాడు గిల్. ఇండోర్ వన్డేలోనైనా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతాడనుకుంటే 23 పరుగులకే వికెట్ పారేసుకున్నాడు. దాంతో.. మళ్లీ ఫామ్‌లోకి రావడం కోసం కీలక నిర్ణయం తీసుకున్నాడు గిల్. ఇటీవల నాయకుడిగా తేలిపోతున్న అతడు దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో మెడ గాయంతో బ్రేక్ తీసుకున్న శుభమన్‌గిల్.. పునరాగమనం తర్వాత నిరాశపరుస్తున్నాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల్లో అతడు ఒక్కటంటే ఒక్క అర్ధశతకం కాదుకదా జట్టును గెలిపించే పెద్ద ఇన్నింగ్స్ ఆడలేదు. నిర్ణయాత్మక మూడో వన్డేలోనూ 23 పరుగులకే జేమీసన్ ఓవర్లో బౌల్డయ్యాడు. దాంతో, మరోసారి 'ఇప్పుడే గిల్‌కు వన్డే కెప్టెన్సీ అవసరమా? కేఎల్ రాహుల్ ఉన్నాడుగా? 'అనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫామ్‌తో మళ్లీ మునుపటి గిల్‌ను తలపించాలని అతడు.. కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్న భారత కెప్టెన్ ఇండోర్ నుంచి సోమవారం ఉదయమే ఢిల్లీ చేరుకున్నాడు. అక్కడి నుంచి రాజ్‌కోట్ వెళ్లనున్నాడు. అక్కడ జనవరి 22న స్వరాష్ట్రతో మ్యాచ్‌లో పంజాబ్ తరఫున గిల్ ఆడనున్నాడు. ఈ విషయాన్ని పంజాబ్ క్రికెట్ సంఘం ధ్రువీకరించింది. 'రంజీ ట్రోఫీలో శుభమన్‌గిల్ ఆడడంపై స్పష్టత వచ్చింది. సౌరాష్ట్ర మ్యాచ్లో అతడు బరిలోకి దిగనున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడడం కోసం భారత కెప్టెన్ 8 గంటలు విమాన ప్రయాణం చేయనున్నాడు. అంకితభావమంటే అది' అని పీసీఏ తెలిపింది. రంజీ ట్రోఫీలో పంజాబ్ జట్టు ఎలైట్ గ్రూప్ బీలో ఉంది.

## కొబ్బరి బోండంపై

# రోహిత్ బొమ్మ..

## అభిమాని ప్రతిభకు హ్యాట్సాఫ్..!

భారత జట్టు విధ్వంసక ఓపెనర్ రోహిత్ శర్మకు అభిమానగణం ఎక్కువే. తనమార్క్ షాట్లతో అలరించే హిట్‌మ్యాన్ భారీసిక్సర్లు, ఫుల్షాట్లు కొడుతుంటే స్టేడియం దద్దరిల్లిపోవాల్సిందే. వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ మాజీ సారథిపై తనకున్న అభిమానాన్ని ఒక యువకుడు వినూత్నంగా చాటుకున్నాడు. ఏకంగా కొబ్బరి బోండంపై టీమిండియా స్టార్ బొమ్మను చాలా నేర్పుగా చెక్కాడు. ప్రస్తుతం 'కోకోనట్ రోహిత్' వీడియో నెట్టింట వైరలవుతోంది. అభిమాన క్రికెటర్లపై ప్రేమను ఒక్కొక్కరు ఒక్కోవిధంగా వ్యక్తం చేస్తుంటారు. గతంలో ఒక కుర్రాడు క్యూబిక్ రూబ్స్ పేసర్ మహమ్మద్ షమీ బొమ్మకు రూపమిచ్చాడు. ఇప్పుడు రోహిత్ శర్మ అభిమాని ఒకరు కొబ్బరి బోండం పై తన కళా ప్రావీణ్యాన్ని చూపించాడు. పొడవాటి కొబ్బరి బోండం పైభాగాన్ని హిట్‌మ్యాన్ రూపం వచ్చేలా తొలిచాడు. చిన్న కత్తితో అతడు ఎంతో నేర్పుగా.. రోహిత్ చిత్రాన్ని ఆవిష్కరించాడు. తలపై టోపీగా కొబ్బరి బోండం భాగాన్నే మలిచిన తీరు అభిమానులను అబ్బుర పరుస్తోంది. సెల్ఫెస్ అనే ఎక్స్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. కోకోనట్ రోహిత్ అపురూపమైన చిత్రాన్ని చూసిన వారంతా ఈ కుర్రాడి ప్రతిభను కొనియాడుతున్నారు.





## యువతరంగం


### ఇంజనీరింగ్ డిగ్రీలతో

# ఉద్యోగం సాధ్యమా?



ఒకప్పుడు భారతదేశంలో ఇంజనీరింగ్ అంటే భవిష్యత్తుకు గ్యారంటీగా భావించేవారు. నాలుగేళ్లు కష్టపడి చదివితే ఉద్యోగం, గౌరవం, స్థిరమైన జీవితం సిద్ధమనే నమ్మకం ప్రతి ఇంట్లో ఉండేది. కానీ నేడు ఆ కల మసకబారుతోంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి డిగ్రీలు తీసుకున్నా, లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. డిగ్రీ ఉంది, కానీ నైపుణ్యాలు లేవు అనే పరిశ్రమల వ్యాఖ్య నేటి ఇంజనీరింగ్ విద్యార్థి ఎదుర్కొంటున్న కఠిన వాస్తవం. అధికారిక గణాంకాలు కూడా ఈచేదునిజాన్ని బలపరుస్తున్నాయి. ఇంజనీరింగ్ చదివిన వారిలో కేవలం సుమారు 40 శాతం మందికే వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు దొరుకుతున్నాయి. కొన్ని అధ్యయ నాలు అయితే దాదాపు 80శాతం మంది గ్రాడ్యుయేట్లు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు లేకుండా బయటకు వస్తున్నారని చెబుతున్నాయి. అంటే కాలేజీల్లో నేర్పుతున్న విద్యకు, బయట ప్రపంచానికి అవసరమైన సామర్థ్యాలకు మధ్య భారీ అంతరం ఉంది. ఈ సమస్యకు ప్రధానకారణం మన సిలబస్ కాలం చెల్లిపోవడమే. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి విప్లవాత్మక రంగాలవైపు దూసుకుపోతుంటే, మన విద్యావ్యవస్థ మాత్రం ఇంకా పాత సిద్ధాంతాల చుట్టూ తిరుగుతోంది. కానీ ఇది కేవలం సిలబస్ సమస్య మాత్రమే కాదు. వ్యవస్థలో పాతుకు పోయిన లోపాలే ఈ సంక్షోభానికి మూలం. చాలా కాలేజీల్లో అధ్యాపకులకు పరిశ్రమ అనుభవం తక్కువ. ఫలితంగా వారు సిద్ధాంతాలను మాత్రమే బోధిస్తారు, కానీ నిజజీవిత సమస్యలను ఎలా పరిష్కరించాలో విద్యార్థులకు నేర్పలేరు. పరిశ్రమలతో విద్యాసంస్థలకు సరైన అనుసంధానం లేదు. ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశ్రమ నిపుణులతో పరస్పర చర్చలు చాలాఅరుదు. అంతేకాదు, చాలా కళాశాలల్లో ల్యాబ్‌లు, సాఫ్ట్‌వేర్‌లు పాతబడ్డవే. ఆధునిక సాంకేతికతను అనుభవించే అవకాశమే విద్యార్థులకు ఉండడం లేదు. ఈస్థితి మారాలంటే సమగ్ర సంస్కరణలు అవసరం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను నిరంతరం నవీకరించాలి. బట్టీ పట్టే పరీక్షల బదులు ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, కేస్ స్టడీలపై దృష్టి పెట్టాలి. అధ్యాపకులు పరిశ్రమల్లో కొంతకాలం పనిచేసేలా ప్రోత్సహించాలి, అలాగే పరిశ్రమ నిపుణులను తరగతుల్లోకి తీసుకురావాలి. విద్యార్థులకు నిజమైన ఇంటర్న్‌షిప్‌లు, వాస్తవ సమస్యలపై పనిచేసే అవకాశాలు కల్పించాలి. మార్పులు చేయకపోతే ఇంజనీరింగ్ డిగ్రీలు ఉద్యోగాల తాళాలు కాకుండా నిరుద్యోగానికి సర్టిఫికెట్లుగా మారిపోతాయి. ఇది యువత భవిష్యత్తుకు మాత్రమే కాదు, దేశ ఆర్థిక భవిష్యత్తుకూ ముప్పు. విద్యా వ్యవస్థ, పరిశ్రమ, ప్రభుత్వం కలిసి వెంటనే సంస్కరణలకు అడుగులు వేయాలి. ఇది హెచ్చరిక మాత్రమే కాదు మన యువత భవిష్యత్తును రక్షించుకునే చివరి అవకాశం.

# గ్రామీణ ఉపాధికి గొడ్డలిపెట్టు!



అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ 2005లో, తన తొలి హయాంలో అమలులోకివచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) భారత సంక్షేమ విధానంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 41ఆధారంగా రూపుదిద్దుకున్న ఈచట్టం, ఉపాధిని ప్రభుత్వ కృపపై ఆధారపడి ఉన్న పథకంగా కాకుండా, పౌరుల హక్కుగా గుర్తించింది. విస్తృతప్రజా చర్చలు, పార్లమెంట్ ఏకగ్రీవ ఆమోదంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక భద్రతా పథకంగా ఎదిగింది. ఈ పథకం పేరు మార్చడమేగాక, చట్టాన్ని రద్దుచేసి, కొత్తచట్టాన్ని తీసుకురావడం గ్రామీణ ఉపాధికి గొడ్డలిపెట్టు. ప్రారంభంలో ఎంజిఎన్ఆర్ఇజిఎ డిమాండ్ ఆధారిత ఉపాధి హామీగా పనిచేసింది. గ్రామీణ కుటుంబం పని కోరితే ప్రభుత్వం ఇవ్వాల్సిన చట్టబద్ధ బాధ్యత ఉండేది. దీని వల్ల భూమిలేని కూలీలకు చర్చా శక్తి పెరిగి, వ్యవసాయ వేతనాలు మెరుగుపడ్డాయి. గ్రామసభల ఆధ్వర్యంలో ప్రణాళిక, అమలు, సామాజిక తనిఖీలు జరగడం ద్వారా స్థానిక స్వయంపాలన బలోపేతమైంది. వలసలు తగ్గాయి, వేతన భద్రత పెరిగింది. ఇప్పటికీ పనికిఉన్న డిమాండ్ ఈ పథకం అవసరాన్ని స్పష్టంగా చూపుతోంది. కానీ దశలవారీగా ఈ హామీని ఖాళీ చేస్తున్న విధానం అమలులోకి వచ్చింది. ముఖ్యంగా డిమాండ్ ఆధారిత, పరిమితిలేని నిధుల స్థానంలో ముందుగా నిర్ణయించిన బడ్జెట్ కేటాయింపులు రావడంతో ఉపాధిహక్కు నిర్వీర్యమైంది. రాష్ట్ర స్థాయిలో పని దినాలకు పరిమితి విధించబడింది. వ్యయ భారం 90:10నుంచి 60:40కి మారడంతో రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడిపెరిగింది. కేంద్రం కేటాయింపులు మించితే మొత్తం భారం రాష్ట్రాలదే కావడంతో అనేక రాష్ట్రాలు ఉపాధి కల్పించడంలో వెనకడుగు వేస్తున్నాయి. వ్యవసాయ కాలంలో 60 'నోవర్క్ డేస్' విధించడం కూలీల భద్రతను మరింత దెబ్బతీసింది. గ్రామసభల ఆధ్వర్యంలో ఉన్న వికేంద్రీకృత వ్యవస్థ స్థానంలో పిఎం గతి శక్తి వంటి కేంద్రకృత నమూనాలు రావడం ద్వారా ఫెడరలిజం, ప్రజాస్వామ్య పాల్గొనడం బలహీనమయ్యాయి. ఎంజిఎన్ఆర్ఇజిఎ బలహీనత భారతదేశ హక్కుల ఆధారిత సంక్షేమ వ్యవస్థపై జరుగుతున్న విస్తృత దాడిలో భాగమే. సమాచార హక్కు, భూసేకరణ, అటవీ హక్కులు, విద్యహక్కు వంటి రంగాల్లోనూ ఇదేధోరణి కనిపిస్తోంది. ఉపాధిహక్కు క్షీణించడం రాజ్యాంగ సంకల్పానికి విరుద్ధమైన మార్పుగా మారింది. సర్వోదయ భావనకు ప్రతీక అయిన ఈచట్టం నిర్వీర్యం కావడం నైతికంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన వైఫల్యమే. ఎంజిఎన్ఆర్ఇజిఎ రక్షణఅంటే భారతప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, గౌరవప్రదమైన జీవన హక్కును కాపాడటమే.

## సింగరేణి భవిష్యత్తుపై రాజీ లేదు

### ఎఐటియుసి అనుబంధ సింగరేణి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల మూలాన ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని, దీన్ని అడ్డుకునేందుకు దశలవారీ పోరాటం చేస్తామని ఎఐటియుసి అనుబంధ సింగరేణి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజకుమార్ తెలిపారు. ఎఐటియుసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు తలమానికంగా ఉన్న సింగరేణిని పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పాలకుల పనితీరు అధికారుల నిర్లక్ష్యం మూలాన నూతన భూగర్భంలో ఏర్పాటు ఓసీలకు అనుమతులు రావడం ఆలస్యం అవుతుందన్నారు. సింగరేణి భవిష్యత్తుపై రాజీపడేది లేదన్నారు. బొగ్గు గనులకు పుట్టినిల్లు అయిన ఇల్లందుని కాపాడుకునేందుకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కొయ్యగూడెం పూసపల్లి ఒసిలను ఏర్పాటు చేసి ఇక్కడ యువతకు ఉపాధి కల్పించేందుకు మినీ థర్మల్ పవర్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, నజీర్ అహ్మద్, దాసరి రాజారాం, బొప్పిశెట్టి సత్యనారాయణ, గడదాసు నాగేశ్వరరావు, కొరిమి సుందర్, బానోత్ బాలాజీ, గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు, దాట్ల శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ వినతి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కార్మికులకు గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్‌లో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ గ్రిడ్ డివిజనల్ ఇంజనీర్ ఇర్ఫాన్ ఎల్ అండ్ టి ఇంజనీర్ దేవ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాల విషయమై ఎల్‌అండ్‌టి యాజమాన్యాన్ని అనేకసార్లు కోరినప్పటికీ రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వేతనాలు అందక పండుగ పూట కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు దివాకర్, జిల్లా కన్వీనర్ బాలేష్, శ్రీకాంత్, వెంకటేష్, సాగర్, కుమార్, వేణు, దిలీప్, పురుషోత్తం, రవీందర్, నాగబాబు, భీం రావు, జంగు తుకారం, భాస్కర్ పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు

### గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** స్వాతంత్ర సమరయోధుడు, సూర్యాపేట తొలి శాసనసభ్యుడిగా, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు నామకరణం చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన గౌడ కులాలకు చెందిన ప్రజలను గీతవృత్తిలో జీవిస్తున్నారని ఆనాటి నుండి అటు ఆంధ్ర ప్రాంతం ఇటు తెలంగాణ, రాయలసీమలోని గీత పనివారలను సమీకరించి కల్లుగీత వృత్తిలో కాంట్రాక్టు హర్రాజు విధానానికి వ్యతిరేకంగా ధర్మభిక్షం నేతృత్వంలో పోరాటం జరిగిందన్నారు. కల్లు సొసైటీలు కావాలని వివిధ పన్నుల విధానం రద్దు చేయాలని, వన పెంపకానికి భూమి, వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్య ఫెన్షన్ ఇవ్వాలని ఆనాటి ప్రభుత్వాల మీద ధర్మభిక్షం పోరాటాలు చేసి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. సూర్యాపేట పట్టణంలో తొలి హాస్టల్ నిర్మించి విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పి చైతన్యవంతులను చేసి అనేక రంగాలలో తీర్చిదిద్దిన మహానాయకుడన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, తాగు, సాగు నీరు గురించి అనేక పోరాటాలు నిర్వహించి సాధించిన మహానాయకుడని కొనియాడారు. సూర్యాపేట జిల్లాకు ప్రభుత్వం వెంటనే స్పందించి వారి పేరును పెట్టి వారి శతజయంతిని, వర్ధంతిని, కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన కోరారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ధర్మభిక్షం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, కరుణాదేవి, చామల అశోక్ కుమార్, దంతాల రాంబాబు, అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, నీలా శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, ఎండి.పాషా, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నుంచి 4 వేల మందితో

# కదంతొక్కిన సిపిఐ శ్రేణులు

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఖమ్మంలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభకు మహబూబాబాద్ నుండి 4,000 మంది 40 వాహనాలు, ట్రైన్‌ల ద్వారా, బస్సుల ద్వారా తరలివెళ్లి విజయవంతం చేసిన సిపిఐ కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, సాను భూతిపరులకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి ధన్యవాదాలు తెలియజేశారు. ఖమ్మం సిపిఐ సభ విజయవంతం కావడం పట్ల మానుకోట నుంచి తరలివచ్చిన కార్యకర్తలు అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు లేకపోతే ప్రజలకు నష్టం జరుగుతుందని, కమ్యూనిస్టుల పోరాటాలు భవిష్యత్తు తరాలకు అవసరమన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి, చింతకుంట్ల వెంకన్న, ఎండి మహమూద్, గారే రవి చంద్రబోస్, తండా శ్రీనాథ్ కూరాకుల పాల్, దార వీరన్న మెతుకు శ్రీకాంత్, ఎండి రఫీ, గాదే శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



## స్ఫూర్తి నింపిన

# సిపిఐ వందేళ్ళ ఉత్సవాల సభ

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఖమ్మంలో జరిగిన సిపిఐ వందేళ్ళ ఉత్సవాల భారీప్రదర్శన, బహిరంగసభ స్ఫూర్తి నింపిందని, ఆ స్ఫూర్తితో మరిన్ని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ ఖమ్మం గుమ్మంలో జరిగిన సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల బహిరంగ సభ జన సేవాదళ్ కవాతులో సైతం హనుమకొండ జిల్లా నుండి వందలాదిమంది యువ కమ్యూనిస్టు కార్యకర్తలు, జిల్లాలోని ఆయా మండలాలు, ప్రాంతాల నుండి బస్సులు, ఇతర వాహనాల ద్వారా 5 వేల మంది తరలి వెళ్లి ఖమ్మం సభలో పాల్గొన్నారని తెలిపారు. వందేళ్ళ ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజానీకానికి సిపిఐ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ 100 సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తుందని, వెట్టిచాకిరి విముక్తి కొరకు కార్మిక కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహిస్తుందని తెలిపారు. పేదల సమస్యలు, ముఖ్యంగా ఇండ్లు ఇండ్ల స్థలాలు, సాగు భూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న పార్టీ సిపిఐ అని బిక్షపతి అన్నారు.

## పేదరిక నిర్మూలనలో

# మహిళల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కుల అందజేత




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదరిక నిర్మూళనలో మహిళల పాత్ర కీలమని, మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడే సమాజం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని, పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి వైపునకు అడుగులేస్తాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు చెందిన డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం 864 పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.2,88,35,377ల విలువైన మెగా చెక్కును ఆయన మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మహిళలు పొదుపుతో పాటు చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇంటి, సొంతఅవసరాలకు మంజూరైన రుణాన్ని వినియోగించుకోకుండా ఆర్థికాభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో రుణాలు పంపిణీ చేసి మహిళలకు భరోసా కల్పించడమే ప్రభుత్వలక్ష్యమన్నారు. 60 డివిజన్ల నుండి పెద్దఎత్తున హాజరైన మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మధు, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, డిఎంఎస్ రాజేష్, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్ మేనేజర్లు రవీందర్, ఎల్‌వి సత్యనారాయణ, టిఎల్ఎఫ్ బాధ్యులు ఎంఎ సబీరాభేగం, భారతి, ప్రవల్లిక, స్వరూప, మాజీ కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర రావు, భూక్య శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణాచారి, నాయకులు వాసిరెడ్డి మురళి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, నేరెళ్ల రమేష్, గణేష్, కొమారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క – సారలమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ధర్మారం మండలంలోని వివిధ గ్రామాలలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ధర్మారం మండలంలో పర్యటించి ఎంపిడిఓ కార్యాలయంలో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దొంగతుర్తి గ్రామానికి 11 వేల భక్తులు, నంది మేడారం గ్రామానికి 9 వేల మంది భక్తులు, నంది మేడారం కు 6 వేల మంది భక్తులు ,ధర్మారం కు 5 వేల మంది భక్తులు, కటికనపల్లి కు 10 వేల మంది భక్తులు, కొత్తూరు కు 6 వేల మంది భక్తులు, ఎర్ర గుట్టపల్లి కు 8 వేల మంది భక్తులు సమ్మక్క సారలమ్మ జాతర కోసం వస్తారని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అంచనాలు తయారు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ధర్మారం మండలంలో వివిధ గ్రామాలలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజన సంక్షేమ శాఖ నుంచి 272 కోట్ల రూపాయలు కేటాయించి మేడారంలో శాశ్వత నిర్మాణాలు చేశారని మంత్రి తెలిపారు. ధర్మారం మండలంలో సమ్మక్క సారలమ్మ జాతర జరిగే గ్రామాలకు 4 పంచాయతీ కార్యదర్శులను ఇంచార్జి గా నియమించడం జరిగిందని అన్నారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతరకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని అన్నారు.జాతర సందర్భంగా గ్రామాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, అక్కడ ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే సంబంధిత మండల పంచాయతీ అధికారి దృష్టికి తీసుకుని రావాలని మంత్రి తెలిపారు. గ్రామాలలో సమ్మక్క సారలమ్మ జాతర వద్ద గద్దల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్.డి.ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. జాతర నిర్వహణకు సంబంధించి అవసరమైన విద్యుత్ పోల్స్ ఏర్పాటుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. 2 సంవత్సరాలకు ఒకసారి జరిగే జాతరకు మండలం లోని ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా వచ్చే అవకాశం ఉంటుందని, స్థానిక ప్రజా ప్రతినిధులు, జాతర నిర్వహణ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అధికారులు అవసరం ఏర్పాట్లు చేయాలని అన్నా రు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ధర్మారం మండలంలోని వివిధ గ్రామాలలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని అన్నారు. జాతరకు తక్కువ సమయం ఉన్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉండాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతకు ముందు మంత్రి ధర్మారం మండల కేంద్రంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి సందర్శించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, తహసిల్దార్ డి. శ్రీనివాస్, ఎంపిడిఓ వేముల సుమలత , సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి కవర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఉద్యానశాఖ 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న మామిడి కవర్లను మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి అర్చన తెలిపారు.ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 36 వేల ఎకరాల్లో మామిడిసాగు ఉన్నప్పటికీ జిల్లానుండి విదేశీ ప్రమాణాలకు తగినట్లు మామిడికాయ నాణ్యత లేకపోవడంతో తక్కువ పరిమాణంతో విదేశాలకు ఎగుమతి జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.మామిడికాయ అభివృద్ధి చెందే దశలో అకాలవర్షాలు,గాలులతో నేలకు రాలకుండా ఆపదలతోపాటు కీటకాల నుండి ఈ సంచులు రక్షణ కల్పించి మంచి నాణ్యమైన మామిడిసాగు తో అధిక దిగుబడి లభిస్తుందన్నారు. సమీకృత ఉద్యాన మిషన్ ప్రోగ్రాంలో భాగంగా మామిడిరైతులకు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న మామిడికాయ కవర్లను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. ఫ్రూట్ కవర్లను అమర్చడం వల్ల కాయ నాణ్యతా ప్రమాణాలు విదేశాలకు ఎగుమతి చేసేలా కాయ నాణ్యత లభిస్తుందన్నారు. ఒక్కో ఎకరానికి 8 వేల ఫ్రూట్ కవర్లను అమర్చుకోవాలని ఒక్కో కవర్ కి 1.25 రూపాయల చొప్పున రూ.10 వేలు సబ్సిడీ అందజేయడం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 89777404 2,83 09145109 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ విస్తరణ అధికారి వంశీకృష్ణ ఉన్నారు.

## నేటి నుండి వన్యప్రాణుల సర్వే

**ప్రజాపక్షం/ధర్మపురి :** ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ (ఎఐటిఇ) 2026 లో భాగంగా నేటి నుండి ధర్మపురి రేంజి పరిధిలో వన్యప్రాణుల గణన చేపట్టనున్నట్లు అటవీశాఖ ధర్మపురి రేంజ్ అధికారి శ్రీనాథ్ తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించి సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. వన్యప్రాణి సర్వే విధానాలు, ఫీల్డ్ భాద్యతలపై రేంజి సిబ్బంది, వాలంటీర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ ఆర్వో మాట్లాడుతూ.. వన్యప్రాణి సర్వేలు ప్రతిరోజు ఉదయం 6 నుండి 9.30 వరకు చేపట్టనుండగా మాంసాహారి జంతువుల సర్వే 20 వ తేదీ నుండి 22 వరకు 5 కిలోమీటర్ల ట్రైల్ లైన్స్ వెంట ప్రత్యక్ష దర్శనం,కాళ్ళ అడుగుల గుర్తులు,మలము, గీతలు,శబ్దాలు వంటి పరోక్ష ఆధారాలపై నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే శాఖాహారి జంతువుల సర్వే 23 నుంచి 25 వరకు 2 కి.మీ పరిధిలో ప్రతీ 400 మీటర్ల మొక్కలు,గడ్డిజాతులు,కలుపు మొక్కలను పరిశీలించి వాటిని తినేందుకు వచ్చే జంతువుల గణన చేయనున్నట్లు తెలిపారు.ఈ లెక్కింపు దేశవ్యాప్తంగా ప్రతీ 4 సంవత్సరాలకు ఒకేసారి చేపట్టే జాతీయ స్థాయి కార్యక్రమంగా ఎఫ్ ఆర్వో శ్రీనివాస్ వివరించారు.ఈ సర్వేలో డిప్యూటి ఆర్ఒలు,సెక్షన్,బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొననున్నట్లు ఫారెస్ట్ ఆర్ఒ తెలిపారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థినులకు జిల్లా సెషన్స్ కోర్టులో అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా వావిలపల్లిలోని ఆల్ఫోర్స్ గర్ల్స్ ఈ టెక్నో పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు న్యాయవ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు భాగంగా జిల్లా సెషన్స్ కోర్టును ఫీల్డ్ ట్రిప్‌గా సందర్శించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ వాణి మేడం నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో రెండవ అదనపు మొదటి తరగతి న్యాయమూర్తి వెంకట సత్య రాజు కిరణ్ విద్యార్థినులకు కోర్టు విధానాలు, న్యాయ ప్రక్రియలు, కేసుల విచారణ విధానం, న్యాయస్థానాల ప్రాముఖ్యత వంటి అంశాలపై సవివరంగా వివరించారు. విద్యార్థినులు అడిగిన వివిధ ప్రశ్నలకు న్యాయమూర్తి గారు ఓర్పుతో సమాధానాలు ఇవ్వడంతో పాటు, చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని, న్యాయవ్యవస్థలో పౌరుల పాత్రను స్పష్టంగా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థినుల్లో చట్టంపట్ల గౌరవం, న్యాయస్ఫూర్తి మరియు బాధ్యతాభావాన్ని పెంపొందించిందని ఉపాధ్యాయులు తెలిపారు.

## అక్రమంగా నిలువచేసిన ఇసుక డంపుల పట్టివేత



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని వాల్గోండా గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఈ దాడుల్లో మూడు ఇసుక డంపులు గుర్తించి 35 ట్రిప్పుల ఇసుక ట్రాక్టర్ల అక్రమ ఇసుకను పట్టుకుని సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు జిపిఒలు విఆర్ఎలు,తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సందర్శన



**ప్రజాపక్షం /చందుర్తి :** మండలం లోని ఆశిరెడ్డి పల్లి గ్రామం లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను గ్రామ సర్పంచ్ బొజ్జ మల్లేశం సోమవారం చందుర్తి ఎంపిడిఒ రాధ తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తో పేదప్రజల సొంతింటి కల నేరవేరుతుందన్నారు.స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను తొందరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారం తో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.గ్రామ కార్యదర్శి మహేష్ , ఫీల్డ్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీ–3 ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పనితీరుపై నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి ఆర్‌జీ–3 పరిధిలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడిందని రాణి రుద్రమదేవి గ్రౌండ్ అభివృద్ధి పేరుతో లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి, తర్వాత పూర్తిగా వృథాగా వదిలేయడం జరిగింది.అనిప్రజలకు ఉపయోగపడేలా క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రాణి రుద్రమదేవి గ్రౌండ్‌లో గడ్డి, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కానీ పనులు పూర్తయిన తర్వాత సరైన నిర్వహణ లేకపోవడం వల్ల, నాటిన గడ్డి మొత్తం ఎండిపోయి మైదానం నిరుపయోగంగా మారింది. నీటి వసతి, పర్యవేక్షణ, సంరక్షణ ఏదీ లేకపోవడంతో లక్షల రూపాయల ఖర్చు చేసిన అభివృద్ధి పనులు దెబ్బతిన్నాయి.ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యమే కాకుండా ప్రజాధనానికి జరిగిన ఘోరమైన దుర్వినియోగంగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పనులకు సంబంధించిన నిధులు ఎలా ఖర్చయ్యాయి, ఎవరి పర్యవేక్షణలో పనులు జరిగాయి, నిర్వహణ బాధ్యత ఎవరిదన్న అంశాలపై స్పష్టత లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.అందుకే సింగరేణి ఆర్‌జీ–3 ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేస్తు.ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అంచనా వ్యయం, బిల్లులు, పనుల నాణ్యత, నిర్వహణ లోపాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.ఇది రాజకీయ అంశం కాదు, వ్యక్తిగత ఆరోపణ కాదు. పూర్తిగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయం. ప్రజల డబ్బు ప్రజలకే ఉపయోగపడాలి. ఇలాంటి నిర్లక్ష్యానికి భవిష్యత్తులో తావు లేకుండా చర్యలు తీసుకోవాలి.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రాణి రుద్రమదేవి గ్రౌండ్‌ను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు ముల్మూరి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## అందుబాటులోకి వెయ్యి పడకల ఆసుపత్రి

**మాజీ మంత్రి హరీష్‌రావు**



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేటలో గత ప్రభుత్వ హయాంలో 10 కోట్లతో నిర్మించి పూర్తి దశకు చేరుకున్న ఆయుష్,యునాని, హోమియో ఆసుపత్రి వైద్య సేవలను వచ్చే 15 రోజుల్లో అందుబాటులోకి తేవాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిని మాజీ మంత్రి హరీష్‌రావు సందర్శించారు. మిగు లు పనులపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్య ఆరోగ్య ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియన్, టిజిఎం ఐడిసి ఎండి ఫణిందర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్‌శశిదర్, ఈఈ రవీందర్‌రెడ్డిలతో మాట్లాడారు. ఆయుష్‌ఆసుపత్రికి సంబంధించిన అన్ని సేవలు అందుబాటులో తేవాలన్నారు. ఫర్నిచర్ ఇతర మౌళిక వసతులు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఆయుష్ ,యునాని, హోమియో కి సంబంధించిన వైద్యులను ,థెరపిస్టులను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు సేవలను అందించాలని కోరారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్న వెయ్యి పడకల ఆసుపత్రి పనులను ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.జూన్‌నెలలో ప్రజలకు వెయ్యి పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చి వైద్య సేవలను అందించాలన్నారు. వెయ్యి పడకల ఆసుపత్రి పూర్తయితే ఎంఆర్ఐ స్కాన్, క్యాత్ లాబ్, క్యాన్సర్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. హైదరాబాద్ వెళ్లే పరిస్థితి ఉండదని, పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కరీంనగర్ రోడ్డు అసంపూర్తిగా ఉన్న నర్సింగ్ కళాశాల పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. రెండు సంవత్సరాలుగా పనులు జరగటం లేదని పనులు వేగవంతం చేసి జూన్‌లో వైద్య కళాశాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన గల సెంట్రల్ డ్రగ్ స్టోర్ సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జంగిటి కనక రాజు, అల్లం ఎల్లం. ప్రశాంత్, అరవింద్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్. ఇర్షద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

**ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మహిళా సంఘాల ద్వారా మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామన్నారు. సోమవారం రోజున పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వడ్డీ లేని ఇందిరా శక్తి రుణాలను చెక్కుల ద్వారా మహిళా సంఘాలకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి మున్సిపాలిటి కి సంబంధించి 2023–24, 2024–25 సంవత్సరానికి విడుదలైన వడ్డీలేని ఋణాలు అలాగే 490 సంఘాలకు గాను అమౌంట్ రూ.1,03, 67,848.00 సంఘాల అకౌంట్లోకి విడుద ల కావడం జరిగింది. పెద్దపల్లి మున్సిపాలిటి 2024–25,2025–26 సంబంధించి 36 కొత్త మహాళా సంఘాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రమాద భీమా, లోన్ భీమా కింద మొత్తంరూ. 34,65,950 అందించడం జరిగిందనీ, ఇందిరా మహిళా శక్తి పథకం పై మహిళలకు ఇండివిజువల్ ,గ్రూప్ యూనిట్ల క్రింద కేటరింగ్ సర్వీసెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, డైరీ ప్రాజెక్ట్స్, ఫ్యాన్సీ స్టోర్, సూపర్ మార్కెట్, సారీ సెంటర్స్ ;మొబైల్ క్యాంటిన్ మొదలగు వాటిలో ఉపాధి అవకాశం కల్పిస్తూ (124) సంఘాల సభ్యులకు గాను రూ.409.69 ఋణాలు బ్యాంకు లింకేజి, ద్వారా లోన్లు మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మున్సిపల్లో జీరో వడ్డీ డబ్బులు ప్రభుత్వం అమలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ ,మున్సిపల్ అధికారులు, నియోజకవర్గం మహిళా సంఘాల సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో బ్లాక్ స్పాట్స్ పరిశీలన



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు మేరకు రోడ్డు ప్రమాదాల నివారినే ప్రధాన లక్ష్యంగా సురక్షితంగా గమ్యస్థానాలకి ప్రతి ఒక్కరు చేరుకోవాలని ఉద్దేశంతో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి, అప్పన్నపేట, గొల్లపల్లి–ఎక్స్ రోడ్ మరియు పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతాల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్స్‌ను పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ , అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీ హెచ్.కే.ఆర్ హైవే అథారిటీ సిబ్బందితో కలిసి సందర్శించి జరిగిన ప్రమాదాల గల కారణాలపై విశ్లేషించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణాలను అధ్యయనం చేసి, భవిష్యత్తులో ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో విస్తృతంగా చర్చించారు. రోడ్డు మార్కింగ్‌లు, సైన్‌బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి భద్రతా చర్యలను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు.రోడ్డు భద్రత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## అనుమానంతో భార్య గొంతుకోసిన భర్త

**అడ్డొచ్చిన కూతురిపై రోకలిబండతో దాడి చేసి.. ఆత్మహత్యా యత్నం చేసిన భర్త**



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** భార్యపై అనుమానంతో గొంతు కోసి..అడ్డొచ్చిన కూతురుపై రోకలిబండతో దాడి చేసి.. తాను ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించింది. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన దున్నపోతుల ఎల్లయ్య,భార్య శ్రీలత (32), కొడుకుఅజయ్‌తో కలసి పట్టణంలోని అదర్శనగర్‌లో గత పదేండ్లుగా నివాసముంటున్నారు. కాగా కొద్ది రోజుల క్రితం దున్నపోతుల ఎల్లయ్య బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి పది రోజుల క్రితం మళ్లీ సిద్దిపేటకు వచ్చి సిద్దిపేట ఆదర్శనగర్‌లో వచ్చి కూలీచేసుకుంటు ఇక్కడే నివాసముంటున్నారు. ఎల్లయ్యకు మొదటి నుండి భార్య శ్రీలత ప్రవర్తనపై అనమానం పెంచుకున్నారు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన ఎల్లయ్య భార్య శ్రీలతపై గొడవ పడి గొంతు కోశారు. అలాగే అడ్డువచ్చిన కూతురు హర్షిత రోకలిబండతో కొట్టారు. వారు ప్రతిఘటించటంతో రోకలిబండతో దాడి చేసి కొట్టి ఇంకా చావక పోవటంతో పురుగుల మందును బలవంతంగా తాగించారు. ఇది గమనించిన కొడుకు అజయ్ ఇంట్లో నుండి పారిపోయి చుట్టుప్రక్కల వారికి సమాచారం అందించారు. కాలనీ వాసులు, పోలీసులు అక్కడకు చేరుకోగానే భయందోళనకు గురైన ఎల్లయ్య తాను సైతం గొంతును కోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించారు. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో శ్రీలత మృతిచెందారు. హర్షిత. ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హర్షిత మిట్టపల్లి కెజివిపిలో పదవతరగతి చదువుతుండగా కొడుకు అజయ్ హైదరాబాద్ కీసరలో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎసిపి రవీందర్‌రెడ్డి. టూటౌన్ సిఐ ఉపేందర్‌లు పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో టూటౌన్ సిఐ ఉపేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహార చెల్లింపులు జిల్లా స్థాయిలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వానికి పరిహార ప్రతిపాదనలు కూడా ఎప్పటికప్పుడు సమర్పించాలని అన్నారు.ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ స్కాలర్ షిప్ లకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునెలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పెండింగ్ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల స్థితిగతుల గురించి కలెక్టర్ రివ్యూ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌సి అభివృద్ధి అధికారి రవీందర్, ఆర్‌డిఒలు గంగయ్య, సురేష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ప్రతీ పాఠశాలను ప్రత్యేక అధికారులు సందర్శించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రత్యేక అధికారులు జిల్లాలోని ప్రతి పాఠశాలను సందర్శించి అక్కడి మౌలిక వసతులు సహా పలు అంశాలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమానంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు జిల్లాలోని ప్రతి పాఠశాలలను ప్రత్యేక అధికారులు సందర్శించాలని ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక తరగతులు, ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు, విటమిన్ గార్డెన్ నిర్వహణ, ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఏవైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వర్షపు నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు ఎక్కడెక్కడ జరిగాయో వాటికి సంబంధించిన ఫోటోలను జిపిఎస్ ద్వారా నిర్దిష్ట వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేయాలని, నిర్దిష్టమైన పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విటమిన్ గార్డెన్ల నిర్వహణ, సాయంకాలం తరగతులను ప్రత్యేక అధికారులు పరిశీలించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో ఐదు క్లబ్బులు ఏర్పాటు చేశామని, వాటి పనితీరును తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్‌డిఒలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

**ప్రజావాణి కి 250 దరఖాస్తులు**

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి వెను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. మొత్తం 250 దరఖాస్తులు వచ్చాయి.

## చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యపూర్ గ్రామంలో శివారులో ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా నిర్మించబోయే చెక్ డ్యామ్ నిర్మాణానికి సోమవారం ఎంపిడిఒసురేష్ ,గ్రామ సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ తో పాటు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్, ఉపాధి హామీ ఎపిఒ దయమని, టెక్నికల్ అసిస్టెంట్ ఈసి, ఉప సర్పంచ్ కలవేన సమ్మక్క చేరాలు,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహిళల గౌరవాన్ని పెంపొందించేలా ప్రభుత్వం పనిచేస్తుంది : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మున్సిపల్ పరిధిలో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బిచ్కుంద పట్టణకేంద్రానికి చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తూ వారి గౌరవాన్ని పెంపొందించేలా పనిచేస్తుందన్నారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ పేదల అభ్యున్నతి కొరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి దేశ అభివృద్ధికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, మండల పార్టీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే తోట సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో సోమవారం మద్నూర్ మండలకేంద్రంలోని గురు ఫంక్షన్‌హాల్‌లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నుండి పెద్ద ఎత్తున నాయకులు, ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి వారిని సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, భావజాలం చాలా గొప్పదని కొనియాడారు. ప్రతీ పేదవానికి కూడు, గూడు, గుడ్డ అందించి వారు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎల్లప్పుడు పేదల అభ్యున్నతి కొరకే పాటుపడుతుందని తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు మొదలగు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బిజెపి జిల్లా యువ నాయకుడు ఆర్.కృష్ణపటేల్, బొమ్మ శ్రీరామ్, బిచ్కుంద బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గణేష్‌గొండతో పాటు ఆయా పార్టీల వారు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, మండల అధ్యక్షులు, స్థానిక సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### ఎమ్మెల్యే రోహిత్‌రావు

**ప్రజాపక్షం/రామాయంపేట :** గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం మహిళా గ్రూపులకు వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. డ్రాక్రా మహిళలకు చీరలు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రామాయంపేట పట్టణంలో సుమారు 25 ఎకరాల్లో 2వందల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్‌కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలకు ఉచిత విద్యుత్ పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, నాయకులు రమేష్‌రెడ్డి, సరాపు యాదగిరి, బండారి మహేందర్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని చేపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సారంగి శాంతికుమార్, ఉపసర్పంచ్ సింధుకర్ చరణ్ వార్డు సభ్యులకు సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని, తన వెన్నంట ఉండి తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, శ్రీనివాస్, రాంసన్, రాజు, పోశెట్టి, సంజీవ్, సాయన్న, నితిన్‌రాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

## కోర్టును త్వరగా ప్రారంభించాలి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భీమ్‌గల్‌లో మంజూరు చేసిన కోర్టును త్వరగా ప్రారంభించాలని కోరుతూ జిల్లా జడ్జి భారత లక్ష్మిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కన్న సురేందర్, మల్లెల లక్ష్మణ్ సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్జి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జడ్జికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కోర్టు కార్యకలాపాలను త్వరగా ప్రారంభించాలని కోరుతూ జడ్జిని కోరారు. దీనిపై జడ్జి సానుకూలంగా స్పందించారని త్వరలోనే కోర్టు కార్యకలాపాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వీరి వెంట అడ్వకేట్ సూర సురేష్ ఉన్నారు.

# పసుపు సాగుపై దృష్టిని కేంద్రీకరించాలి

### ఆర్గానిక్ పసుపు పంటకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్
### పసుపు బోర్డు తొలి వార్షికోత్సవం సభలో ఎంపి, కలెక్టర్ వెల్లడి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆర్గానిక్ పసుపు పంటకు విస్తృతస్థాయిలో డిమాండ్ ఉన్నందున సేంద్రీయ విధానంలో పసుపు పంట సాగుపై దృష్టిని కేంద్రీకరించాలని ఎంపి అరవింద్, కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు పిలుపునిచ్చారు. జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసి యేడాది పూర్తయిన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో తొలి వార్షికోత్సవ సభ, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బోర్డు ఏర్పాటైన ఫలితంగా ఇక్కడి పసుపు పంటకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఏర్పడుతోందని విదేశాలకు జిల్లా పసుపు పంటను పరిచయం చేయటంలో బోర్డు సఫలీకృతం అయ్యిందన్నారు. మున్ముందు బోర్డు ద్వారా పసుపు రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా చూస్తే పసుపు పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పసుపు రైతుల సాధకబాధకాలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని, వారికి ప్రభుత్వపరంగా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహకారమందిస్తామని భరోసా కల్పించారు. రైతులు పురాతన సాంప్రదాయ పద్ధతులకు బదులుగా అందుబాటులోకి వచ్చిన ఆధునిక, సాంకేతిక విధానాలలో నాణ్యమైన పసుపు పంటను సాగు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పంట సాగుకే పరిమితం కాకుండా పసుపు ప్రాసెసింగ్ విధానాలలోనూ శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలని, ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన పద్ధతులపై అవగాహన పెంపొందించుకోలన్నారు.

ఈ దిశగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించటంజరుగుతుందని పసుపు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముప్ప గంగారెడ్డి, శ్రీనివాస్‌రావు, అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

### సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 47 మంది లబ్ధిదారులకు సిర్పూర్ శాసనసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సోమవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. పట్టణంలోని సర్ సిల్క్ ఏరియా వార్డు నంబర్లు 1,2,3,16తోపాటు ఓల్డ్ కాలనీలోని 15వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు ఈ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ గృహ నిర్మాణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని కోరారు. వార్డులలో నెలకొన్న ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సంబంధిత శాఖలు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన వేములూరి వెంకటేశ్వర్ తన కూతురుకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం నందికొండకు చెందిన టాకిరే పద్మ, జైనూర్ మండలం రాంజీ గూడాకు చెందిన కోవ సుమిత్ర తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. జైనూర్ మండలం దుబ్బాగూడకు చెందిన పెందూర్ జంగు కుటుంబ ఆస్తి వాటా కోసం, కౌటాల మండలం మొగడ్ దగడ్‌కు చెందిన నరులే గను ఆన్‌లైన్‌లో మిస్సింగ్ అయిన భూమి వివరాల నమోదు కోసం విన్నవించారు. అలాగే జనకాపూర్‌కు చెందిన ఆనంద్ రావు తన తండ్రి పేరిట గల పట్టా భూమిని విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించాలి

### జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** మండలంలోని శ్రీరాంపూర్ ప్రాంతంలోని ముక్కిడి పోచమ్మ గుడి వద్ద సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతరకు వేలాది మంది భక్తులు హాజరవుతారని, వారికి తాగునీరు, నిరంతర విద్యుత్, పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జాతర పరిసరాల్లో నిరంతరం శుభ్రత పనులు చేపట్టేలా ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్స్ సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అన్ని విభాగాలు సమిష్టిగా పనిచేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జిఎం సత్యనారాయణ, డిజిఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, ఇన్చార్జి డిజిఎం పర్సనల్ ఎం రాజేష్, సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, సీనియర్ పిఓ సురేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

### బైంసాలో మెప్మా సంఘాలకు 92లక్షల 62వేల 329 రూపాయల రుణవడ్డీని అందజేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బైంసా :** మహిళ సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.సోమవారం బైంసా మున్సిపాల్ కార్యాలయంలో మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 92,62,329 రూపాయల రుణ వడ్డీచెక్కును అందించిన సందర్భంగా మాట్లాడారు.బ్యాంక్ అప్పుల ను చెల్లిస్తూ అధికంగా రుణాలను తీసుకుంటు ఆర్థిక అభివృద్ధి సాధించాలని చెప్పారు.సంఘాల సభ్యులు రుణాలను చెల్లిస్తూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్లాలన్నా ఉద్దేశ్యం తో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తుందన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని జిలా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం బాసర ఐఐటీ సమావేశ హాల్లో నూతనంగా ఎన్నికైన బైంసా, లోకేశ్వరం మండలాల సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ శిబిరానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో సర్పంచ్ పదవి అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పంచాయతీరాజ్ చట్టం, సర్పంచ్ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సర్పంచ్‌లు కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం,ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు,మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లను వారి విధులు,బాధ్యతలపై ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాస్,డిపిఓ శ్రీనివాస్,తహసిల్దార్ పవన్ చంద్ర,ఎంపీఓ తిరుపతి రెడ్డి,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో శంకర్, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/తానూర్ :** గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడాకారులో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ శ్రీధర్, ఎమ్మార్వో మహేందర్‌నాథ్, సర్పంచ్ జాదవ్ సుగంధ బాయిమాధవరావు పటేల్, పేర్కొన్నారు. సోమవారం జడ్పిహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో సిఎం కప్ క్రీడ పోటీలను వారు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని కాసేపు కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీధర్ మాట్లాడుతూ.. మండలంలోని 7క్లస్టర్లకు 474 దరఖాస్తులు వచ్చాయని, క్లస్టర్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 28 నుంచి మండల స్థాయి పోటీలు ఉంటాయని,ఆటలలో ప్రతిభ చూపాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, శరీరం దృఢంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫారుక్,ఏఎంసీ డైరెక్టర్ మౌలాఖాన్, ప్రధానోపాధ్యాయుడు తాలోడ్ సాయిబాబు,వ్యాయామ ఉపాధ్యాయులు దేవేందర్,అఖిల,వార్డు సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్లస్టర్ లెవెల్ పోటీలు ఘనంగా ప్రారభం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండంపెల్లిలో సోమవారం రోజున గుండంపెల్లి, సముందర్‌పల్లి గ్రామపంచాయతీలకు సంబంధించి సిఎం కప్ క్లస్టర్ లెవెల్ పోటీలు ఘనంగా ప్రారంభించబడ్డాయి.ఈ పోటీలను గుండంపల్లి గ్రామ సర్పంచ్ తక్కల రమణారెడ్డి,సుమున్ దర్ పల్లీ గ్రామ సర్పంచ్ జంగం రాధిక,మండల విద్యాధికారి పి.సదానందం దిలావర్‌పూర్ సబ్ ఇన్స్‌పెక్టర్ రవీందర్,స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు సిలారిలు పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు,వివిధ గ్రామాల యువత పాల్గొన్నారు. వివిధ పోటీలలో ఎంపికైన అభ్యర్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయి తెలిపారు.

## సర్పంచ్‌లు పాలనపై పట్టు సాధించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ :** నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు నిష్పక్షపాతంగా గ్రామాల్లో పని చేసి పల్లె పాలనపై పట్టు సాధించాలని,ప్రతి ఊరిలో సుపరిపాలనకు బాటలు వేసే దిశగా అడుగులు వేయాలని నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సర్పంచుల పనితీరుతోనే రాష్ట్రంలో గ్రామాలకు గుర్తింపు వస్తుందని, గ్రామాల్లోని సర్పంచులు గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృధి చేయాలని కలెక్టర్ కోరారు. నిరుపేదల అభివృద్ధి సర్పంచులతోనే సాధ్యమని, గ్రామ స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా మంచి, చెడుల న్యాయ నిర్ణేత సర్పంచ్‌లేనని, కుల, మత, జాతి రాగద్వేశాలకు అతీతంగా పనిచేయాలన్నారు. మెదక్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ రవీందర్, డిపివో యాదయ్య, జెడ్పి సిఇఒ ఎల్లయ్య, డిఆర్డీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు పంచాయతీ చట్టాలపై పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు డిఎల్‌పివో సురేష్, సాయిబాబా, ఎంపిడిఓ లు చిన్న రెడ్డి, షాజీవోద్దీన్, తిరుపతి రెడ్డి, మోజామ్, మహిపాల్ రెడ్డి, ముజీబ్, సర్పంచ్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేత



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మహిళా శక్తి సంబరాల్లో భాగంగా నిర్మల్ పట్టణానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.2,72,16,714 (రెండు కోట్ల డెబ్బై రెండు లక్షల పదహారు వేల ఏడువందల పదనాలుగు) రూల చెక్కును నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మహిళా సంఘ సభ్యులకు అందజేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఈ వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ టియుఐఎఫ్‌డి నిధుల ద్వారా మంజూరైన 11.50 లక్షలతో 2, 6, 9 వార్డులలో సీసీ రోడ్లకు, డ్రైనేజీలకు కాంగ్రెస్ నాయకులు సోమవారం భూమిపూజ చేసి అధ్యక్షులు బోదిరె స్వామి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల్లో కల్పనకు ఎంతగానో కృషి చేస్తుందన్నారు. దీంట్లో భాగంగానే పట్టణంలో డ్రైనేజీ రోడ్డు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అనంతరావు, నాయకులు ఆయా వార్డుల మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఖానాపూర్, కాలూర్, సారంగాపూర్ డివిజన్లలో మొత్తం రూ.5.69 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఖానాపూర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు, కాలూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో పట్టించుకోని ఖానాపూర్, కాలూర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే ఖానాపూర్‌కు రూ.442 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు చేశామని గుర్తు చేశారు. రూ.673.73 కోట్లు మంజూరు చేసి పనులు చేశామన్నారు. సారంగాపూర్‌కు మాత్రమే ఇప్పటివరకు 387.06 కోట్ల పనులు చేశామన్నారు. బీఆర్ఎస్, బీజేపీని నమ్మి ఓట్లు వేస్తే నిజామాబాద్ కార్పోరేషన్ అభివృద్ధి చెందదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేయవచ్చున్నారు. కార్యక్రమంలో గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, రాములు, గంగానర్సయ్య, భోజన్న, నరేష్, రాజేందర్, రాజలింగం, బాగారెడ్డి, గంగారెడ్డి, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హన్మాండ్లు, సాయిరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
20-01-2026
www.prajapakasham.in

టాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజ హెగ్డే తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించడంతో, ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.


రీల్




## 'కొరియన్ కనకరాజు' టైటిల్ గ్లిమ్స్

నాగబాబు కొణిదెల నట వారసుడు యాక్షన్ సినిమాలపై దృష్టి పెట్టారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఫిదా సినిమా సక్సెస్ తరువాత ఆ స్థాయిలో సక్సెస్ కోసం వరుణ్ తేజ్ తాపత్రయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మేర్లపాక గాంధీ దర్శకత్వంలో చేస్తున్న సినిమాపై వరుణ్ తేజ్ భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు'గా నామకరణం చేశారు. వరుణ్ తేజ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేశారు. టైటిల్ గ్లిమ్స్‌ను కూడా విడుదల చేశారు. లుంగీ కట్టుకుని, కత్తిపట్టి కొరియన్లను నరికె సన్నివేశాలను టీజర్‌లో పొందుపరిచారు. ఈ టీజర్‌లో కమెడియన్ సత్య, హీరోయిన్ రితిక నాయక్ కూడా కనిపిస్తారు. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్న సినిమా అనే విషయం ఈ టీజర్‌లో స్పష్టమవుతోంది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్న ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్–కామెడీ, ఇండియన్ అండ్ కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. కమెడియన్ సత్య మరో కీలమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్, థమన్ కలసి ఈ సినిమా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది.

## 'చీన్ టపక్ డమ్ డమ్' ప్రారంభం





'శుభం' ఫేమ్ నటుడు గవిరెడ్డి హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'చీన్ టపక్ డమ్ డమ్'. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ నటి సమంత క్లాప్ కొట్టి పూజ కార్యక్రమాలతో ఈ సినిమాను ప్రారంభించారు. దర్శకులు గోపీచంద్, వశిష్ట, నందిని రెడ్డి, ప్రముఖ రచయిత బివిఎస్ రవి కూడా ఈ కార్యక్రమానికి హాజరై ఈ వేడుకకు హాజరై చిత్ర బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై నిర్మించబడుతున్న ఈ చిత్రం, ఆ బ్యానర్‌కు ప్రొడక్షన్ నెం.1. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి నిర్మిస్తుండగా, లోహిత్ దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు. బలమైన వాణిజ్య అంశాలతో కూడిన సరి కొత్త వినోదాత్మక కథను అందిస్తామని నిర్మాతలు చెప్పారు. సాంకేతిక బృందంలో ఏఎస్ ప్రకాష్, సెంథిల్ కుమార్, సంగీత దర్శకుడు ప్రశాంత్ ఆర్ విహారి, సినిమాటోగ్రాఫర్ నిఖిల్ కొడూరు పని చేస్తున్నారు. ఈ చిత్రానికి తిరుపతి జావా, పిఎస్‌డి విఎఫ్ఎక్స్, దివ్య తేజస్వి, విక్రమ్ కండి మాల వంటి వారి సహకారం అందిస్తున్నారు. 'చీన్ టపక్ డమ్ డమ్' చిత్రం హాస్యం, భావోద్వేగాలతో నిండిన ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా అలరిస్తుందని దర్శకుడు లోహిత్ ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభమవుతుందన్నారు.



'అనగనగ ఒకరాజు' హీరో నవీన్ పొలిశెట్టి, హీరోయిన్ మీనాక్షి చౌదరి తమ సినిమా విడుదలైన థియేటర్స్‌లో తిరిగితున్నారు. సోమవారం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. తమ సినిమా మరింత హిట్ కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## యాక్షన్ నేపథ్యంలో 'పల్నాడు'



రోహిత్ వర్మ హీరోగా గోవింద రెడ్డి చందా దర్శకత్వంలో క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై రూపొందుతున్న సినిమా పల్నాడు. యాక్షన్ ఓరియెంటెడ్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో రియా సుమన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా నిర్మాతలు తాజాగా యాక్షన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు పల్నాడు అని టైటిల్ పెట్టారు. ఎగిరే నిప్పురవ్వల బ్యాక్ డ్రాప్‌లో హీరో మండుతున్న కర్రని పట్టుకొని, పవర్‌ఫుల్‌గా కనిపిసితున్నారు. టైటిల్ లుక్ పోస్టర్ సినిమాపై క్యురియాసిటీ క్రియేట్ చేసింది.ఈ చిత్రంలో హరీష్ ఉత్తమన్, నవీన్ నేని, వినోద్ కుమార్, దేవి ప్రసాద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ అందిస్తున్నారు. రవికుమార్.వి డీవోపీ, ఎడిటర్ చోటా కె.ప్రసాద్ పని చేస్తున్నారు.





## 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్

గీత ఆర్ట్స్ సమర్పణలో స్వప్న సినిమా బ్యానర్‌పై తెరకెక్కుతున్న సినిమా ఆకాశంలో ఒక తార. ఈ సినిమాతో స్వత్విక వీరవల్లి అనే కొత్త హీరోయిన్‌ను పరిచయం చేస్తున్నారు. పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఇసినిమా టీజర్ విడుదల చేశారు. హీరోయిన్ సాత్విక వీరవల్లిని పరిచయం చేస్తూ ఈ టీజర్‌ను రిలీజ్ చేశారు. లంగా ఓనిలో అచ్చమైన పదహారణాల తెలుగు అమ్మాయిలా కనిపిస్తోంది సాత్విక. 'నేను ఆకాశంలోకి ఎలా వెళ్ళాలి.. రోడ్డు కూడా సరిగ్గాలేని ఈ ఊరి నుంచి ఆకాశానికి నిచ్చెనేసేశావా.. ముందు ఈ ఊరు పొలిమేర దాటి చూపించు' అనే డైలాగులతో ఈ టీజర్‌ను రూపొందించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ ప్రేమకథను తెరకెక్కిస్తున్నట్టు ఈ టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాను ఈఏడాది వేసవి సెలవుల్లో విడుదల చేయడనికి సన్నాహాలు చేస్తున్నారు.

## బండ్ల గణేష్ 'సంకల్ప యాత్ర'

సంకల్ప యాత్ర పేరుతో సినిమా నిర్మాత బండ్ల గణేష్ షాద్ నగర్ నుంచి తిరుమలకు యాత్రాగా బయలుదేరారు. ఇది రాజకీయ యాత్ర కాదు. దైవ సంకల్పం. దేవుడికి మొక్కుకున్న మొక్కు. దేవుడు నా కోరిక తీర్చినందుకు రుణం తీర్చుకోవడానికి చేస్తున్న యాత్ర ఈ సందర్భంగా అన్నారు ఈ సందర్భంగా మీడియాతో నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. నా యాత్ర ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదు. నా షాద్ నగర్ ప్రజలు, నాకు ఈ స్థాయి ఇచ్చి, నా జీవితానికి అర్థం చెప్పి, నేనున్నానని ముందుకు నడిపించిన దైవ సమానులు పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ నేను అడుగు ముందుకు వేస్తున్నాను. చిరంజీవిని చూడాలని హైదరాబాద్‌కు వెళ్లాను. ఆయన నటించిన సినిమా నా థియేటర్లో ఆడుతుంది. నేను పాదయాత్ర మొదలు పెడుతున్నాను ఇది భగవంతుని ఆశీస్సులుగా భావిస్తున్నాను అని అన్నారు. బండ్ల గణేష్‌తో పాటు నటుడు శివాజీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది


సుధాకర్ చెరుకూరి

మాస్ మహారాజా రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సంక్రాంతికి విడుదలై విజయవంతంగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాత చెరుకూరి సుధాకర్ మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' బ్రేక్ ఈవెన్ అయింది చాలా హ్యాపీ. ఆంధ్ర మొత్తం ఆల్మోస్ట్ అయింది. ఇది లాంగ్ వీకెండ్ సోమవారం కూడా హాలిడే. నైజంతో పాటు మిగతా ఏరియాలో కూడా అయిపోతాయి.ఆడియన్స్ నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే డిస్ట్రిబ్యూటర్స్ బయ్యర్స్ కూడా చాలా హ్యాపీగా వుండటం మాకు ఎంతో ఆనందం ఇచ్చింది. మేము పండగకి రావాలనే ఈ సినిమాని మొదలుపెట్టాం. 65 రోజుల్లో పూర్తి చేశాం.రెగ్యులర్ రవితేజ సినిమాల కాకుండా పండగకి ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ లాగా ఈ సినిమాని తీసుకురావాలని ఉద్దేశంతోనే ప్రారంభించాం. సినిమాని అడుయన్స్ అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇలాంటి సినిమాలు మరిన్ని చేయాలనే భావిస్తున్నాం. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కి సంక్రాంతి సీజన్‌లో డిమాండ్ ఉంటుందని ఈ సంక్రాంతితో మరోసారి రుజువైంది.రవితేజ సినిమా అన్నిటికంటే ముందు వస్తుందని మాకు తెలుసు. అందుకే ఇదే సినిమా మీద కాస్త ఎక్కువ ఫోకస్ చేయడం జరిగింది. పారడైజ్‌కి మంచి టీం వుంది. మా సొంత మనుషులు ఉన్నారు. అన్ని సినిమాలు కూడా అద్భుతంగా జరుగుతున్నాయినేను అన్ని కథలో వింటాను. కొంతమందికి వినిపిస్తాను. కథ అనుకున్న తర్వాతే బడ్జెట్లన్ని అనుకుంటాం. నాని నటిస్తున్న పారడైజ్ సినిమా మార్చిలోనే తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. ఇద్దరమైతే ఒకేసారి రాము. మేమంతా ఫ్రెండ్స్. సమ్మర్లో బోలెడంత గ్యాప్ ఉంది. పెద్ద సినిమాలు ఏమీ లేవు. నెలకి ఒక్క సినిమా వచ్చినా చాలు. ఇప్పుడే డిస్ట్రిబ్యూటర్స్ మీద రుద్దేసి తప్పు చేశాం. మళ్ళీ అలా జరగకూడదు. పారడైజ్ అయిపోయిన వెంటనే అది మొదలుపెడతాం. అది పిరియాడిక్ బ్యాక్ డ్రాప్ కథ. నాకు అరుంధతి లాంటి సినిమా చేయాలన్న ఉంది. అలాంటి ఒక కథపై కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. శ్రీకాంత్‌ని దసరాతో పరిచయం చేశాం. అలాగే కేజే క్యూ దర్శకుడు కూడా కొత్తవారే. ఆ సినిమా కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అలాగే దుల్కర్‌తో చేస్తున్న సినిమా కూడా కొత్త దర్శకుడే. దుల్కర్, పూజ హెగ్డే కలిసి చేస్తున్న సినిమా అద్భుతంగా వస్తోంది. దుల్కర్ సినిమా అమెరికాలో దాదాపు 35 రోజులు షూటింగ్ ఉంటుంది.

ఇండస్ట్రీలో అందరూ గొప్పగా చెప్పుకునే సినిమా ఒకటి తీయాలని ఉంటుంది. ఆ కల పారడైజ్‌తో తీరిపోతుందని నమ్మకం ఉంది. పారడైజ్ 60 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. ఈ సినిమాని దాదాపు అన్నీ సెట్స్‌లో షూట్ చేస్తున్నాం.

# బిసిలకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్‌కి బుద్ధి చెబుతాం

### 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : బిసిజెఎసి చైర్మన్ జాజుల



ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. బిసి జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు బిసిజెఎసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను నమ్మించి మోసం చేస్తుందని, వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మేడారంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బిసి రిజర్వేషన్లపై చర్చించకుండానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్వహించడం, బిసిలను మరోసారి దగా చేయడమేనన్నారు. బిసిలకు ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాల్సిన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు సమర్థించడం చాలా సిగ్గుచేటు అన్నారు. మెస్సి ఆట కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ బిసిలకు ఇంత అన్యాయం జరుగుతున్న ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బిసిలకు ద్రోహం తలపెడుతున్నాయని, బిసి రిజర్వేషన్లు తగ్గడానికి, స్థానిక ఎన్నికలు జరగడానికి ఈ రెండు పార్టీలే కారణమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బిసి సమాజానికి క్షమాపణ చెప్పి, పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56 శాతం టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లు సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, రెండు రోజుల్లోనే జెఎసి సమావేశం నిర్వహించి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి జెఎసి కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బిసి జెఎసి వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం, మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజం కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ

### 13వ ఏటనే ఫ్యామిలీ న్యూస్ లెటర్ 'సిర్ బార్'ను ప్రారంభించా
### గతంతో పోల్చితే మీడియాలో మహిళా జర్నలిస్టుల ప్రాతినిధ్యం గణణీయంగా పెరిగింది
### ప్రధానమంత్రి మాజీ మీడియా సలహాదారు సంజయ్ బారు



ప్రజాపక్షం/హైదరాబాద్: యజమానులే సంపాదకులుగా మారడం ఈనాడు రామోజీరావు నుంచి ప్రారంభమై నేడు జర్నలిజం కార్పోరేట్ శక్తుల చేతుల్లో బందీ అయిపోయిందని ఎకనామిక్ టైమ్స్ మాజీ సంపాదకులు, ప్రధానమంత్రి మాజీ మీడియా సలహాదారు సంజయ్ బారు అన్నారు. అప్పట్లో జర్నలిస్టులంటే పత్రిక సంస్థల చైర్మన్లకు సైతం అపారమైన గౌరవం ఉండేదని, ఇప్పుడు ఓ జర్నలిస్టు ఎడిటర్‌ను కలవాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'అనుభవాలు–జ్ఞాపకాలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర సమాచార హక్కు మాజీ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు, కార్యదర్శి కె.లక్ష్మణ్ రావు, నాయకులు ఉడయవర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ బారు మాట్లాడుతూ.. దేశంలో కార్పొరేట్ మీడియా పెరిగిందని, పెత్తనమంతా యాజమాన్యాల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ప్రస్తుతం మీడియా అనేది కార్పొరేట్ వ్యవస్థ చేతుల్లో ఉందని, అదాని, అంబానీ లాంటి వారు మీడియా సంస్థలను నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి వార్తలు రావాలన్న యాజమాన్యం పెత్తనం ఉంటుందని, స్వతంత్రంగా పోయే అవకాశం ఉండదన్నారు. 'గతంలో హైదరాబాద్‌లో ఏమి జరుగుతుందో గ్రామాలలో ఉన్న జనానికి, ఊర్లలో ఏమి జరుగుతుందో హైదరాబాద్ ప్రజలకు తెలిసేది కాదు. తమ గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం తెలియజేసేందుకు తొలిసారిగా తన 13 ఏటనే తన తల్లి, తండ్రి పేర్లను కలుపుతూ ఒక ఫ్యామిలీ న్యూస్ లెటర్ 'సిర్ బార్'ను ప్రారంభించాను. ఆ విధంగా తాను జర్నలిజంలో ప్రవేశించాను. అనంతర కాలంలో న్యూస్ టైమ్ ఎకనామిక్ ఎడిటర్‌గా ఉన్న తాను ఎన్‌టిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విమర్శనాత్మక వ్యాసం రాశాను. అయితే అది మరుసటి రోజు పత్రికలో ప్రచురితం కాలేదు. ఎందుకని ఆరా తీస్తే రాజమోజీరావు నిలిపివేయమని చెప్పారు. వెంటనే తాను తన కాలమ్‌ను ఉపసంహరించుకున్నాను' సంజయ్ బారు వివరించారు. భారత ప్రధాని చంద్రశేఖర్ తొలి సారిగా రుణం కోసం ఐఎంఎఫ్ వద్ద దరఖాస్తున్న విషయాన్ని తాను తొలిసారిగా బ్రేకింగ్ వార్తను రాశానని తెలిపారు. తాను జర్నలిజం చదువుకోకపోయినప్పటికీ ఆర్థికవేత్తగా ఉన్న తాను అనుభవంతో జర్నలిస్టుగా మారానని, అప్పటి నుంచి రాజకీయాల గురించి రాయడం మొదలు పెట్టానని చెప్పారు. ఇటీవల మీడియాలో మహిళా పాత్రికేయుల ప్రాతినిధ్యం గణణీయంగా పెరిగిందని, గతంలో ఒకరిద్దరు తప్ప పెద్దగా చెప్పుకోదగిన సంఖ్యలో మహిళా జర్నలిస్టులు లేరన్నారు. తాను ఎక్కడా జరల్నిజంలో చదువుకోలేదని, ప్రతితీ ఉద్యోగ సమయంలోనే నేర్చుకున్నానన్నారు. అప్పటీ వరకు బడ్జెట్ లోటు పాట్లు ఆర్థిక వ్యవహారాలపై మాత్రమే వార్తలను రాసిన తాను ఆ తర్వాత రాజకీయ వార్తలపై కూడా దృష్టి సారించానన్నారు.

## లేరనుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారాలు సాధించడానికి లేదా త్వరిత పరిష్కారాలు సాధించడానికి ఉపయోగపడుతుందా? అని ఆయన ప్రశ్నిస్తూ, ఈ రెండు విషయాలపైనా చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఐక్యరాజ్యసమితిలో ఉన్న 193 సభ్యదేశాలకు ఉన్న సమస్యలను, సంఘర్షణలను, నాటకీయ సవాళ్ళను పరిష్కరించడానికి సమితిలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. తనను శిక్షించేవారు లేరని, తాను శిక్షకు అతీతమని అమెరికా భావిస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టాలకు తాను అతీతమని అనుకుంటూ అమెరికా ప్రభుత్వం శిక్షార్హత లేకుండా వ్యవహరిస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టం కంటే తన అధికారమే ముఖ్యమని భావిస్తున్న అమెరికా తనకు శిక్షార్హత లేదన్నట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బహుళ పక్షాలు కలిసి కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కారాలు సాధించడం అసంబద్ధమైన విషయమని అమెరికా ఒక స్పష్టమైన నమ్మకంతో ఉందని గుటెరస్ విమర్శించారు. అమెరికా కొన్నిసార్లు తన శక్తిని, ప్రభావాన్ని ఉపయోగించడం అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే జరిగిందని కూడా సమర్థించారు. వెనిజులాపై దాడిచేసి ఆ దేశాధ్యక్షుడిని, ఆ దేశ తొలి మహిళను కిడ్నాప్‌చేసి తన దేశ జైలుకు తరలించడం, గ్రీన్‌లాండ్ దీవి వ్యూహాత్మకంగా తమ అధీనంలోనే ఉండాలని డోనాల్డ్ ట్రంప్ మొండి వాదనలు చేయడం వంటి పరిణామాల తర్వాత చాలా రోజులకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పైవిధంగా స్పందించారు. ఐతే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ఐక్యరాజ్యసమితిపై తీవ్ర విమర్శలు చేశారు. దాని మనుగడను కూడా ప్రశ్నించారు. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన జనరల్ అసెంబ్లీ సమావేశంలో డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి మూల లక్ష్యాలను ప్రశ్నించారు. తాను స్వయంగా ప్రపంచంలో వివిధ దేశాల మధ్య ఏడు యుద్ధాలను ఆపాననీ, ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి తనకు సహాయం చేసేందుకు కూడా ముందుకు రాలేదని, ఇక దానితో తాను 'ఐక్యరాజ్యసమితి ఉన్నది మనకోసం కాదని భావించా' అనుకున్నాని ట్రంప్ చెప్పారు.

## ప్రతి ఇళ్లూ మారాలి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి ఖర్చులు భరిస్తూ ఏర్పాటు చేసిన సోలార్ మోడల్ విలేజ్ కార్యక్రమం ఓ ప్రత్యకమైంది తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 గ్రామాల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని, కొడంగల్, బోనకల్ మండలాల్లో పూర్తిగా రాష్ట్రంలో మిగిలిన కొన్ని గ్రామాల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. ఇళ్లపై పై కప్పుల పైన మాత్రమే కాకుండా వ్యవసాయ పంపు సెట్ల పైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 గ్రామాల్లో రూ.1,380 కోట్లు ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుందని తెలిపారు బోకల్ మండలంలోని 22గ్రామాలకు గాను రూ.306కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. బోనకల్ మండలం రావినూతల గ్రామంలో రూ.24కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరం మొత్తం మీద సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఒక కుటుంబం రూ.14వేల వరకు ఆదా చేసుకునే అవకాశం కలుగుతుందని, ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్‌ను ఇంటి అవసరాల కోసం వాడుకునేది వాడుకోగా సంవత్సరం మొత్తంగా కనీసం 1086 సోలార్ విద్యుత్ యూనిట్లను యూనిట్‌కు రూ. 2.57 చొప్పున విద్యుత్ సంస్థలకు విక్రయిస్తే సంవత్సరంలో ఒక కుటుంబానికి కనీసంగా నాలుగు నుంచి ఐదు వేల రూపాయలు మిగులుతుందని వివరించారు. ఇప్పటి వరకు మనం విద్యుత్ సంస్థలకు డబ్బులు చెల్లించాం కాని ఇక నుంచి విద్యుత్ సంస్థలే ప్రజలకు డబ్బులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్రణాళికలు రూపొందించిందని భట్టి వివరించారు. రైతులు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే విధంగా ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని తెలిపారు. ముందుగా రావినూతల గ్రామంలో ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ పనితీరును విద్యుత్ శాఖ రెడ్కో అధికారులతో కలిసి డిప్యూటీసిఎం భట్టి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరణ్‌రెడ్డి, రెడ్కో ఎండి అనీలా, కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి పేదవానికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని భరోసా ఇచ్చారు. సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, చెన్నూర్‌లో 100 పడకల ఆసుపత్రి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జైపూర్ పవర్ ప్లాంట్ విస్తరణ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం 20 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, రైతు భరోసా, బీమా పథకాలను పకడ్బందీగా అ మలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 214 స్వయం సహాయక సంఘాలకు రూ.76.65లక్షల చెక్కును మంత్రులు అందజేశారు. పట్టణంలోని పలు వార్డులలో ముదిరాజ్ భవనం, బైపాస్ సిసి రోడ్లు, ఆస్పిరేషన్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ నితికా పంత్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతున్నామని చెప్పారు. జిల్లాలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సిర్పూర్ ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణానికి 100 పడకల ఆసుపత్రి మంజూరు కావడం సంతోషకరమన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కోసం 18 కోట్లు, తాగునీటి సరఫరా కోసం 35 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వివరించారు. కాగజ్‌నగర్, కౌటాల కేంద్రాల్లో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుతో ఈ ప్రాంత బాధితులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డిఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రెవాల్, డిఎంహెచ్ఓ సీతారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com